నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | గురువారం 23-6-2022 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 260 | పేజీలు:6 | వెల: రూ.1/-

నమ్మలేని నిజాలు

తూటాసంస్కృతి
అమాయకుల మృతి
మారదా స్థితి.

కొత్త పార్టీలు
చీమల పుట్టకోసం
కీర్తి వ్యామోహం.

వచ్చింది వాన
తీర్చింది నేలదాహం
పంటలకాలం

అసమానత
మానవాళి రుగ్మత
మందు సమతా.

వాన రాకకు
నమ్మకాలపూజలు
వరదపాశం

– రేడియమ్
సెల్: 9291527757

త్రినిజాలు

యువకులలో కన్పించును
ఉద్యోగపు ఆరాటం !
గ్యారంటి బతుకు లేదని
స్పష్టతకై పోరాటం !

ప్రజల ప్రతికూలంగా
అగ్ని పథ్ మార్గం !
నిర్ణయాలు కావద్దోయ్
త్రిశంకు స్వర్గం !

– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

అఫ్ఘనిస్తాన్ లో భారీ భూకంపం- 920 మందికి పైగా మృతి



కాబూల్, జూన్ 22 ఆఫ్ఘనిస్థాన్‌లో భూకంపం పెను విధ్వంసం సృష్టించింది. రిక్టర్ స్కేల్‌పై 6.1 తీవ్రతతో వచ్చిన ప్రకంపనలు తీరని విషాదాన్ని మిగిల్చాయి. భూకంపం కారణంగా ఇప్పటి వరకు సుమారు 920 మంది ప్రాణాలను కోల్పోయారు. సమయం గడిచిన కొద్దీ మరణాల సంఖ్య పెరుగుతూనే ఉన్నది. ఇప్పటి వరకు 600 మందికిపైగా గాయపడ్డట్లు అధికారులు తెలిపారు. భూకంపం ధాటికి వందలాది ఇండ్లు నేలమట్టమయ్యాయి. యూఎస్ జియోలాజికల్ సర్వే ప్రకారం.. భూకంప కేంద్రం ఆఫ్ఘనిస్థాన్‌లోని ఖోస్ట్ నగరానికి 44 కిలోమీటర్ల దూరంలో, భూమికి 51 కిలోమీటర్ల లోతులో ఉంది.

భారీ తీవ్రతతో వచ్చిన ప్రకంపనలు పాక్‌లోని లాహోర్, ముల్తాన్, క్వెట్టా వరకు విస్తరించాయి. భారత్‌లోని పలు ప్రాంతాల్లోనూ ప్రకంపనలు నమోదైనట్లు సమాచారం. ఇదిలా ఉండగా పొరుగుదేశం పాకిస్థాన్‌లోనూ భూకంపం సంభవించింది. అయితే, ఇక్కడ ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం సభవించలేదు. అలాగే మలేషియాలో సైతం అర్ధరాత్రి భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై 5.1 తీవ్రతతో ప్రకంపనలు రికార్డయ్యాయి.

సీఎం కేసీఆర్ ఆశీస్సులు తీసుకున్న రెడ్ కో చైర్మన్ సతీశ్ రెడ్డి

హైదరాబాద్, జూన్ 22:తెలంగాణ రాష్ట్ర పునరుత్పాదక శక్తి అభివృద్ధి సంస్థ (తెలంగాణ స్టేట్ రినెవెబుల్ ఎనర్జీ డెవలప్ మెంట్ కార్పొరేషన్) చైర్మన్‌గా నియమితులైన యెరువు సతీశ్ రెడ్డి ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎం ఆశీస్సులను తీసుకున్నారు. తన మీద నమ్మకంతో పదవి అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.సీఎం ఇచ్చిన బాధ్యతలను త్రికరణ శుద్ధితో నిర్వహిస్తానని సతీశ్ రెడ్డి తెలిపారు.

అనంతరం ఆయన, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి, దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవ రెడ్డిలతో కలిసి పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుని మంత్రుల నివాసంలో కలిశారు. తనకు ఈ పదవి రావడానికి సహకరించినందుకు వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి సతీశ్ రెడ్డిని శాలువాతో సత్కరించారు.

కొత్త చరిత్ర సృష్టించిన 'గ్రీన్ ఇండియా ఛాలెంజ్'

హైదరాబాద్, జూన్ 22: పర్యావరణ హితాన్ని కోరుతూ, దేశ వ్యాప్తంగా పచ్చదనం పెంపు లక్ష్యంగా పనిచేస్తున్న గ్రీన్ ఇండియా ఛాలెంజ్ కొత్త చరిత్రను సృష్టించింది. మంచుఖండం అంటార్కిటికాపై గ్రీన్ ఇండియా ఛాలెంజ్ జెండా ఎగిరింది. ప్రపంచ పర్యావరణం కాపాడటమే లక్ష్యంగా, కర్బన ఉద్ఘారాలను తగ్గించేందుకు పాటుపడాలనే సంకల్పంతో చేపట్టిన అంటార్కిటికా యాత్రలో గ్రీన్ ఇండియా ఛాలెంజ్ వాలంటీర్‌కు చోటు దక్కింది. 35 దేశాల నుంచి 150 మంది సభ్యులతో కూడిన బృందం ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న పర్యావరణ మార్పులు, ఎదురయ్యే సవాళ్లపై అధ్యయనం చేస్తోంది.

ఈ పర్యటనలో భాగంగా భూగోళంతో పాటు, అంటార్కిటికా ఖండంలో పర్యావరణం కాపాడాలని ఉద్యమం చేపట్టిన రాబర్ట్ స్వాన్‌ను గ్రీన్ ఇండియా ఛాలెంజ్ వాలంటీర్ కలిశారు. గత ఐదేళ్లుగా చేపట్టిన కార్యక్రమాలు, భారతదేశ వ్యాప్తంగా గ్రీన్ ఇండియా ఛాలెంజ్ ఉద్యమం విస్తరిస్తున్న తీరును వివరించారు. చాలా మంచి ప్రయత్నం చేస్తున్నారంటూ ప్రశంసించిన రాబర్ట్ స్వాన్ స్వయంగా గ్రీన్ ఇండియా ఛాలెంజ్ జెండాను అంటార్కిటికాలో ప్రదర్శించారు.

అంటార్కిటికా యాత్రలో పాల్గొన్న వాలంటీర్ అభిషేక్ శోభన్‌ను రాజ్యసభ సభ్యులు జోగినపల్లి సంతోష్ కుమార్ మనస్ఫూర్తిగా అభినందించారు. ట్విట్టర్ వేదికగా రాబర్ట్ స్వాన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రెండు ధృవాలను సందర్శించిన పర్యావరణవేత్త రాబర్ట్ స్వాన్ చేతుల మీదుగా అంటార్కిటికాలో గ్రీన్ ఇండియా ఛాలెంజ్ పతాకం ఆవిష్కరించటం గొప్ప గౌరవంగా భావిస్తున్నామని సంతోష్ కుమార్ తెలిపారు. మరింత చిత్తశుద్ధితో తమ పర్యావరణ ఉద్యమం కొనసాగిస్తామని ప్రకటించారు.

చరిత్రలో నేటినిజం

కం॥ పేసుమనసమభావచయమును
రసరమ్యతనుగా అభినంచు రమ్యకవిశునో
కొసరాజు రాఘవయ్యను
రసఖాలు కెంచుచుంటి ప్రగుములగుచున్ !!

(జూన్ 23 సినీ కవి కొసరాజు జయంతి...)

–రాధశ్రీ
సెల్: 9494481210

వెమ్ టెక్ ప్రారంభం తర్వాత రక్షణ రంగంలో అగ్రగామి : కేటీఆర్

సంగారెడ్డి, జూన్ 22(నేటినిజం ప్రతినిధి):1988లో వెమ్ టెక్ ప్రారంభించిన తరువాత రక్షణ రంగంలో అగ్రగామిగా ఉన్నామని రాష్ట్ర ఐటీశాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలో నిమ్జ్ లో తొలి పరిశ్రమ వెమ్ ప్రాజెక్ట్ కు మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు.

ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ? ఆత్మనిర్భర్ భారత్ ద్వారా మన దేశంలోనే రక్షణ రంగ పరికరాలు తయారీ అవుతున్నాయన్నారు. దేశ రక్షణలో కీలక భూమిక పోషిస్తున్నామన్నారు.

మీరు కోరుకున్న విధంగా భూమి ఇచ్చామన్నారు. సెమీ స్కిల్డ్, అన్ స్కిల్డ్ ఉద్యోగాలు స్థానిక జహీరాబాద్ వారికి ఇవ్వాలన్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ పాటించాలన్నారు. పరిశ్రమ పర్యావరణ హితంగా ఉండాలన్నారు. 12,600 ఎకరాలు భూమి నిమ్జ్ కు కేటాయిస్తే ఇప్పటికి 3500 ఎకరాలె సేకరించామన్నారు. భూమి కోల్పోయిన రైతులకు, రైతు కుటుంబాలకు ఉపాధి కల్పించాలన్నారు. స్కిల్ డెవలప్మెంట్ శిక్షణ కు 50 శాతం సహకారం అందిస్తామని వెంకట్ రాజు చెప్పడం అభినందనీయమని కేటీఆర్ తెలిపారు.

పల్లె ప్రగతి హామీలు తక్షణమే చేపట్టండి – మంత్రి ఎర్రబెల్లి

హైదరాబాద్, జూన్ 22:రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు , ఆయా శాఖల ఉన్నతాధికారులతో హైదరాబాద్ లోని మంత్రుల నివాసంలో సమావేశమయ్యారు. ఇటీవలి పల్లె ప్రగతితోపాటు, ఆయా శాఖల్లో నిర్వహిస్తున్న పలు పనుల పురోగతిపై మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా అధికారులకు ఆయా పనులకు సంబంధించి ఆదేశాలు జారీ చేశారు. పల్లె ప్రగతి హామీలు వెంటనే చేపట్టాలి..కొత్త సిసి రోడ్లు, గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణాలు మొదలు పెట్టండి..స్త్రీ నిధి రుణాల ద్వారా ఇంటింటికీ సోలార్ ప్రాజెక్టు..జిల్లాకు వెయ్యి మంది మహిళా లబ్ధిదారులను ఎంపిక చేయాలి..ప్రయోగాత్మకంగా మహిళా గ్రూపులకు కుట్టు శిక్షణ..డ్వాక్రా గ్రూపుల ఉత్పత్తులను ఫ్లిక్ కార్ట్ తో అమ్మకానికి ఒప్పందం..స్త్రీ నిధి వేతన పెంపు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి..ఈ సమీక్ష సమావేశంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, కమిషనర్ హన్మంతరావు, డిప్యూటీ కమిషనర్లు, పంచాయతీరాజ్ ఇఎన్‌సి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సినీ కార్మికుల సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోండి - మంత్రి తలసాని

హైదరాబాద్, జూన్ 22:రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకునే వరకు వేచి చూడొద్దని సినీ కార్మికులకు హితవు పలికారు తెలంగాణ రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్.

గత కొన్నాళ్లుగా తమ వేతనాలు పెంచలేదని, పెరిగిన ఖర్చుల నేపథ్యంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామంటూ టాలీవుడ్ సినీ కార్మికులు సమ్మెకు దిగడం తెలిసిందే.

దాంతో నేడు సినిమా షూటింగులు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో మంత్రి స్పందించారు. కరోనా సంక్షోభం నేపథ్యంలో సినీ కార్మికులు ఇబ్బందుల్లో ఉన్నారని తెలిపారు. సినిమాల చిత్రీకరణలు లేకపోవడంతో ఉపాధి దొరక్క ఆర్థిక కష్టాల్లో ఉన్నారని వివరించారు. తక్షణమే సినీ కార్మిక సంఘాలతో ఫిలిం చాంబర్, నిర్మాతల మండలి చర్చలు జరిపి సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాలని తలసాని సూచించారు. సమస్య రెండు మూడు రోజుల్లో పరిష్కారమవుతుందని ఆశిస్తున్నానన్నారు.

సతీశ్ రెడ్డి, అనిల్ కుర్మాచలంను అభినందించిన మంత్రి కేటీఆర్

హైదరాబాద్, జూన్ 22: రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి కేటీఆర్‌ను రెడ్‌కో, ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్లు సతీశ్ రెడ్డి, అనిల్ కుర్మాచలం ఇవాళ కలిశారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్లను మంత్రి కేటీఆర్ అభినందించారు. తమకు కార్పొరేషన్ చైర్మన్లుగా నియమించినందుకు కేటీఆర్‌కు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సతీశ్ రెడ్డి, అనిల్ కుర్మాచలం ఈ పదవుల్లో మూడేండ్ల పాటు కొనసాగనున్నారు.

సీఎం కేసీఆర్‌ను ప్రగతి భవన్‌లో ఇవాళ సతీశ్ రెడ్డి, అనిల్ కుర్మాచలం మర్యాద పూర్వకంగా కలిసిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా సీఎం ఆశీస్సులను తీసుకున్నారు. తమ మీద నమ్మకంతో పదవి అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. సీఎం ఇచ్చిన బాధ్యతలను త్రికరణ శుద్ధితో నిర్వహిస్తానని సతీశ్ రెడ్డి, అనిల్ కుర్మాచలం తెలిపారు.

24న నామినేషన్ వేయనున్న ద్రౌపది ముర్ము

న్యూఢిల్లీ, జూన్ 22: రాష్ట్రపతి ఎన్నికలు జూలై 18న జరుగనున్నాయి. ప్రతిపక్షాల అభ్యర్థిగా యశ్వంత్ సిన్హా బరిలోకి దిగగా.. అధికార బీజేపీ జార్ఖండ్ మాజీ గవర్నర్ ద్రౌపది ముర్మును బరిలో నిలిపింది. ఈ క్రమంలో ద్రౌపది ముర్ము ఈ నెల 24న నామినేషన్ దాఖలు చేయనున్నారు. ప్రతిపక్షాల అభ్యర్థి యశ్వంత్ సిన్హా 27న నామినేషన్ దాఖలు చేయనున్నట్లు ఎన్‌సీపీ చీఫ్ శరద్ పవార్ తెలిపారు. రాష్ట్రపతి ఎన్నికలు జూలై 18న జరుగనుండగా.. 21న ఓట్ల లెక్కింపు జరగనుంది. ఇప్పటికే నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కాగా.. ఈ నెల 29తో గడువు ముగియనున్నది.

ఇదిలా ఉండగా.. ద్రౌపది ముర్ము గతంలో జార్ఖండ్‌కు మొదటి మహిళా గిరిజన గవర్నర్‌గా సేవలందించారు. మంగళవారం బీజేపీ ప్రధాన కార్యాలయంలో జరిగిన పార్లమెంటరీ బోర్డు సమావేశం అనంతరం ముర్ము పేరును బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా ప్రకటించారు. అయితే, ఈ సారి రాష్ట్రపతి అభ్యర్థి కోసం 20 మంది పేర్లను చర్చించగా.. మహిళ, గిరిజనులను ఎంపిక చేయాలని నిర్ణయించారు. ద్రౌపది ముర్మును రాష్ట్రపతి అభ్యర్థిగా ప్రకటించిన అనంతరం ప్రధాని నరేంద్ర మోదీతో పాటు పలువురు నేతలు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. బిహార్ సీఎం నితీశ్ కుమార్ సంతోషం వ్యక్తం చేశారు

తెలంగాణను అభివృద్ధి చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దే : మంత్రి మల్లారెడ్డి

హైదరాబాద్, జూన్ 22: తెలంగాణను అన్ని రంగాలలో అభివృద్ధి చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. మేడ్చల్ జిల్లా నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 9, 12, 15, 17, 3వ వార్డులలో రూ.75 లక్షల 30 వేలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుంతల రోడ్లు లేకుండా గ్రామాల్లో, పట్టణాలలో సీసీ, బీటీ రోడ్లను నిర్మిస్తున్నారని అన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా పట్టణ ప్రగతి, పల్లె ప్రగతిని నిర్వహించి పల్లెలు, పట్టణాలను శుభ్రంగా తీర్చిదిద్దుకున్నామని చెప్పారు.

ప్రజలు ఇబ్బందులు పడకుండా మార్కెట్‌లను, వైకుంఠధామాలను, పార్కులను అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించారని, హరితహారంతో గ్రామాలు, పట్టణాలు పచ్చటి తోరణాలుగా దర్శనం ఇస్తున్నాయని తెలిపారు.

పలు వార్డులలో మంత్రి మొక్కలను నాటి నీళ్లు పోశారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, కమిషనర్ ఎ.వాణిరెడ్డి, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ వెంకటేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఎలాంటి అభద్రత భావం లేకుండా చేసేందుకే కమ్యూనిటీ కనెక్ట్ కార్యక్రమం: టౌన్ ఏసీపీ

ఖమ్మం, జూన్ 22(నేటినిజం ప్రతినిధి): స్థానిక ప్రజలకు ఎలాంటి అభద్రత భావం లేకుండా మేమున్నామని భరోసా కల్పించడం కోసమే కమ్యూనిటీ కనెక్ట్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఖమ్మం టౌన్ ఏసీపీ అంజనేయులు తెలిపారు. ఖమ్మం అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని

వై ఎస్ ఆర్ నగర్ లో బుధవారం తెల్లవారుజామున స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో కమ్యూనిటీ కనెక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటిని క్షుణ్ణంగా సోదాలు నిర్వహించి అనుమానాస్పద వ్యక్తుల వివరాలు గుర్తింపు కార్డులను పరిశీలించారు.

సరియైన పత్రాలు లేని 50 ద్విచక్ర వాహనాలు, ఒక కారు, 14 ఆటో లను గుర్తించారు. అక్రమంగా విక్రయిస్తున్న మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు.

ఈ సందర్భంగా టౌన్ ఏసీపీ మాట్లాడుతూ... నేరరహిత ప్రాంతాలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పోలీస్ కమిషనర్ విష్ణు యస్. వారియర్ ఆదేశాల మేరకు ఆసాంఘిక కార్యాకాలపాలకు అడ్డుకట్ట వేస్తున్నట్లు తెలిపారు.అదేవిధంగా ప్రజల యొక్క సమస్యలు నేరుగా తెలుసుకొనే అవకాశం ఉంటుందని, అయా ప్రాంతాలలో ఎవరైనా కొత్త వ్యక్తులు గాని నేరస్తులు కానీ వచ్చి షెల్టర్ తీసుకుంటున్నారా అనే విషయం కూడా తెలుస్తుందని తెలిపారు. స్థానికంగా ఏలాంటి గొడవలకు పోకుండా ప్రజలు ప్రశాంతమైన వాతావరణం వుండాలని సూచించారు. ముఖ్యంగా యువత అనవసరమైన గొడవలకు పోతే మీ భవిష్యత్త్ ప్రశ్నార్థకం ఆవుతుందని గుర్తించాలని సూచించారు.ఎలాంటి అత్యవసర సమయములో అయిన డయల్ 100 కు లేదా స్థానిక పోలీస్ స్టేషన్ కు సమాచారం అందిచాలని సమాచారం ఇచ్చి న వారి పేరు గోప్యంగా ఉంచబడుతుందని తెలిపారు.ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వారి యొక్క వాహనాలకు ఆర్ సి, ఇన్సూరెన్స్, మరియు డైవింగ్ లైసెన్స్ కలిగివుండాలని తెలిపారు. ఎలాంటి పత్రాలు లేని వాహనాలు నడపవద్దని నడిపేవారి పై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. పాత వాహనాలు కొనేటప్పుడు వాటి యొక్క డాక్యుమెంట్స్ చెక్ చేసుకుని కొనాలని డాక్యుమెంట్స్ లేని వాహనాలను కొనుగోలు చేయవద్దని సూచించారు. బుధవారం స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలకు సంబంధించిన పత్రాలు చూపించిన తర్వాత తిరిగి వారి వాహనాలను వారికే అప్పగించడం జరుగుతుందని తెలిపారు.

ఈ సందర్భంగా స్థానిక ప్రజలు పోలీస్ వారికి పూర్తిగా సహకారాన్ని అందించారని తెలిపారు. నలుగురు ఇన్స్పెక్టర్లు,12 మంది ఎస్సైలు,14 ఏఎస్సైలు/హెడ్ కానిస్టేబుల్, 20 కానిస్టేబుళ్లు పాల్గొన్నారు. కార్యక్రమంలో సిఐలు రామకృష్ణ, చిట్టిబాబు, సర్వయ్య, పాల్గొన్నారు.

చెక్ డ్యాంల నిర్మాణంతో ఆ నియోజకవర్గాలు సస్యశ్యామలం : స్పీకర్ పోచారం

కామారెడ్డి, జూన్ 22మంజీర నదిపై చెక్ డ్యాంల నిర్మాణం.. బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాలకు వరంగా మారనుందని అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస రెడ్డి అన్నారు. మంజీర నదిపై నిర్మిస్తున్న చెక్ డ్యాంలను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ..చెక్ డ్యాం ల నిర్మాణంతో మంజీర నది సంవత్సరం పొడవునా నీళ్లతో నిండుగా ఉంటుందన్నారు.

నది నుంచి ఇరువైపులా కిలోమీటర్ల దూరం వరకు భూగర్భ జలాలు పెరిగి వేలాది ఎకరాలు సస్యశ్యామలం అవుతాయన్నారు. బాన్సువాడ పట్టణ సమీపంలోని చింతల నాగారం వద్ద రూ. 15 కోట్లతో నిర్మించిన చెక్ డ్యాం నిర్మాణ పనులు పూర్తి కావచ్చాయని ఆయన పేర్కొన్నారు.

గతంలో ఎగువ నుంచి భారీ వర్షాలు, వరదలు వచ్చి నిజాంసాగర్ ప్రాజెక్టు గేట్లు తెరిచిన సమయంలో తప్పా.. దిగువ మంజీర నదిలో నీళ్లు ఉండేవి కావన్నారు. మంజీర నదిపై బాన్సువాడ నియోజకవర్గం పరిధిలో మొత్తం ఆరు చెక్ డ్యాం లు నిర్మిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

తెలంగాణ ప్రభుత్వంపై ఇంటర్నేషనల్ హాస్పిటల్స్ గ్రూప్ ప్రశంసలు

హైదరాబాద్, జూన్ 22: తెలంగాణలో పెద్ద మొత్తంలో మెడికల్ కాలేజీలు, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు నిర్మిస్తున్న నేపథ్యంలో ఇంటర్నేషనల్ హాస్పిటల్స్ గ్రూప్ ప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వంపై ప్రశంసలు కురిపించారు. సాంకేతిక సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని వారు స్పష్టం చేశారు. యుకేకు చెందిన ఇంటర్నేషనల్ హాస్పిటల్స్ గ్రూప్ ప్రపంచ వ్యాప్తంగా హెల్త్ కేర్ సర్వీస్ అందిస్తున్నది. 55 దేశాల్లో 480 హెల్త్ కేర్ ప్రాజెక్ట్స్ పూర్తి చేసింది.

రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్ రావుతో బ్రిటిష్ హై కమిషనర్ ఆండ్రూ ఫ్లెమింగ్, ఇంటర్నేషనల్ హస్పిటల్స్ గ్రూప్ సీఈవో చేస్టర్ కింగ్, సీవోవో సైమన్ ఆశ్వర్త్, భారత ప్రతినిధి పృథ్వి సహోని, ఇతర ప్రతినిధులు భేటీ అయ్యారు.

ఈ సందర్భంగా ఆండ్రూ ఫ్లెమింగ్ మాట్లాడుతూ.. తెలంగాణ అన్ని రంగాల్లో దూసుకుపోతున్నది. ఇక్కడి ప్రభుత్వం కృషి వల్ల హైదరాబాద్ అభివృద్ధికి మారుపేరుగా నిలిచింది. ప్రపంచ స్థాయి కంపెనీలు ఇక్కడ పెట్టుబడులు పెడుతున్నాయి. ఈ క్రమంలో ఐహెల్త్ ఆసక్తి చూపిస్తున్నది అని ఆండ్రూ ఫ్లెమింగ్ తెలిపారు.

ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని, తెలంగాణలో ఏర్పాటు చేస్తున్న టిమ్స్, మెడికల్ కాలేజీలు, వరంగల్ మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి తదితర అంశాల గురించి మంత్రి హరీశ్‌రావు వారికి వివరించారు.

నేటినిజం
సాహితీ కిరణాలు
E-mail : netinijam93@gmail.com
website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 23-6-2022

అమృతమూర్తి

ఎన్ని కన్నీటి చుక్కలు
తన పవిట చెంగులో
ఆవిరయ్యాయో ,

ఆత్మాభిమానపు మాలలెన్ని
పుటుక్కున తెగి
ఒడిని చేరాయో,

చీకటి రాత్రులకు
తెలిసిన నిద్రలేమి
రహస్యాలు ఎన్నో,

కంటి చారల్లో నక్కిన
అభద్రతా భావాల
చిట్టాలు ఎన్నో,

దోసిళ్ళలో మోమును
అదిమిపట్టి రాసిన
ఆత్మకథల ఆధారాలు ఎన్నో ,

తలగడను పెనవేసుకొని
ఆత్మాభిమానానికి
పాకులాడిన అంతుచిక్కని
ప్రశ్నలు ఎన్నో,

పంటి కొనల్లో పరువును
బిగపట్టి చెక్కిళ్లపై ఆవేదనను
ఆవిరి చేసిన క్షణాలు ఎన్నో ,

పైకి వినపడకుండా
పెదవి అంచుల్లో
చిక్కుకొన్న అస్తిత్వ
నినాదాలు ఎన్నో,

కంటి పాపలతో ఇంటి
పై కప్పు చేసిన
పరామర్శల సంభాషణలు
ఎన్నో ,

నిజానికి అబద్ధానికి
మధ్య నలిగిన ఆత్మవిమర్శల
సంచికలు ఎన్నో,

తలవని కలవని బంధాల
వ్యత్యాసాలను బేరీజు
వేసుకుంటూ
సమన్యాయానికి
ప్రయత్నించిన
సందర్భాలెన్నో,

దగ్ధమైన ద్వైపాక్షిక
సంబంధాల్లో తన ఉనికే
సందిగ్ధమై శిలా ప్రతిమలైన
రూపాలెన్నో,

అమృతనపు మాధుర్యంలో
అన్నీ మరచి మురిసిన
భావాల భావోద్వేగాల
పరంపరలు ఎన్నో..

విధి రాతను ప్రశ్నిస్తూ,
తలరాతను మార్చేందుకు
తపనపడుతున్న అమ్మల
ఆరాటాలకు ముగింపు
లేని ముచ్చట్లు ఎన్నో..

విసిరిపారేసిన పసికందు
లోపాన్ని గుండెకు హత్తుకున్న
ఆత్మ సౌందర్య అమృతమూర్తుల
అమూల్య గాథలెన్నో..ఎన్నెన్నో...!

-షేక్.నసీమా బేగం
9490440865

సమరసతా నానీలు

బడిలో అడ్మిషన్‌కు
కులమేంటి?
అన్నప్పుడే నా గుండె
గాయపడింది!

ఊహ వచ్చాక
కుల ధృవీకరణ
అప్పుడు నా మెదడు
మొద్దుబారింది!

నా ప్రతిభ తో
నేను అగ్రస్థానమే!
కుల కేటగిరీలో
సున్నా మార్కులు!!

కులాంతర వివాహాలు
ఆదర్శమే
యవ్వనపు
ఆకర్షణ కాకూడదు

విద్వేషం
నింపుకున్న సంస్కర్తలు
"మనం-
వేరు" అంటారెప్పుడు!?.

కులనిర్మూలన
నాయకులే అంతా!
పేరు చివర
"తోక"లేక ఉండలేరు.

బలహీనపడుతున్న
హృదయాలకి
సాటి మనుషులంతా
పరాయివారే!

కొందరి
గుండెలు బలహీనం
సమతా 'స్టంటు'
వేస్తేనే ఫలితము

కులపిచ్చి వైరస్
కనబడినా
ఇంతవరకు వేక్సిన్
కనబడట్లే!

సమసమాజం
స్థాపించటానికే
కులానికొక్క
పెద్ద గురుకులం

ఆత్మగౌరవ
పోరాటాలు కొన్ని..
వంచిత
ఉద్యమాలు ఎన్నెన్నో?

మామూలు గజ్జి
అవయవాలకే
కులగజ్జి
శరీర నరనరాల్లో!

కమ్యూనిటీ
భవనాలు వీధుల్లో
కులంకుళ్ళు
పెద్దల మెదడుల్లో

కులంతోకనే
దురహంకారం
మరిస్తేనె
సమరసత సాకారం

-సాకి
9951172002

నాన్న

తనదురూపమెంత తానుగ జూడగ

తన్మయంబునొందు తండ్రిగుండె తల్లిపరిచయంబు
తనయునికిని జేయు
దివ్యమైనబాట దేవిమాట.

కన్న కొడుకు జాల మిన్నగ యగుపించు
యెత్తగాను జూస్తె కొత్త కొత్త
తల్లి కంటే సున్నితంబుగ నుండుగ
దివ్యమైన బాట దేవి మాట

సంతసంబునైన చింతలోనున్నను
బయలుపడనివాడు
బతుకునిచ్చు
కన్న తండ్రి ప్రేమ కప్పియుండుయదలో
దివ్యమైన దేవి మాట.

ఉన్నదానిలోనయుర్విజనంబైన
భార్య పిల్లలకును బంచి వేసి
పస్తులున్న గూడ పరులకు జెప్పడె
దివ్యమైన బాట దేవి మాట.

బతుకు రాత కొరకు బాగుగ సృష్టించు
రాత మంచిగుంచి పూత నొసగి
బ్రతుకు బరిమళంబు బహ్మాండముగబంచు.
దివ్యమైన బాట దేవిమాట.

పెరుగుచున్నకొలది పెద్ద మిత్రుడిగాను
మారి నడుచువాడు మాన్యుడతడు
భయముగొలుపుచున్నప్రియమైనహృదయము
దివ్యమైన బాట దేవిమాట.

-సముద్రాల శ్రీదేవి
9949837743

నాన్న ఏడ్వడు !

నాన్న కంట్లో నీరు !
కంట్లో చెత్త పడి ఉంటుంది ! !

నాన్న కంట్లో నీరు !
ఉల్లి గడ్డ కొరికి ఉంటాడు ! !

నాన్న కంట్లో నీరు !
కంటికి ఇన్ పక్షన్ కావచ్చు ! !

నాన్న కంట్లో నీరు !
కూరలో కారం ఎక్కువ అయిందేమో ! !

నాన్న స్థిత ప్రాజ్ఞుడు
ఏడుపు రాదు ??

నాన్న హృదయం గట్టిది !
ఎందుకేడుస్తాడు ! !

నాన్నవి ప్రత్యేక కన్నులు !
నీరు ఎందుకు వస్తుంది ! !

నాన్న అవతార పురుషుడు
ఏడుపు ఎందుకు వస్తుంది ! !
(19 - 06 - 2022
నాన్నల మహోత్సవ వేళ)

నాన్న

నా హృదయంలో కొలువైన
ధైర్యం మా నాన్న
ద్వేషమైన,ప్రేమైన ఒకే రకంగా
స్వీకరించి ముందుకెళ్లాలి అంటూ
సమాజం పోకడ తెలిపిన నాన్న

నా కళ్ళలో కన్నీళ్లు తిరిగిన
ఓపలేని బాధ పంటిబిగువున పట్టి
నన్ను నవ్వించడం ప్రథమకర్తవ్యంగా
చలోక్తులు యుక్తిగా విసిరే స్నేహితుడు.

నాన్న రెండక్షరాల రక్షణ కోట
సమస్యలను నా ధరిచేరనివ్వక
పహారా కాసే... రక్షకభటుడు

కష్టాల హాలాహలాన్ని
గుండెన దాచిన దేవదేవుడు
కోరిన కోర్కెలు తీర్చు
భోళాశంకరుడు నాన్న

తన భార్య బిడ్డల కోసం
ఎంతైనా శ్రమిస్తాడు
మాట గంభీరంతో కంచులా మోగుతుంది
మనసు మంచులా కలుగుతుంది
నిస్వార్థ స్నేహితుడు నాన్న

-సి. హేమలత
9666779103

నాన్న...!

దీపం వెలగడానికి
నూనె అమ్మా అయితే
అందులో ఒత్తి నాన్న!

ఆయువును పోసేది
అమ్మా అయితే
జీవితాంతం శ్వాసను
పంచేది నాన్న!

ఆకాశంలో చందమామను
చూపెడుతూ గోరుముద్దలు
పెట్టేది అమ్మా!

జీవితంలో లక్ష్యంకోసం
విద్యాబుద్ధులను
పంచి పెట్టేది నాన్న!

మాటలు నేర్పించే
సరస్వతీ దేవి
అమ్మా అయితే!
భావాలను పలికించే
బ్రహ్మ మూర్తి నాన్న!

తొలి అడుగుల
నడకకు గురువు నాన్న!
భుజాలపై విమానంలా
మోసే తొలి పైలెట్ నాన్న!

నాన్న అంటేనే
నమ్మకం!
తన మారుపేరుకు
మరో రూపం నాన్న!

-బి నాగం సాయిలు
9490209037

నాన్నలు ఎప్పుడూ అంతేనేమో

నాన్న పగలు సుక్క
మొలువకముందే లేచి
నాగలై కదిలేటోడు
పగలు పొదల్లో దాక్కున్న
కుందేలు పిల్లలు మేతకు లేచాకే
ఇంటి మొకం చూసెటోడు.

వచ్చిరాగానే పిల్లలేరని పిలిచి
ఈత పండ్లు, పల్లికాయలు,శన్కాయలు ఇచ్చి
అలుపు సొలుపు ఆదమరిచి
మా నవ్వుల్లో పున్నమి పువ్వై విరిసెటోడు.
మా కలల సౌధానికి నాన్న
మొట్టు మొట్టుగా మారి
మౌనంగా త్యాగానికి అకాశమైయెటోడు.
పండుగ వచ్చేసంటే అప్పో సొప్పో చేసి
మాకు బట్టలు తెచ్చి తాను మాత్రం
ఎప్పుడో తెచ్చుకున్న అంగీని చూపి
నాకు ఇది ఉందిలే అని సర్ది చెప్పెటోడు

కనుమ పండుగనాడు మటన్
కూరలో మూలుగ ముక్కలు నాన్నకు
పడితే చిన్నోడికి మూలుగలు ఇష్టమని
నా ప్లేట్లో వేసి కడుపు నింపుకునేటోడు.
ఎంత కష్టమొచ్చినా కన్నీలు దిగమింగుకోని
పెదవులపై చిరునవ్వు పూయించెటోడు
ఎన్ని అలల ఎదురొచ్చినా...
ధైర్యపు గుంజలా గట్టిగా నిలబడెటోడు
పని తప్పా మరో ప్రపంచం తెలియని
నాన్న ఓ పిచ్చోడు
పెద్దకొడుకు ఎదిగిన చమటనీటిలో
ఆనందాన్ని చూసుకుంటూ, వయస్సు లెక్క చేయకుండా
ఇంకా ఏదో చేయాలని మాకోసం
తాపత్రయ పడుతున్న ప్రేమ పిచ్చోడు.
నిత్యం కుటుంబ వృక్షానికి ప్రేమ పాడు
కడుతున్న ప్రాణ ప్రదాత వనమాలి అతడు
నాన్నలు ఎప్పుడూ అంతేనేమో బహుశా
పిల్లలు ఎదిగినా పసి మొగ్గలు అనుకుని
ఎంత చేసినా ఇంకా ఇంకా ఏదో చేయాలని
ఒరిగిపోతున్న రెక్కలను కూడా
వారధి కడతారు.

-శ్రీతరం
7893613015

సినీ సంగీతంలో సాలూరి వంశం ప్రత్యేక ముద్ర: నటుడు సుమన్

సాలూరి వాసురావుకు పురస్కారం ప్రదానం చేస్తున్న సినీ నటుడు సుమన్, డా॥ఓలేటి పార్వతీశం, వంశీ రామరాజు తదితరులు.

ఎన్నో మధురగీతలను స్వరకల్పనతో నాడు సినీ రంగ సంగీత ప్రపంచంలో కీర్తి పొందిన సాలూరి రాజేశ్వరరావు అనంతరం సాలూరి వాసురావు ఆయన సోదరుడు కోటి తండ్రి బాటలోనే నడిచి సినీ సంగీతంలో ప్రత్యేక ముద్ర వేశారని ప్రముఖ నటుడు సుమన్ అన్నారు. శ్రీ త్యాగరాయ గానసభలో వంశీ ఆర్ట్స్ థియేటర్, శుభోదయం గ్రూప్ నిర్వహణలో సాలూరి వాసురావుకు విఖ్యాత గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం స్మరిస్తూ ఆయన స్మారక పురస్కార ప్రదానోత్సవం జరిగింది. సుమన్ పాల్గొని పురస్కారం బహూకరించి మాట్లాడారు. వాసురావు గిటార్ వాయిద్య కళాకారునిగా ఆరంభించి సంగీత దర్శకునిగా గొప్ప పాటలను అందించారని కొనియాడారు. బాలు గానం చేసిన అన్నమయ్య చిత్రంలో తన బాలాజీ పాత్రను శాశ్వతంగా చరిత్రలో నిలిపారని గుర్తు చేసుకున్నారు. సాహితీవేత్త వోలెటి పార్వతీశం అధ్యక్షత వహించిన సభలో రచయిత పీఎస్ గోపాలకృష్ణ, తిరుమల గ్రూప్ చంద్రశేఖర్,ఒమాన్ దేశ నుండి వచ్చిన అనిల్, శుభోదయం ప్రతినిధి హరి వేణుగోపాల్ పాల్గొన్నారు. వంశీ రామరాజు, స్వాగతం పలికిన సభకు తొలుత అమెరికా శారద, వినోద్, గీతాంజలి, శశిధర్, స్వాతి తదితరులు మధుర గీతలు ఆలపించారు.

తెలుగు సాహితీ సంపన్నుడు ద్వానా శాస్త్రి

పురస్కార గ్రహితలు బైస దేవదాసు, డా॥సి. భవానీదేవిలతో అతిథులు డా॥కే.వీ. రమణాచారి, డా॥ ఓలేటి పార్వతీశం, జి. వళ్ళీశ్వరి, కిన్నెర రఘురాం, ద్వాదశి శశికాంత్

ద్వా.నా.శాస్త్రిగా పేరుపొందిన ద్వాదశి నాగేశ్వరశాస్త్రి వ్యాసకర్తగా తెలుగు సాహిత్యం బోధకునిగా భిన్న ప్రక్రియల్లో రచనలు చేయడంలో ప్రతిభా శాలిగా తెలుగు సాహితీ సంపన్నుడని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కే.వీ. రమణాచారి అన్నారు. శ్రీ త్యాగరాయ గానసభలో కళా సుబ్బారావు కళావేదికపై కిన్నెర ఆర్ట్స్ థియేటర్స్, ద్వా.నా. సాహితీ కుటీరం సంయుక్త నిర్వహణలో ఆయన 75వ జయంతి సందర్భంగా ప్రముఖ రచయిత్రి డాక్టర్ చిల్లర భవానీ దేవికి ద్వా.నా.శాస్త్రి మాతృమూర్తి లక్ష్మి ప్రసన్న పురస్కారం, నేటినిజం పత్రిక సంపాదకుడు బైస దేవదాసుకు ద్వా.నా.శాస్త్రి పురస్కార ప్రదానోత్సవ సభ జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ రమణాచారి మాట్లాడుతూ.. ద్వా.నా.శాస్త్రి నిరంతర అధ్యయనశీలి అని చివరివరకు సాహితీ వ్యాసంగంలోనే మునిగి పోయారన్నారు. బైస దేవదాసు తన పత్రిక నేటినిజం ద్వారా నిరంతరం నవ యువ కవులను, రచయితలను ప్రోత్సాహిస్తున్నారని, భవానీదేవి భిన్న సాహితీ ప్రక్రియల్లో ప్రతిభావంతురాలని ఆయన పేర్కొన్నారు. సాహితీవేత్త డా॥వోలేటి పార్వతీశం సభకు అధ్యక్షత వహించి మాట్లాడుతూ.. అర్హులైన వారినీ పురస్కారాలకు ఎంపిక చేయటం హర్షనీయమని అన్నారు. పత్రిక రచయిత జి.వళ్లీశ్వర్, ద్వాదశి శశికాంత్ పాల్గొన్న సభకు రఘురామ్ స్వాగతం పలికారు. ముందుగా రచయిత్రి సి. భవానీదేవికి ద్వాదశి లక్ష్మీ ప్రసన్న స్మారక పురస్కారం, అదే విధంగా, బైస దేవదాసుకు ద్వా.నా.శాస్త్రి స్మారక పురస్కారం ముఖ్య అతిథి డాక్టర్ రమణాచారి ప్రదానం చేశారు. పురస్కార పురస్కార స్వీకర్తలు భవానీదేవి, బైస దేవదాసు తమ స్పందన ప్రసంగాలలో ద్వా.నా.శాస్త్రి రచించిన పలు రచనలు గురించి వివరంగా మాట్లాడారు.

ఈ సభలో కే.వీ. సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

గుంటూరోం

చితిలా మారితే
చ్యుతి
జ్యోతిలా మారితే
జాగృతి.

ప్రకృతే
గిరిజన జీవనాకృతి
వారిది
మలినరహిత సంస్కృతి.

నమస్కరించటం
నామోషీ అనుకోకు
సంస్కార పరిమళ
ప్రసరణమని మరువకు

-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964

హాస్యం, చతురత మేళవించిన పొట్టి కథలు



కొందరు రచయితలుంటారు. ఆకాశంలో విద్యుల్లతలా మెరిసి మాయం అవుతుంటారు. ఉనికి క్షణకాలం. కనుక పాఠకులు చదివి మరిచిపోతుంటారు. పొట్టికథల దిట్ట రాజుగారు దీనికి పూర్తిగా విరుద్ధం. చదీ చప్పుడు హంగు ఆర్భాటలుండవు. తన పని రాసుకుపోవటమే అన్నంత దీక్షగా, శ్వాసించినంత అలవోకగా రాస్తూ పోతుంటారు.

ఇంతవరకు సుమారు పది సంపుటాలను మనముందుకు తీసుకువచ్చిన ఆర్.సి. కృష్ణస్వామి రాజుగారు తను మాత్రమే సృష్టించగలిగిన శైలి, శిల్పం వీరి సొంతం. చిత్తూరు జిల్లా, ముఖ్యంగా తిరుపతి పరిసర ప్రాంతాలు వీరి కథల్లో జీవం పోసుకుంటాయి. సున్నితమైన హాస్యం, సంభాషణా చతురత ఆ జిల్లాలోని ఎన్నో సామెతలు వీరి పాత్రల్లో ద్యోతకమవుతూ, నల్లేరు మీది నడకలా,పెన్నా మీది పడవ ప్రయాణంలా సాఫీగా సాగిపోతుంటాయి.

ఈ ఉరుకుల పరుగుల కాలంలో పెద్ద కథలు, వర్ణనలు, సూర్యోదయ అస్తమయ వర్ణనలు, మందుటెండలు పండు వెన్నెలల్లో పరవశించే తీరికా, సమయం లేదు. అంతా Instantగా సాగిపోవాలనే పాఠకుల మనసులు కాసేపు గిలిగింతలు పెట్టే కథలు కావాలి. అవి చిట్టివైనా, పొట్టివైనా మినీవైనా మరేవైనా సరే సరిపోతాయి.పాఠకుల నాడి తెలుసుకున్న రాజుగారు, పకోడి పొట్టాలు మిక్చర్ పొట్లాల్లాంటి 'చిరు' తిండి అందిస్తున్నారు.

అవన్నీ లోగడ పలు ప్రముఖ పత్రికల్లో ప్రచురించబడినవే గనుక ఆల్రెడీ అలరించినవే కనుక గ్యారంటీగా హాస్యాన్నం దిస్తున్నారు.

పరమేశ్వర మంగళం పార్వతి, మునిరత్నం నాగసుబ్బుడు, పనిమనిషిగారి, నెలవాయి నారాయణ స్వామి ఇంజనీరు ఇంద్రసేన ఎం.ఎల్.ఏ ఏకాంబరం పలకలు కొట్టే పట్టాభిరాముడు, సద్దికూళ్ళ మడుగు, సంగటి ముద్దల మడుగు, బొంతివంక చెక్‌డ్యాం, అయ్యన్నగారిపల్లి ఇలా ఎన్నుకున్న పాత్రలు పరిసరాలు పాఠకులకు పరిచయమే కనుక వారూ కథల్లోని పాత్రలకు సహానుభూతి పలికే అవకాశం ఉంది.

అంతే కాదు రాజుగారు ఉదహరించే సామెతలు కోరిన కొండమీద వానకురవటం, కొత్త నీళ్ళకు చేపలు ఎదురు ఈదటం, లేవలేని అత్తకు వంగలేనికోడలు దొరికినట్లు, ఫారిన్ కెళ్ళి ప్యాస్‌పోర్టులు పోగొట్టుకున్న పర్సనాలిటీలు, ఏనుగుమేత, ఏనుగుమోత, ఉడతకు ఎందుకు ఊళ్ళో పెత్తనాలు, తెలివి ఒకరి అబ్బ సొమ్మా తోటపు సుబ్బమ్మా, పాలపొంగు లెక్క పొంగిపోవటం లాంటి నేటివిటీ సామెతలు పాఠకులను ఆకట్టుకోగలు గుతాయి.

కొద్దికాలం నుంచే రాస్తున్న రాజుగారికి రసజ్ఞులైన పాఠకుల గొప్ప 'ఫాలోయింగ్' ఉంది. రాజుగారి లోగడ రచనలు చదివిన వారికి క్రొత్తగా చదువుతున్న వారికి సమంగా హాస్యం, పంచిపెట్టే చతురత ఉంది.

పెర్రీ మేసన్ (ఎర్ల్ స్టాన్లీ గార్డెనర్: రచయిత) నవలలు రాస్తోన్న రచయితను పాఠకులు 'ఇలా ఎంత కాలము రాయగలుగుతారు?" అని అడిగారట. అందుకాయన ప్రపంచంలో నిత్య జీవితంలో సంఘట నలు చోటు చేసుకున్నంత సేపు' అని జవాబిచ్చాడట ఆ రచయిత. రాజుగారు కూడా ఇలాగే ఎల్లకాలమూ పాఠకులను అలరించే రచనలు చేయాలని ఆశిస్తూ.

ప్రతులకు:ఆర్.సి. కృష్ణస్వామి రాజు
22-4-71, బ్యాంక్ ఎంప్లాయిస్ కాలనీ,
మంగళం రోడ్, తిరుపతి-517501
సెల్: 9393662821

- కూర చిదంబరం
సెల్: 8639338675

లోకరీతిని ప్రశ్నించిన హసేన కవిత్వం



మిత్రుడు డాక్టర్.మహ్మద్ హసేన ఉద్యోగార్తులకోసం పోటీ పరీక్షల పుస్తకాలను రచిస్తూనే సాహిత్యం వైపు అడుగులు వేసి ,వైవిధ్యంతో కూడిన కవితలతో "బిడ్డా ఎప్పుడొస్తవ్" కవితా సంపుటితో మన ముందుకు రావడం ముదావహం.మొదటి సంపుటితోనే మంచి కవిత్వాన్ని అందజేసే ప్రయత్నం చేసినందుకు అభినందనలు.

కడుపులో నలుసు పడ్డనాటినుండి భూమ్మీదకు వచ్చేవరకు తల్లి పడే తీపి బాధలు మనందరికీ తెలుసు.కట్టుకున్న భర్త దూరమైనా ,కడుపుకు కత్తెర పెడ్తేగాని బయటకురానని మారాం చేస్తే ,కత్తి గాట్లు భరించి కన్న బిడ్డను చూసుకొని బ్రతికే తల్లి ,ఆ బిడ్డ కూడా దూరమైతే వర్ణనాతీతమైన ఆ తల్లి వేదనను,దుఃఖంతో కుదిపివేస్తున్న ప్రేమను, ఆవేదనను అక్షరాలలో బంధించి అందించే ప్రయత్నమే "బిడ్డా ఎప్పుడొస్తవ్".ఎంతటి కఠిన పాషాణమైన హృదయాన్నైనా కదిలించి వేసే కవిత ఇది.అదే కవితా శీర్షికను తన పుస్తకానికి పెట్టుకోవడం కవి మాతృహృదయాన్ని ఎంతగా అవగతం చేసుకున్నాడో తెలియజేస్తుంది.

అనాదిగా ప్రకృతితో మమేకమై జీవించిన మానవుడు ఆ ప్రకృతిపై ఆధిపత్యం కోసం చేసే ప్రయత్నాల ఫలితమే అప్పుడప్పుడు మనం చూస్తున్న ప్రకృతి విలయాలు.ప్రకృతి కన్నెర్ర చేసినపుడు జరుగు విపత్కర పరిస్థితులు,"సనిపోయిన గొడ్డుపై బోధలు వాలినట్లు/తెల్లారేసరికి వాలిన తెల్ల చొక్కా నాయకులు" శాశ్వత పరిష్కారం చూపకుండా కంటి తుడుపుగా చేసే సహాయ కార్యక్రమాలు, "మాతాత మా నాన్నని,మా నాన్న నన్ను/ ఇప్పుడు నేను నాపిల్లలను తుఫాను బాధితుల/పునరావాస కేంద్రాల్లో బిక్కుబిక్కుమనుకుంటూ /బిచాన ఎత్తుకొని గడపాల్సి వచ్చే" తుఫాను మిగిల్చిన విషాదం కవితలోని నాలుగు వాక్యాలు వాస్తవ పరిస్థితిని కళ్ళముందించిన తీరు అభినందనీయం.

"స్నేహానికన్న మిన్న లోకాన లేదురా ,కడదాకా నీడలాగా నిను వీడి పోదురా

నీ గుండెలో పూచేటిది ,నీ శ్వాసగా నిలిచేటిది,ఈ స్నేహమోకటేనురా" అన్న భువనచంద్ర పాట మన హృదయాలలో చెరగని ముద్ర వేసింది.జీవితంలో మనని అర్థం చేసుకొనే స్నేహితుడొక్కడుంటే చాలనుకుంటాం.అలాంటి స్నేహాన్ని,ఆ స్నేహితుడిని కాపాడుకోవలసిన బాధ్యత మనమీదుంది. అలు పెరుగని జీవనపోరాటంలో,పరుగెడుతున్న కాలంతో పోటీ పడుతూ, మనం మన స్నేహితులగురించి ఆలోచించే సమయాన్ని కూడా ఇవ్వడం లేదు. "మహమ్మారి కరోనా బజారు మొత్తం ఉద్చేసింది " వృద్ధుని మాటలతో "వాడితో గడిపిన కాలం కళ్ల ముందు గిర్రున తిరిగింది" కానీ లాభం లేదు.స్నేహాన్ని, స్నేహితుడ్ని కాపాడుకొమ్మని మనకొక హెచ్చరికను జారీ చేసింది " ఇల్లు ఖాళీ చేసారు" అనే కవిత.ఇదే స్నేహం పై మరోకవిత ''నిజమైన స్నేహితుడు'' స్నేహం గొప్పదనాన్ని,నిజమైన స్నేహితున్ని పరిచయం చేసింది.

కృషి ఉంటే మనుషులు ఋషులౌతారు ,మహా పురుషులౌతారు అన్నది నిత్య సత్యం.

"ఆలోచనలకు ఆచరణకు మధ్య ఏర్పడే సమన్వయమే/మనిషిని విజయం వైపు నడిపిస్తుంది"

"శ్రమకు నువ్వు దాసిగా మారితే /విజయం నిన్ను వరిస్తుంది చూడు"

"విజేతకు పరాజితుడికి మధ్య తేడా /ఆశావాద దృక్పథంతో కూడిన ఆత్మ విశ్వాసమే" యువతను విజేతగా నిలిపేందుకు,వారిలో ఉత్తేజాన్ని నింపేందుకు ఇవి గొప్ప ప్రేరణా ప్రవచనాలుగా నిలుస్తాయనడంలో సందేహం లేదు. "కర్తవ్యాన్ని మరువకు/కర్మను వీడకు/గెలుపు దారిని వెతుకు /గెలిచి నిరూపించు "విజేత"గా ప్రభోదాత్మకమైన ముగింపు వాక్యాలు కలిగిన "విజేత" కవిత యువతకు స్ఫూర్తి ప్రదాత.సాధనమున పనులు సమకూరు ధరలోన అన్నట్లు "ప్రతి మనిషి నిత్య విద్యార్థి కావాలి ,నిరంతరం అభ్యాసం చేయాల"ని అందుకు "ప్రపంచమే ఉత్తమ గ్రంథం/కాలమే ఉత్తమ గురువు/ప్రకృతే పాఠ్య/విద్యా ప్రణాళిక"యని తెలుపడం కవి అనుభవాన్ని తేటపరుస్తుంది.

"తేరే బినా మేరీ జిందగీ హోగీ 'అధూరి కహానీ'లో తనదైన భాషలో,చిన్ననాటి ఆత్మీయ మిత్రురాల్ని, "మన రెండు కుటుంబాలు చేసిన విహారయాత్రలో / మొదటిసారి నాకు కొత్త ప్రపంచం చూపించావు''అంటూ ఆమె మధుర జ్ఞాపకాలను నెమరువేసుకోవడం కవిలో దాగిన భావ కవిని మనముందుంచింది. మధురమైన పదాలతో,సొంపైన మాటలతో, తన హృదయంలో నిలువుకున్న ఊహాసుందరిని "ఎవరు నువ్వు" కవితలో హృద్యంగా వర్ణించడం, మనలోని ప్రేమరస హృదయాన్ని తట్టి లేపుతోంది.

ప్రస్తుత విద్యావిధానంలో విద్యార్థులకు ప్రశ్నించడం నేర్పుతున్నారు.విజ్ఞానానికి తొలి మెట్టు ప్రశ్నించడం. ప్రశ్నించడం ద్వారానే విజ్ఞానాన్ని సంపాదించగలం.విషయాలను నేర్చుకోగలం."ప్రశ్న పదునైన ఆయుధం ప్రశ్నించే వాడికి /ప్రశ్నించండి పాలకులను /అవినీతి అక్రమాలకు పాల్పడే అధికారుల ను" నేడు మనదేశంలోని పౌరులకు ఇదే ప్రథమ కర్తవ్యం.ప్రశ్నించడం ద్వారా సమసమాజాన్ని నిర్మించగలం.అదే ,హసేన "ప్రశ్న" కవిత ద్వారా సూచించిన ఉత్తమ మార్గం.

ధర్మవర్తనులైన పాండవుల పక్షాన నిలిచి ,ధర్మ సంస్థాపన చేసిన శ్రీ కృష్ణుని సూక్ష్మంలో మోక్షంలా పరిచయంచేస్తూ "ఎక్కడ నెగ్గాలో,ఎక్కడతగ్గాలో /సుఖ దుఃఖాలలో ఎలా స్పందించాలో వివరిస్తూ అన్యాపదేశంగా చక్కని సందేశాన్ని అందించారు.

కలం పట్టిన ప్రతి కవి తనని కన్న తల్లిదండ్రులను అక్షర రూపంలో తలచుకోక మానడు.హసేన కూడా "కోడిపిల్లను గద్ద తన్నుకొని పోయినట్లు తన తండ్రిని మింగేసిన రోడ్డు ప్రమాదంను తలుచుకుంటూ ,నాన్నతో గడిపిన తీయని క్షణాలను గుర్తు చేసుకుంటూ," ఇప్పటికీ నీ రూపం కళ్ళముందు కదులుతున్నట్లుగానే వుంది / నువ్వు లేవన్న సత్యం అసత్యమైతే బాగుండు నాన్న"అని కోరుకోవడం, "చెలిమికి చిరునామా,త్యాగానికి నిదర్శనం, మాటలకందనిది,మూటలు ఆశించనిది, భాషకు అందనిది,భావానికి దొరకనిది, కల్మషానికి గురి కానిది,అనంతం, అమలినం,అనిర్వచనీయం,బ్రహ్మ సృష్టించిన అద్భుతం అమ్మ" యని కొత్త కోణంలో అమ్మ గురించి తెలపడం కవికి తల్లిదండ్రుల పట్ల గల ప్రేమకు ప్రతీక.అదే ప్రేమ,అదే నమ్మకంతో కరోనా బారిన పడిన తల్లిని "ఇన్ని గండాలు దాటిన దానివి/కరోనా సుడిగుండం దాటలేవా" అవలీలగా కరోనా నుండి కోలుకుంటుందన్న నమ్మకం కన్పిస్తుంది ఆ పదాలలో,

''జై జవాన్ జై కిసాన్'' లాల్ బహదూర్ శాస్త్రి నినాదం.అన్నం పెట్టే రైతు ,దేశాన్ని కాపాడే సైనికుడు ఇద్దరూ దేశానికి అతి ముఖ్యమైన వారు.కర్షకుడు, నిత్యకృషీవలుడు ,భూమికి స్నేహితుడు,ప్రకృతి ప్రేమికుడు ,పర్యావరణ పరిరక్షకుడు ,కాలం కరుణించకున్నా ప్రకృతి వికృత రూపం దాల్చినా మొక్కవోని ధైర్యంతో ముందుకు సాగిపోయే రైతు వెనకబడటానికి కారణమేమిటో ఆలోచించాల్సిన అవసరం ఉంది."మట్టి వాసన తెలియనివాడు మద్దతు ధర నిర్ణయిస్తే /పంట పండించనివాడు పంట నష్ట పరిహారం ప్రకటిస్తే" అటు ప్రకృతి,ఇటు పాలకులు,మరొకవైపు పారిశ్రామికవేత్తలు రైతును అన్నీ రకాల మోసం చేస్తూ అణగదొక్కటానికి ప్రయత్నిస్తే రైతు వెనకబడక ఏం చేయగలడు?వ్యవసాయానికి ప్రాణం పోస్తూ,రైతును ప్రోత్సహిస్తే తప్ప భవిష్యత్తరాలవారు అనుసరించలేరన్న గొప్పనిజాన్ని మన ముందుంచిన హసేన నిజంగా ప్రశంసనీయుడు. సైనికుల త్యాగం చెరిగిపోదని,వారి బలిదానం రేపటి ఉదయంకోసమేనని దేశంకోసం పోరాడి అమరులైన సైనికుల గాథలను త్యాగభరిత జీవితాలుగా ప్రకటించారు.

"ప్రకృతిలో నువ్వు నేను భాగమే/నీ అస్తిత్వం కోసం నన్ను బలి చేస్తావేందుకు?"మనిషిని ప్రశ్నించిన చెట్టుకు సమాధానం ఎవరు చెప్పాలి? నువ్వు, నేను, మనందరం..లేదంటే కూర్చున్న కొమ్మనే నరుక్కున్న అజ్ఞానివలె అన్న వాక్యాలు.ప్రస్తుత పరిస్థితికి అద్దంపట్టినట్లుగా ఉంది "నేను చెట్టుని" కవిత.

ఇంకా ఈ సంపుటిలో "ఆత్మ విశ్వాసపు ఆలోచనలు /నిన్ను ముందుకు నడిపిస్తే" పేదరికాన్ని జయించ గలమని,కులమతాల అడ్డుగోడలు కూలనప్పుడు /తీరం వలె నువ్వు-కెరటం వలె నేను మిగిలిపోక తప్పదని ,వాటిని దూరం చేసుకున్నప్పుడే నువ్వు-నేను ఏకమౌతామని, వనమహోత్సవం తో "ఆపదలు నివారించు/రేపటి తరము రక్షించు/వృక్షాలను పెంచుదాం/ కాలుష్యం నివారిద్దా"మని, చావుపుట్టుకలు ఆశాశ్వతమని/నీవు లేని లోటు పూడ్చలేనిదై ఉండాలని /ఎప్పటికీ నీ జ్ఞాపకాలు తరుముతూ ఉండేలా నీ జీవితముండాలని,బంధం ఎప్పుడూ బంధీ కాదు బంధా

ఎవరు గొప్ప...!!

భగవంతుడా ! మానవుడు
నిన్ను హస్తగతం చేసుకున్నాడు
భక్తి పేరుతో ముక్తి పేరుతో
మానవుని చేతిలో
బంధింపబడ్డావు
కాదంటావా?!
మానవుడు నిర్ణయించిన ప్రకారం
నీ నిత్య పూజలు
ఉదయం మేలుకొలుపు
అర్చనలు ఆరాధనలు
మధ్యాహ్నం నైవేద్యం
ఆపై కొంతసేపు విశ్రాంతి
తిరిగి సాయంత్రం మళ్లీ పూజ
అర్చన ఆరాధన నివేదన
రాత్రి తొమ్మిది దాటిన తర్వాత
పవళింపు సేవ...
మరి మానవుని చేతిలో
నీవు కీలుబొమ్మ కాదా?
అంతా మానవ నిర్ణయం
ప్రకారమే నీవు నడుచుకోవాలి
నడుచుకుంటున్నావు కూడా
మరి కనబడని నీవు గొప్ప
కనిపించే మేము గొప్ప...!!
నీ సేవల పేరుతో
కోట్లాది జనులు బ్రతుకుతున్నారు
నీకు శరగోపం పెడుతున్నారు.
నీ పూజలకు రుసుము పెట్టి
కోట్లు గడిస్తున్నారు
ఆలయాలను నడుపుతున్నారు
నీ పేర వ్యర్థులు బ్రతుకుతున్నారు
వ్యాపారులు బ్రతుకుతున్నారు
నిరుపేదలు బ్రతుకుతున్నారు
నిత్య దరిద్రులు బ్రతుకుతున్నారు
భక్తితో నిన్ను వశపరచుకున్నారు
నీవిప్పుడు మానవుని చేతిలో బందీవి
కాదంటావా....
అయినా నీలో
నిశ్చలత్వం నిలకడగా ఉంది
మానవులలో
చంచలత్వం తాండవం చేస్తుంది
నీకు మాకు మధ్య ఉన్నా తేడా
నీవు సూత్రధారివి !
మేము పాత్రధారులం !!
గెలుపు నీదే..... భగవాన్ !!

– రస స్రవంతి –9290215858
కావ్యసుధ – 9247313488

వృథా చేయకు నీటిబొట్టు

జలము జీవులకు ప్రాణాధారం
జలమే జీవక్రియలకు ఆధారం
వృథా చేయకు నీటిబొట్టు
వర్షం నీటిని ఒడిసిపట్టు...!

నదుల వద్దనే నాగరికత
నీటితోనే మానవుల భవిత
నీరుంటేనే పంటలు పండు
నీరు లేకున్న గొంతులెండు...!

ఒకవైపు నీటి వృథా
మరోవైపు గొంతెండే వ్యధ
నీరుంటేనే మనును జీవులు
నీరుంటేనే సాగును బ్రతుకులు...!

శుద్ధిచేసిన మురికినీటితో
పంటలు పండించే
ఇజ్రాయెల్ దేశాన్ని చూసి...
ఎడారిలోనూ కూరలు పండించే
శాస్త్రీయ విజ్ఞానాన్ని స్వంతం చేసుకొందాం...
ఉప్పు నీటిని మంచినీటిగా మార్చే
ఆధునిక నైపుణ్యాన్ని అలవరచుకొందాం...
చుక్క చుక్కనూ ఒడిసిపట్టే
బిందుసేద్య పద్ధతులను ఆచరించుదాం...!

ముందుతరాలకు తెలియజెప్పుదాం
భూగోళంపై మూడు శాతం కన్నా
తక్కువున్న మంచినీటి ప్రాధాన్యతను
కన్నీటిపాలు కానీయక
వారి సుందర భవితను...!!!

–చంద్రకళ. దీకొండ,
9381361384

శ్రామికులు

(తేనీయలు)

ఎండ వేడికి ఓర్చి శ్రామికులు
పొద్దంతా పని చేస్తుండును..!
పూట తిండి కొరకు పేదలు.
పడరాని పాట్లెన్నో పడును..!!

కండలను కరిగించుకుంటూ..
కాయ కష్టమును నమ్ముకుందురు..!
కొండల్లాంటి బండలనైను
తన బలముతో పిండి చేయుదురు..!!

రక్తాన్ని చెమట రూపంలోన
ధారపోసి పంట పండించును..!
తన కష్టాన్ని అమ్ముకొనుచు
సేటు గాడు బతుకుతుండెను.!!

రంగు రంగుల బంగ్లాలెన్నో
తమ చెమటనద్ది కడుతుండెను..!
వానలు పడితే ఉరిసేటి
గుడిసెల్లోన జీవిస్తుండెను..!!

ఒంటికి చిల్లులు పడినంగితో
ఇంటిని వెళ్లదీస్తుంటరు..!
చక్కనైన అంగిపేగొక్కటి
లేక కాలము గడుపుతుంటరు..!!

ప్రతి పనియందున ముందుండి
పనులన్ని చేస్తు వుంటారు..!
ఆపతి వచ్చినప్పుడు వాళ్లకు
పైసన్న దొరుకకుంటున్నరు..!!

శ్రమ దోపిడి చేసి శ్రామికుల
కష్టాన్ని దోచుకుంటున్నరు..!
వడ్డీ మీదడ్డేసి వారిని
నిండుగాను ముంచుతున్నరు..!!

పనికి తగినటువంటి భృతిని
అందేలా చట్టాలు తేవండి..!
చట్టాలన్నీయు యజమాని
చుట్టాలు కాకుండ చూడండి..!!

శ్రామికుల కష్టానికి తగిన
గౌరవమును కల్పించండి..!
హక్కులకు భంగం కలగకుండ
ఆత్మగౌరవము కాపాడండి..!!

–పసుల.శంకర్
9542181301

నువ్వేంచేస్తావో తెలియదుగానీ....

చీకటిప్పటికీ వర్షంలా కురుస్తోంది
మనిషినీ తడుపుతోంది
మనసునూ తడుపుతోంది.

పాడు చీకటి
ఇప్పుడప్పుడే పోయేలా లేదు
కరోనా కక్కిన చీకటి కదా!
అంత త్వరగా పోదులే

కొక్కానికి
మౌనంగా వేలాడుతున్న తెల్ల చొక్కా
బల్లపై నిద్దరోతున్న కళ్ళజోడు
శవాసనమేసిన మడతమంచం
తడినికోల్పోయిన ఉత్తరంముక్క
ఎటూ కదల్లేని చెప్పులజత
జ్ఞాపకాలుగా మారిపోయిన
ఆత్మీయులను గుర్తుచేస్తున్నాయి

ఈ భయంకరమైన చీకట్లో
ప్రతి జ్ఞాపకం ఓ ముళ్ళై గుచ్చుకుంటోంది
ప్రతిక్షణం ఓ పామై తరుముతోంది

సూర్యుణ్ని వేడుకుంటావో!
చంద్రుణ్ని కీర్తిస్తావో!
నువ్వేంచేస్తావో తెలియదుగానీ
ఓ కాలపు మంత్రదండమా !
కరోనా కక్కిన చీకటివర్షానికి
తడిసిముద్దైన ఇళ్ళల్లో కాస్త
ఆశాజ్యోతిని వెలిగించవూ...!!

– ఎన్.నరేశ్ చారి
9701334516

"మన జాగ్రత్తే- మనకు రక్ష" (కథ)

"అమ్మాయి భారతీ! భగీరథుడు కనిపించడం లేదు ఎక్కడి కెళ్ళాడూ!" అంటూ మధ్యాహ్నం నడుం వాల్చిన సత్యవతి లేచి వరండాలోకి వస్తూ, తన మనవడి కోసం కోడలు అంకితతో అడుగుతోంది.

"ఇందాకే పక్కింటి మీనాక్షి వాళ్లబ్బాయి వస్తేనూ పంపించానత్తయ్యా! ఏం ఏదన్న పనా?"

"పనేం లేదు గానీ.. మిట్ట మధ్యాహ్నం తలలు పగిలేంత ఎండలున్నాయి బయటకెందుకు వెళ్ళాడా! అని"

ఆమె మాట పూర్తవక ముందే "ఇంట్లో పిల్లలు ఊరికే కీచులాడుకుంటుంటే.."

"పిల్లలన్నాక ఆమాత్రం అల్లరి చేయరా ఏంటీ?..."

"అల్లరి కాదత్తయ్యా! ఆ సెల్‌ఫోన్‌లో ఏదో గేమని మరేదో అని చిన్నది సంపెంగ వాడూ నాక్కావాలంటే నాక్కావాలని తగువులాడు కుంటున్నారు. అందుకని.."

"కరోనా మూలంగా ఎవరినీ బయట కెళ్లొద్దంటే నీవేమో.."

"అవునత్తయ్యా! మీరనేది నిజమే కాని, చాలా రోజుల నుండి గంప కింద మూసి పెట్టిన కోడి పిల్లల్లాగా దాచా, పాపం ఎంతకని బంధిస్తామని..."

"సరే మంచిపనే చేశావు గాని, వీడు బయట ఎవరెవరితో తిరుగుతాడో ఏమో?.."

"ఎటు వెళ్లాడత్తయ్యా! మహా అయితే క్రికెట్ ఆడుకోవచ్చు"

"అంత గట్టిగా ఎలా చుప్తున్నావమ్మా?"

"వెల్తూ వెల్తూ క్రికెట్ బ్యాట్ కూడా తీసుకెళ్లాడు. అందుకే.."

"సరేలే గాని, అదేదో నోటికి గుడ్డ కట్టుకోమని చెప్పావా?..

"మాస్క్ కదా! చెప్పానత్తయ్యా!"

"అది సరే మరి పాప సంపంగి ఎక్కడా?.."

"అది ఫోన్లో ఏదో చూస్తూ నిద్రపోయి నట్టుంది అత్తయ్యా!"

ఈ మాటల మధ్యనే కోడలు అంకిత కాఫీ కప్పు అందిస్తుంటే "ఏమమ్మా! శాంతేశ్వరెక్కడా? సాయంత్రం ఐదున్నర కావొస్తుంది. డ్యూటీ ఎలాగో లేదు. ఇంత వరకెక్కడి కెళ్లాడూ?" అని తన అబ్బాయిని గురించి అడుగుతున్నంతలోనే "అదిగో అబ్బాయి వచ్చినట్టున్నాడు, గుమ్మం దగ్గర నీళ్లూ సబ్బూ పెట్టావా?" అని అడిగింది.

"ఆ ఇందాకే పెట్టా నత్తయ్యా!" అని జవాబిచ్చింది అంకిత.

అలా వచ్చిన తమ అబ్బాయి శాంతేశ్వర్ గేటు లోపలికి వచ్చేసి కాళ్లూ చేతులూ ముఖం కడుక్కుని లోపలికి వనస్తూనే "అంకితా! పిల్లలు ఏరీ కనిపించడం లేదు?.." అని అడిగాడు భార్యను.

"చిన్నది పడుకొని ఉంది. బాబును నేనే కాస్సేపు బయట ఆడుకొని రమ్మని పంపానండీ!"

"అలాగా! ఎందుకు పంపావు. గ్రౌండులో ఎలాంటి వాళ్లు వస్తారో ఏంటో.." అని తాను అంటుండగానే ఒళ్లంతా చెమటలు పట్టి తడిసి ముద్దైపోయి వచ్చాడు భగీరథ్.

ఇది చూసి "నాన్నా భగీ! అక్కడ నీళు న్నాయి, సబ్బుతో చక్కగా రుద్ది కాళ్లూ చేతులు కడుక్కొని రారా!.. నానమ్మ మాట పూర్తవక ముందే

"నాయా! మేమే గెలిచాం. నేను మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్.." అంటూ మనవడు ఉల్లాసంగా చెప్పుంటే

"అది సరేలే.. నీ ఆట సంగతి తర్వాత చెబుదువు గాని, ముందు కడుక్కొని రారా బుజ్జీ! అంటూ నాన్న చెప్పగానే అలాగే చేశాడు పదేండ్ల భగీరథ్.

నానమ్మ దగ్గరికి రాగానే చెమటతో తడిసిన తలను తుండు గుడ్డతో తుడిచింది. అంతలోనే తల్లి అంకిత బూస్టు కలిపిన పాలకప్పు అందించగానే అది తాగుతూ తాము ఆడిన క్రికెట్ కబుర్లు చెపుతూ "నానమ్మా! నేను బోలింగ్ చేసి నలుగురిని అవుట్ చేసా మళ్లీ ఇరువై నాలుగు పరుగులు కూడా చేశా. తెల్సా?.." అని ఉత్సాహంగా చెపుతుంటే

ఆ ఆట అర్థమైనా కాకున్నా మనవడి ఉత్సాహానికి మరింత ఊతంమిస్తూ "అసాధ్యుడవురా నాన్నా! పట్టు బిగించా వంటే సాధించేవరకు ఊరుకోవురా! అందుకే మీ తాతయ్య నీకు భగీరథా అని పేరుపెట్టాడు. శెహబాస్" అంటూ మనవడి నుదురు ముద్దాడబోతుంటే

"అమ్మో ముద్దాడరాదే నాయి" అని భగీరథ్ గుర్తు చేయగానే "అవునవును భలే గుర్తు చేశావురా! సంతోషమొచ్చి మనసారా కౌగిలించుకోరాదట, ముద్దాడొద్దట, చేతులు కలుపొద్దూ, దగ్గొద్దూ తుమ్మొద్దు, ఇదేం పాడు రోగం పురుగొచ్చిందిరా నాయనా!.."

అంతలోనే మనవరాలు సంపంగి వస్తూ

"నాయా! అంతేకాదు దగ్గర దగ్గరగా కూచో రాదట కూడా, కేవలం ఇంట్లోనే ఉండాలట..." అని చెప్పుంటే

"అవునే సంపంగీ! నీవు ఫోను కావాలని తగవు చేస్తుంటేనే కదా! మీ అమ్మ అన్నయ్యను బయటికెళ్లి ఆడుకోమని పంపింది" అని అంటూనే "సరే గాని, టీవీ పెట్టవే తల్లీ సమయం ఆరుకావొస్తోంది, అదేదో మహాభారతం వస్తుందట" అని చెప్పగానే టీవీ చూడడంలో మునిగిపో యారందరు.

ఎప్పటి మాదిరిగానే అందరూ కల్సి రాత్రి భోజనం చేసి తన నానమ్మ దగ్గరికెళ్లి పడుకున్నారు పిల్లలు. పిల్లలిద్దరూ తమ నాన్నమ్మ దగ్గరే పడుకుంటారు. ఆ పెద్దావిడ చెప్పే కథలు, పాడే పాటలూ వింటూ చెరోపక్క నానమ్మ మీద చేతులేసి హాయిగా నిద్రపోవడం వారికి మామూలే.

ఆ రోజు కూడా అలాడే పడుకున్నారు. బహుశా అప్పుడు ఏ అర్థరాత్రో అయి ఉంటుంది. ఉన్న ఫలంగా భాగీరథ్ మూలుగుతూ "నాయా! ఫ్యాన్ వేసింది ఉందా! నాకు ఊపిరాడడం లేదే! అంటూ లేచి కూచున్నాడు.

అబ్బాయి పిలుపుతో నిద్ర లేచిన నానమ్మ లైటువేసి "ప్యాన్ వేసిందే ఉందిరా నాన్న! అని చెప్తూనే మనవడి నుదురు తడిమి చూస్తూ "అమ్మో! ఇంత వేడిగా ఉందే" అని అనుకుంటూనే ప్రతి రోజు టీవీలో వస్తున్న యాడ్స్ మాటలు గుర్తుకొచ్చాయి ఆమెకు.

> "భగీరథా? బాగానే ఉన్నాడు.పర్వాలేదు. కోలుకుంటున్నాడు మేడం. ఇంకో వారం, పదిరోజుల్లో డిశ్చార్జి కావచ్చు. అయినా అతనికి ఈ వైరస్ ఎలా సోకిందో మీకెవరికైనా తెల్సా?.."

తనకేతో అనుమానం వచ్చి పక్క గదిలోనున్న తన కొడుకు శాంతేశ్వర్‌ను నిద్రలేపి విషయాన్ని చెప్పింది.

శాంతేశ్వర్ రావడంతోనే తన భార్యతో ఓ గ్లాసెడు వేడి నీళ్లు పెట్టించి, ఆ నీళ్లలో చిటికెడు పసుపు కలిపి తాగిం చాడు. చూస్తుండగానే ఓ గంట గడిచిపోయింది. బాబుకు జ్వరంతో బాటు దగ్గు, ముక్కు కారడం, ఆయాసం కూడా మొదలయ్యాయి. శాంతేశ్వర్‌కు అనుమానమొచ్చేసి వెంటనే మెడికల్ అంబులెన్స్‌కు ఫోను చేశాడు. ఇంట్లో అందరికందరూ గాబరా పడిపోతు న్నారు. వాళ్లెవరికీ కాళ్లూ చేతులూ ఆడడం లేదు.ఒక్కసారిగా అవాక్కైపోయారు. ఏం తోచడం లేదు. వస్తున్న దుఃఖం ఆపుకోలేక నానమ్మ సత్యవతి బోరున ఏడ్చేసింది కూడా. వారి పరిస్థితి గమనించి పొంగి వస్తున్న దుఃఖాన్ని పంటికింద అదిమి పట్టుకొని తన తల్లినీ భార్యనూ "ఊరుకోండి ఇప్పుడేమైందని అలా.." అని అంటుండగానే మెడికల్ అంబులెన్స్ హారన్ వినబడింది.

ఆ వెంటనే పరుగెత్తుక వెళ్లి గేటు తాళం తీయడంతో మెడికల్ సిబ్బంది వచ్చి వెంటనే భగీరథ్‌కు జ్వరం స్క్రీనింగ్ టెస్టు చేసి "కరోనా వైరస్ డౌటుంది" అని చెప్పారు.

వైద్యుల మాట వింటూనే "సార్ మరొకసారి టెస్టు చేయండి సార్ అది కాకపోవచ్చు" అని వారిని బతిమాలు కున్నాడు.

"అదేదో అస్పత్రికి వెళ్లిన తర్వాత కరెక్ట్ రిపోర్టు వస్తుందిలే" అని ఆ మెడికల్ సిబ్బంది చెప్పారు.

అంత పొద్దున్నే హారన్ చప్పుడుతో విస్తుపోయిన ఆ వీధిలోని జనం అందరూ పోగయ్యారు. ఏం జరిగిందో అని "శాంతేశ్వర్ గారూ! బాబును క్వారంటైన్‌ల్లోరి తీసుకెల్తున్నాం. అక్కడ పూర్తి పరీక్షల తర్వాత ఒకవేశ వైరస్: పాజిటివ్ అని వస్తే బాబుని ఐసోలేషన్లో పెడ్తాం అని అందుకని బాబుకు కావాల్సిన బట్టలు పెట్టివ్వండి" అని చెప్పగానే..

అంత వరకు గుండె నిబ్బరంతో ఉన్నపెద్దావిడ దుఃఖిస్తూనే బట్టలు సర్ది బ్యాగు తెచ్చిచ్చింది. బాబు తన బ్యాగు తీసుకుని అంబులెన్సు వైపు వెల్తుంటే ఒక్క భగీరథ్ కుటుంబీకులే కాదు, అక్కడ గుమిగూడిన ఆ వీధిలోని ప్రతి ఒక్కరూ కుమిలి కుమిలి ఏడుస్తున్నారు"

"పాపం చిన్న పిల్లోడు రోజూ తననాన్నమ్మ పక్క వదలక పడుకునేటోడు అక్కడ ఎలా ఎంటాడో" అని కొందరు.

"ఆట పాటల్లో చురుకైన వాడు అందరితో కలగొలుపుగా ఉండేవాడు" అని మరి కొందరు,

"ముద్దుగా బొద్దుగా ఎప్పుడూ నవ్వుతూ ఉండేవాడు" అని ఇంకొందరు.

"ఎంత పాడు రోగం పురుగొచ్చిందిరా నాయనా" అని మరికొందరు

"అందుకే గడప దాటి బయటకెల్లొద్దురా అంటేవెళుతారు" ఇలా తలా ఒక మాటల మధ్యే భగీరథ్‌ని అంబులెన్స్‌లో తీసుకొని వెళ్తుంటే ముక్కు మీద వేలేసుకొని నిర్ఘాంతపోయి చూస్తూ నిలబడిపోయారు ఆ వీధిలోని జనం.

వీధిలోని వారందరూ ఈ అనుకోని సంఘటనతో నిశ్చేష్టులై కొయ్యబారిపోయి ఆలోచిస్తున్నంతలోనే,మరో అంబులెన్సు హారన్ వేస్తూ శాంతేశ్వర్ ఇంటి ముందు ఆగింది.

అది చూసి వీధిలోని వారంతా ఇంకేమిటో నన్నట్టు వింతగా చూస్తున్నారు.

ఆ అంబులెన్సు రాగానే బెంబేలెత్తి పోయిన అంకిత "అయ్యో పాపిష్టి దాన్ని నేనే బయటికెళ్లి ఆడుకోమని చెప్పా, బాబూ! భగీరథా!.." అని కేక లేస్తూ కంటికేక ధారగా విలపిస్తోంది.

ఇది గమనించిన శాంతేశ్వర్ విసుక్కుం టూ "ఛా ఊరుకో" అని గద్దించి పెట్టాడు. ఇటు పాప సంపంగి రాగం తీసి ఏడుస్తున్నదల్లా నాన్న గద్దింపుతో మౌనంగానే కుమిలిపోతోంది. పెద్దావిడ చాలా సేపటి నుండి నిశ్శబ్ద రోదనలోనే మునిగిపోయి ఉంది.

తమ ఇంటి ముందు అంబులెన్సు ఆగడంతోనే అందులోనున్న సిబ్బంది వ్యానుదిగి "మీ ఇంట్లో భగీరథ్‌తో ఎవరెవరు చనువుగా ఉన్నారో! వారినందరినీ క్వారెంటైనుకు తీసుకెళ్లాలి, తొందరగా రెడీ అవండి" అని చెప్పారు కాదు ఆర్డర్ వేశారు.

వారలా చెప్పగానే అంతవరకు మౌనంగానే రోదిస్తున్న పెద్దావిడ కేకలేస్తూ బిగ్గరగా రాగం తీసింది. ఆమె అరుపులకు జవాబు చెప్పలేక ఉన్న ఫలంగా ఇంటికి తాళం వేసి నిశ్శబ్దంగా వ్యానువైపు నడిచాడు శాంతేశ్వర్. అతనితో బాటు మిగతా కుటుంబ సభ్యులు కిక్కురుమనకుండా ఆయనను అనుసరించారు.

వైద్య సిబ్బంది వ్యానులోకి వెల్తూ "మీలో ఎవరికైనా కరోనా వైరస్ లక్షణాలు ఉన్నాయోలేదో తెలువాలంటే కనీసం ఓ పదునాలుగు రోజులైనా పడుతుంది. అంతవరకు మిమ్మల్ని క్వారంటైన్లో ఉంచుతాం, ఒకవేశ అంతరవకు ఆ లక్షణాలు లేకపోతే మిమ్ము పంపించేస్తాం.."అని చప్తూనే వ్యాను స్టార్టు చేసుకొని వెళ్లిపోయారు.

వైద్యులు పరీక్షలు చేసి వారిలో ఏ ఒక్కరికీ కరోనా లక్షనాలు లేవని, ఆ వ్యాను హారను శబ్దం విని వీధిలోని జనమంతా పరుగెత్తుకొచ్చారు. మళ్లేమైందో నన్న ఆత్రుతతో. వారందరినీ చూసి ఆ వైద్య సిబ్బందిలోని ఓ సీనియర్ 'చూడండీక్ష్మ బ్రదర్.ఇస, వీరి కెవ్వరికీ కరోనా వైరస్ లక్షణాలు ఏమీ లేవులే కానీ, మీరందరూ ప్రభుత్వం వైద్యులు చెప్పే జాగ్రత్తలు తూచాతప్పక పాటించాలి.." అని చెప్పంటే

వీధిలోని ఓ పెద్దావిడ కల్పించుకుని "సార్! భగీరథ్..." అని అడిగింది

> ఈ రోగానికి ఇంతవరకు వైద్యం లేదు. అది రాకుండా జాగ్రత్త పడడమే ముఖ్యం. ఈ వ్యాధి సోకి చనిపోయిన శవాన్ని కూడా ఇవ్వరు, ఇంటి నుండి వెళ్లినప్పటి చూపే ఆఖరి చూపవుతుంది తెల్సా!

అనుమానంగా

"భగీరథా? బాగానే ఉన్నాడు. పర్వాలేదు. కోలుకుంటున్నాడు మేడం. ఇంకో వారం, పదిరోజుల్లో డిశ్చార్జి కావచ్చు. అయినా అతనికి ఈ వైరస్ ఎలా సోకిందో మీకెవరికైనా తెల్సా?.." అని అడిగాడు.

ఆ ప్రశ్నకు స్పందించిన ఇంకో ఆయన కలి&ంపచుకొని లేదు సార్, గవర్నమెంట్ లాక్‌డౌన్ డిక్లేర్ చేసిన నాటి నుండీ నేటి వరకు మా వీధిలోకి ఏ బంధు మిత్రులను గాని,కొత్తవారిని గాని రానివ్వలేదు. పైగా మేమందరం ఐక్యంగా ఉండి కరోనా కట్టడికి కావల్సిన అన్ని జాగ్రత్తలు తీసుకున్నాం సార్, శానిటైజర్ గాని, మాస్కులు గాని భౌతిక దూరంగానిఇలా మీరు సూచించిన సూచనలన్నీ పూర్తిగా పాటించాం, అయినా ఈ వైరస్.." అని అనుమానం వ్యక్త పరుస్తుంటే..

"మేము అబ్బాయి భగీరథుతో వివరాలు అన్నీ ఆరాతీశామండీ..."

"ఆ ఏం చెప్పాడు సార్.." అని ఓ వయో వృద్ధుడు అడుగుతుంటే

శాంతేశ్వర్ వైపు తిరిగి చూస్తూ "మీ అబ్బాయి క్రికెట్‌లో మంచి బోలరట గదా!..." అని అడుగుతుంటే

అప్పుడు ఆ వీధిలోని ఓ కుర్రాడు ఆ మాటల్లో కలిగించుకుంటూ అవునంకుల్, అతను మంచి బౌలర్,స్కూల్ లెవల్ మ్యాచుల్లో అతనే మ్యానాఫ్ ది మ్యాచ్.."

" ఓ అలాగా! గుడ్, కానీ ఆ బౌలింగ్ చేసేటప్పుడు బంతి శైనింగు కోసం దానికి ఉమ్మి పూస్తారు కదా!..."

"అవును సార్, అలా అయితేనే బ్యాటుకు తగిలిన బాల్ గాల్లోకి లేసి క్యాచుకు అవకాశం.."

"అదే. అతని కన్న ముందు బౌలింగ్ చేసిన వ్యక్తి ఉమ్మి ఇతని చెయ్యికి అంటి ఆ చెయ్యి ద్వారా తిరిగి తన నోట్లోకి ఆ ఉమ్మి పోయి వుంటుంది. అదీ గాక ఎవరో అపరిచితుడు వచ్చి ఇదిగో ఇలా బౌలింగ్ చేస్తే యాంకర్ వేసినట్టు వుంటుందని చెప్పి రెండు మూడు బాళ్లు కూడా వేశాడట, అతనెవరో ఎవరికీ తెలువదు. బహుశా అతనికి ఈ వైరస్ సోకినట్టు తెలువదేమో అలా అతని ద్వారా.."

వైద్యుని మాటల మధ్యే కలగించు కుంటూ "అలాంటి లక్షణాలున్న వారెవ్వరూ లేరు సార్" మరో ఆయన చెపుతుంటే

"అవును ఏ లక్షణాలూ ఉండకపో వచ్చు. అందరికీ జ్వరం, దగ్గు, తుమ్ములు, జలుబూ, ఒళ్ల నొప్పులూ లాంటివేమీ ఉండాలనేమీ లేదు. ఏది లేకుండానే ఈ వ్యాధి ముదిరిపోతుంది.."

'ఇదేం విచిత్రం సార్, ఏ లక్షణాలూ లేకుం.."

"అవును అందుకే మనకు కనబడే ప్రతీవారిలో ఈ కరోనా వైరస్ ఉన్నవారే అనుకొని మసులుకోవాలి, దాటి వెళ్లొద్దు అత్యవసర పని ఉంటే తప్ప, అది కూడా ఒక్కరే వెళ్లాలి అదీ అన్ని జాగ్రత్తతోనే వెళ్లాలి. బయటి నుండి రాగానే కాళ్లూ చేతులూ ముఖం సబ్బుతో కడుక్కోవాలి. బయటికెళ్లొచ్చిన దుస్తులతో ఇంట్లోకి వెళ్లొద్దు, ఫ్రెష్ దుస్తులే ధరించాలి. బయట ఎవ్వరినీ తాకొద్దు, బయటి వస్తువులు ఏవైనా సరే తాకితే సానిటైజరుతో శుభ్రం చేసుకోవాలి. పెళ్లిళ్ళు పేరంటాలు మానేయండి. మొహమాట పడకుండా రానని చెప్పండి. మన ఇంట్లో కార్యక్రమాలకు కూడా ఇదే వర్తిస్తుంది. మందిర్ మజ్జిద్ చర్చీలకు వెళ్లకుండా మీ ఇంట్లోనే పూజలు పునస్కారాలు చేసుకోండి. మన జాగ్రత్తలో మనం ఉండాలి.

ప్రతి రోజు ప్రతి వారు నీటి ఆవిరిని పీల్చడం, వేడిగా ఉండే టీ కాఫీ లేదా మంచినీళ్లైనా సరే మూడు, నాలుగు సార్లు, తాగండి, మీ పిల్లలకూ తాగించండి. శొంఠి చూర్ణంతో భోంచేసే ముందుగా ఒక అన్నం ముద్ద తినండి, ఇంతే గాక మనకు నిత్యం లభించే తులసి ఆకులు, అల్లం, పసుపు, మిరియాలు, లవంగాలు, బెల్లం వీటన్నిటినీ కొద్ది కొద్దిగా తీసికొని, నీళ్ళల్లో మరిగించి తాగండి, అలాగే బయటి తింటి అంటే హోటళ్ళు మొదలగుతిండిని పూర్తిగా మానేసి ఇంట్లో వండిన తిండినే తినాలి. ఇక అన్నిటికైనా ముఖ్యమైన విషయమేమిటంటే 60 సంవత్సరాలు దాటిన వయోవృద్ధులు మరియు పది సంవత్సరాల లోపు వయస్సున్న వారినిఎట్టి పరిస్థితుల్లోనూ బయటికి వెళ్లనీయరాదు. ఎందుకంటే వీరిలో రోగ నిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. కొంత మందికి మద్యం, సిగరేట్లు, గుట్కాలాంటివి సేవించడం లాంటి అలవాట్లు గనుక ఉంటే మానేయమని చెప్పండి. వీరికి గనక ఈ వైరస్ సోకితే తగ్గడం మరీ కష్టం. ఇలా గనక మీరు అన్నీ జాగ్రత్తలు పాటిస్తే అందరూ బాగుండాలి– అందులో మన ముందాలి' అన్న మాట సార్థకమవుతుంది. మీ ఇష్ట రీతిన మీరుంటామంటే ఇదిగో ఇలాగే జరుగుతుంది. మరి.. "ఇలా సుధీర్ఘమైన ఆరోగ్య సూత్రాలెన్నో చెప్తుంటే..

"అవును సార్ మీరనేది నిజమే కాని. ఇంట్లో పిల్లలు అల్లరి భరించలేక మేమే బయట ఆడుకోమని పంపుతున్నాం"

"అదే కూడదంటున్నాను. ఈ రోగానికి ఇంతవరకు వైద్యం లేదు. అది రాకుండా జాగ్రత్త పడడమే ముఖ్యం. ఈ వ్యాధి సోకి చనిపోయిన శవాన్ని కూడా ఇవ్వరు, ఇంటి నుండి వెళ్లినప్పటి చూపే ఆఖరి చూపవుతుంది తెల్సా! ఎవరో భగీరథుని లాంటి వాళ్లు కొందరే బతికి రాగలరు. లేదంటే దిక్కూ మొక్కూలేని అనాథలాగా తనువు చాలించాల్సిందే"

"మీరన్నది ముమ్మాటికీ నిజమే సార్. మన జాగ్రత్తలే మనకు రక్ష. ఎవరో వస్తారని ఏదో చేస్తారనే భావన వదలండి. మనం పటిష్టమైన కట్టడితో ఉంటే ఈ కోవిడ్ 19 మహమ్మారి తనకు తానే అంతమైపోతుంది. లేదంటే ఒకరి నుండి పాకి ప్రపంచాన్నే హరించి వేస్తుంది. ఇప్పటికే లక్షల మందిని పొట్టన పెట్టుకుంది..." ఇలా అనేక విషయాలు చెప్పి ఆ వైద్య బృందం వెళ్లిపోయింది.

ఒకనాడు వేల మైళ్ల దూరంలో ఉన్న ఈ వైరస్ ప్రపంచంలోనే బలిష్టమైన గోడ దూకి, ప్రపంచ దేశాలన్నీ ఆవరించి నేడు ప్రతి ఇంటి గుమ్మం ముందరికి వచ్చి అవకాశం దొరికితే ఆ ఇంట్లో చొరబడడానికై చూస్తున్నదీ ఈ కరుణించని కరోనా రాక్షసితో ఖబడ్దార్".. అని ఆ వీధి జనం అనుకుంటూ తమ ఇళ్లలోకి వెళ్లిపోయారు.

–దారం గంగాధర్
సెల్:9848384777

రేపటి అత్త

నేటి కోడలే – రేపటి అత్త
అనే విషయాన్ని మరచిన
ఓ కోడళా.....
అత్తలో అమ్మనుచూడాలంటే
అత్తమ్మా అని పిలుచుకో,
అత్తనుపరాయిగాచూసేనువ్వు
రేపటి తరంలోఅత్తవునువ్వే,
నేడు నువ్వు అత్తను బాధిస్తే
రేపటి నీ కోడలు నిన్ను
రాచి రంపాన పెడుతుంది,
స్త్రీకి అత్తిళ్ళు ఓ వరం,
అత్తిళ్ళు కోడలి గౌరవ...
మర్యాదలకు పెట్టని కోట,
అత్తిళ్ళు తరగని నిధి,
అత్తిళ్ళు ఓ ఊరడింపు,
అత్తిళ్ళు బంగారు బాటకు పునాది,
అత్తిళ్ళు రక్షణకుమారుపేరు,
స్త్రీకిఅత్తిళ్ళుసౌభాగ్యాలనిధి,
అత్తిళ్ళునీజీవనగమనానికి నాంది"

–రాయవరపు సరస్వతి
9885656356

నాడు,నేడు- కుటుంబాలు

అనుబంధాలకు పుట్టిల్లు
అనురాగాలకు విరిజల్లు
ఆప్యాయతలకు పుట్టిల్లు
ఆపదంటే ఆదుకునే మనస్తత్వాలు
నిరాడంబరతకు సాక్ష్యాలు!
కలిమిలోనైనా, లేమిలో నైనా..
చేదోడు వాదోడుగా
ఉండే హృదయాలు
అంతా..మనమంతా ఒక్కటే,
అనే..ఆనాటి మన కుటుంబాలు..!
కానీ, నేడు..
ఆడంబరాలు
అధికమయ్యాయి
అనుబంధాలు
బందీ అయ్యాయి
అనురాగాలు మసి బారాయి
ఆప్యాయతలు ఆవిరయ్యాయి...
ఎవరికి వారే యమునాతీరే అన్నట్లుగా
అయిన వాల్లనెవ్వరిని పట్టించుకోరు
ఆపదలో ఉన్నామన్నా పట్టించుకోరు
ఆదుకునే తత్వం లేని వారు
సంపదల వేటలో..
డాంబికాలమోజులో
ఉచ్చ నీచాలు మరుస్తున్నారు
ధనం వెనుక పరుగెడుతున్నారు..
మనమధ్య
బంధాలు ఉన్నాయని మరిచిపోయారు!

నాటికి నేటికి ఎంతో తేడా..
ఇది కొనసాగుతూనే ఉంది..
నేటికీ ఈ వేళ!!

–ఎన్.. రాజేష్
9849335757

రాబందుల విందు!

కువ్వారంతో కుట్రలు పన్ని
యవ్వారం తో అగ్గి రాజేసి
ఆనక చోద్యం చూస్తరు!

సహకారం సాకుతో
ఆయుధాలను అగ్గువకు అమ్మజూపి
అమాయకజాతులను ఆక్రమితులను చేస్తరు!

పరజాతులను పరాజితులనుచేసి
పరాయి చెమటను చౌకగా ఒడిసిపట్టి
ప్రాయోజితవనరులను పక్కాప్రణాళికతో
పంచుకతింటరు!

అభివృద్ధి నెపంతో
అంగళ్ళను కబళించి
రాబందులై! రాక్షసంగా
బొక్కసాల్ని భోంచేస్తరు!

కన్నీళ్లను నెత్తుటేళ్ళను జుర్రుకొని
బతుకుల్ని బజారుకీడుస్తరు!బలి చేస్తరు!
సార్వభౌమాధికారాన్ని సముద్రంలోకలిపి
సామ్రాజ్య కాంక్షల్ని
సాకారం చేసుకోజూస్తరు!

ప్రపంచ యుద్ధాలకు పాదుపడకమునుపే
దౌత్యద్వారాలు బార్లా తెరుచుకోచూడాలి!
విపరీత ధోరణులు పొడసూపకపూర్వమే

"ఈ నవలలో ఎన్నో పాత్రలు. కొన్ని సజీవ పాత్రలు. మరికొన్ని మాజీ ప్రధాని పీ.వీ. రాసిన 'లోపలి మనిషి' నవలలోలాగ సజీవ పాత్రలను కలగా పులగం చేసిన చిత్రణ. కొన్ని ఊహాత్మక పాత్రలు. కొన్ని ఆదర్శ పాత్రలు. వీటిక్కూడా మూలరూపాలు... లేకపోలేదు" అని రచయిత బి.యస్. రాములు అన్నారు. ఆలోచింపజేసి, చైతన్య పరచే ఈ 'చూపు' నవలను ప్రతిరోజు నేటినిజం పాఠకులకోసం...

–సంపాదకులు

18

కొత్త దారి

– సంపాదకులు.



– బి.ఎస్.రాములు
సామాజిక తత్వవేత్త
కౌలి వైర్మన్, టీసీ కమిషన్, తెలంగాణ రాష్ట్రం
సెల్: 8331966987

ప్రిన్సిపాల్ రామచంద్రయ్య స్టూడెంట్స్ కొందరు ఇపుడు ఉస్మానియా క్యాంపస్‌లో చదువుకుంటున్నారు. పీజీ ఫస్ట్ ఇయర్‌లోనే క్యాంపస్ లేడీస్ హాస్టల్లో సీటు దొరికింది వారికి. రీసెర్చ్ పేరిట ఏళ్ళ తరబడి ఓయూ క్యాంపస్‌కే అతుక్కుపోయిన అరుణ్, విజయ్‌లు ప్రెషర్స్‌ని పలకరిస్తూ, సహకరిస్తూ అప్పుడప్పుడు ఎదురవుతుంటారు. ఆర్ట్స్ కాలేజి మేన్ బిల్డింగ్ పక్కన గల ల్యాండ్‌స్కేప్ గార్డెన్‌లో ఉదయం, సాయంత్రం వాకింగ్‌లో పలకరించుకుంటారు.

ఉస్మానియా యూనివర్శిటీ వాతావరణం ఎప్పటికీ ఆకర్షిస్తూనే ఉంటుంది. అక్కడికి వచ్చిన తర్వాత ఆ వాతావరణం అలవాటయ్యాక ఇంటికి పోబుద్ధికాదు. ఇంటికి పోతే ఏముంది. అక్కడ ప్రైవేటు స్కూల్లో చదువు చెప్పుమంటారు... ఇంత బతుకు బతికి ఇంటెనక చచ్చినట్టు. లేదా నిరుద్యోగిగా అందరితో మాటలు పడాలి. పెళ్ళి చేసుకొమ్మని మరోవైపు లొల్లి. అందుకని మంచి ఉద్యోగం వచ్చేదాక ఓయూ క్యాంపస్‌లోనే గడపాలని ఆశ. కాస్త ఆదాయం కోసం పార్ట్‌టైం జాబ్‌లు చేసుకుంటూ అక్కడే ఉండిపోతుంటారు. పీజీ తర్వాత పీజీ చేస్తుంటారు. అలా మూడు నాలుగు పీజీలు, రీసెర్చ్‌ల పేరిట ఏళ్ళ తరబడి క్యాంపస్‌లోనే గడిపేస్తుంటారు. అలా ఎందరో... అందులో అరుణ్ ఒకడు.

ప్రొఫెసర్ లక్ష్మీపతి స్కూటర్ తీసుకొని అపుడప్పుడు ఉస్మానియా యూనివర్శిటీ క్యాంపస్‌లోని ల్యాండ్‌స్కేప్ గార్డెన్‌లో వాకింగ్‌కు వస్తుంటాడు. విద్యార్థులను పలకరిస్తుంటాడు. ప్రిన్సిపాల్ రామచంద్రయ్య ఫోన్ చేసినప్పుడు ఏదో సందర్భంలో వాళ్ళు తన స్టూడెంట్స్ అని సృజన, దీప్తిలను ప్రొఫెసర్ లక్ష్మీపతికి పరిచయం చేశాడు. వాకింగ్‌లో ప్రొఫెసర్ లక్ష్మీపతికి అపుడప్పుడు అరుణ్, విజయ్‌లు ఎదురవుతున్నారు. ఏమయ్యా అరుణ్! ఏదైనా ఉద్యోగం వెతుక్కోవచ్చు కదా! అని ప్రొఫెసర్‌లు పలకరిస్తే మాకెవరిస్తరు సార్! అంటూ నవ్వేస్తాడు అరుణ్. ఈమధ్య అరుణ్ ఏదో దినపత్రికకు విలేఖరిగా పని చేస్తున్నాడు.

సృజన, దీప్తి పీజీ ఫైనల్‌లోకి వచ్చారు. అరుణ్ సృజన పట్ల ఆకర్షితుడయ్యాడు. చొరవ తీసుకొని, పలకరిస్తుంటాడు. దీప్తి అది గమనించింది. సృజనను జాగ్రత్త అని హెచ్చరించింది.

ఉదయం ల్యాండ్‌స్కేప్ గార్డెన్‌లో నాలుగు రౌండ్‌లు వేస్తే ఎంత ఫ్రెష్‌గా, హాయిగా ఉంటుందో... సృజన అలా బయలుదేరుతుంది. అది రెండుమూడు సార్లు గమనించి బద్దకంగా టిఫిన్ వేళకు లేచేవాడల్లా టకీమనీ ఐదున్నరకే లేచి రడీ అయి రీసెర్చ్ స్కాలర్స్ హాస్టల్ నుంచి ల్యాండ్‌స్కేప్ గార్డెన్‌కు బయలుదేరాడు అరుణ్. అరుణ్ పోకడలు చూసి, విజయ్ నవ్వుకున్నాడు.

చల్లగాలి వీస్తోంది. అప్పుడప్పుడే వెలుగు రేఖలు తూర్పున ప్రసరిస్తున్నాయి. ఆకాశాన్ని అంటుకోవడానికి ప్రయత్నిస్తున్న చెట్ల సందుల్లోంచి సూర్య కిరణాలు నేలపై పరుచుకున్న పచ్చగడ్డిని పలకరించాలని ప్రయత్నిస్తున్నాయి.

ఒకపక్కన ఎవరో కొందరు యోగాసనాలు వేస్తున్నారు. మరోపక్కన కొందరు కూర్చుని ఏదో ముచ్చట్లలో పడ్డారు. అరుణ్ వాకింగ్ చేస్తూ సృజనకోసం అటూ ఇటూ చూశాడు. ఎక్కడో గబగబా నడుస్తున్న సృజనను అందుకోలేక నడక మందగించాడు.

సృజన వేగంగా సమీపంలోకి రావడంతో సృజనను ఫాలో అయ్యాడు.

ఫాలో అవుతూ "సృజనా! ప్రెస్‌క్లబ్‌లో ఫెమినిజం మీద ఏదో మీటింగ్ వుంది. ఓల్గా, ముదిగంటి సుజాతారెడ్డి, రత్నమాలతోపాటు మీ మేడం కూడా స్పీకర్. సాయంత్రం పోదామా" అంటూ పలకరించాడు అరుణ్.

"అలాగే అన్నయ్యా...! దీప్తిని కూడా తీసుకొని వస్త" నవ్వుతూ అంది సృజన.

'అన్నయ్యా...!' అనే పిలుపుతో ఖంగు తిన్నాడు అరుణ్. టిఫిన్ చేస్తూ విజయ్‌తో అదే విషయం చర్చించాడు.

"మన తెలంగాణలో పెద్దవాళ్ళను అన్నయ్యా అని పిలవడం కామన్ కదా!" అంటూ సముదాయించాడు విజయ్.

"అందరూ అన్నయ్యా! అని పిలిస్తే ఇక ప్రేమించేది ఎవర్ని..." అంటూ వాపోయాడు అరుణ్.

"ఆడవాళ్ళకు అన్నయ్యా! అనే పిలుపు ఒక రక్షణ కవచం!" అంటూ విజయ్ తత్వం బోధించాడు.

ఆ సాయంత్రం ఫెమినిజం మీద మీటింగ్ విన్న తర్వాత అరుణ్‌కు ఎందుకో విసుగు వచ్చింది.

ప్రెస్ క్లబ్‌నుండి బయట పడి, 136 నెంబర్ బస్సుకోసం రోడ్డుపక్కన నడుస్తూ సృజన, దీప్తి, అరుణ్, విజయ్‌లు అంతదాక విన్నదాన్ని గురించి మాట్లాడుకుంటున్నారు.

"నువ్వు ఏమైనా చెప్పు. ఈ స్త్రీ వాదాలు, దళితవాదాలు, మన తెలంగాణ ప్రజలపై భావజాల ఆధిపత్యం మరో రూపంలో ఆంధ్రావాళ్ళు కొనసాగించడం తప్ప మరేం కాదు..." అంటూ ఖరాకండిగా విమర్శించాడు అరుణ్.

"అదేం కాదు అన్నయ్యా! దానికి దీనికి ఏం సంబంధం? వాళ్ళు తెలంగాణ వాదాన్ని ఎక్కడా వ్యతిరేకించలేదు కదా..." అంటూ సృజన నవ్వుతూనే అరుణ్‌ను ఖండించింది.

"మీకు అలాగే అనిపిస్తది. మీరు ఆంధ్రావాళ్ళ బుట్టలో పడిపోతరు. ఫెమినిజం నిజంగానే మనకు అవసరమైతే మన తెలంగాణ నుంచి ఫెమినిస్టులు ఎందుకు ఎదగలేదు? ముదిగంటి సుజాతారెడ్డి, రత్నమాల ఎంత బాగా మాట్లాడిన్రు. వాళ్ళు ఫెమినిజాన్ని వ్యతిరేకించకుండానే మన తెలంగాణ సమాజం గురించి ఫెమినిజం పరిమితి గురించి ఎంత బాగా చెప్పిన్రు?" అంటూ వివరించాడు అరుణ్.

"అట్లా ఏం కాదు అన్నయ్యా! అన్నిటినీ మనకు వ్యతిరేకంగా అనుకుంటే ఎట్లా? బీసీ, ఎస్సీలు ప్రత్యేక తెలంగాణ ఉద్యమం అగ్రకులాల కోసం పుట్టిందని, ఆంధ్ర తెలంగాణ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల ఐక్యతను చీల్చి తమవైపు తిప్పుకొని, తమ పెత్తనం పెంచుకుందామని, చూస్తున్నరు అని అంటలేరా?" అంది దీప్తి.

"అదంతా బహుజన సమాజ్ పార్టీ వంటివాటిల్లో పనిచేసేవాళ్ళు పని గట్టుకొని మన తెలంగాణ ప్రజలమధ్య చిచ్చు పెడుతున్నరు. అట్లా ఆంధ్ర ప్రాంత ఫెమినిస్టులు, ఆంధ్రప్రాంత దళిత నాయకులు, తెలంగాణా వాళ్ళను రకరకాల పేర్లతో చీల్చి మన మధ్యన్నే కొట్లాటలు పెట్టిస్తరు. వాళ్ళ నాయకత్వం, వాళ్ళ స్వార్థాలు, ప్రయోజనాలు నెరవేర్చుకుంటరు. దళిత మహాసభ ఎన్నడైనా తెలంగాణ దళితుల సమస్యలను పట్టించుకున్నదా? ఉద్యమించిందా? మనమే ఆంధ్ర దళితులకు మద్దతుగా వేలాదిమందితో తెలంగాణ అంతటా ఉద్యమాలు చేసినం. మన ప్రాంత దళితులకు అనుకూ లంగా, మద్దతుగా ఆంధ్రాలో వాళ్ళు ఏమైనా ఉద్యమాలు చేసిన్రా? అభివృద్ధిలో ఆధిపత్యం వహిస్తున్న ప్రాంతంలోని ఏ కులమైనా, ఏ వర్గమైనా, చివరకు ఫెమినిజమైనా, దళిత వాదమైనా అది వాళ్ళ ఆధిపత్యాన్ని, వాళ్ళు మరింత అభివృద్ధి అందుకోవడానికే అంతిమంగా ఉపయోగపడుతుంది. ఈ మాట ఇంత స్పష్టంగా చెప్పక పోయినా సుజాతారెడ్డి చెప్పిన సారాంశం యిదేకదా...!" అన్నాడు అరుణ్.

"అన్నయ్యా! మీదంతా పురుషాధిపత్య భావజాలం. అగ్రకుల పురుషాధి పత్య భావజాలాన్నే మీరు చెప్తున్నరు. మీరు అట్ల థాట్ పోలీసింగ్‌కు గురి కాలేదా?" అంటూ నిలదీసింది దీప్తి.

వాళ్ళ చర్చలో 136 నెంబర్ బస్సు హైదర్‌గూడకు రావడం ఫుల్‌రష్‌గా వుండటంతో వదిలేసి బస్టాప్‌లోనే మళ్ళీ చర్చలో పడ్డారు.

"అస్తిత్వవాదాలను అలా మనం వ్యతిరేకించడం సరైనదేనా... ప్రొఫెసర్ల తోటి మనం చర్చించాలె. తెలంగాణ ఉద్యమంలో భాగంగా ఫెమినిజాన్ని దళితవాదాన్ని అనుసరించి ఉద్యమాలను, డిమాండ్లను, నాయకత్వాలను డెవలప్ చేసుకోవాలా? వాటిద్వారా తెలంగాణ ఉద్యమాన్ని ముందుకు తీసుకు పోవడం సాధ్యమా? వీటిని ముంగటికి తీసుకు వస్తే అందరు కలిసిరావడం సాధ్యమవుతుందా? ఈ అస్తిత్వవాదాలను ముంగటేసుకుంటే తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో ఐక్యత ఎట్లా సాధ్యం? ప్రొఫెసర్ జయశంకర్ మొన్న ఖైరతాబాద్ మీటింగ్‌లో అనలేదా? ఇవన్నీ మనం జయశంకర్ సార్‌తోటి చర్చించాలె" అన్నాడు అరుణ్.

"మన పి.ఎల్. విశ్వేశ్వరరావు, సింహాద్రి సార్లుకూడా బీసీ, ఎస్సీ, ఎస్టీల గురించి వారికి సామాజిక రాజకీయ సాధికారికత గురించి మాట్లాడు కుంటనే తెలంగాణ కావాలె అంటలేరా? అసలు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల అభివృద్ధి కోసమే తెలంగాణ రాష్ట్రం అవసరం అని, అగ్రకులాలవాళ్ళు ఆంధ్రా వాళ్ళతో మిలాఖత్ అయి ఎంతోకొంత ఎదుగుతనే ఉన్నరు. నష్టపోయిందంతా మన తెలంగాణ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలే అని ఎన్నోసార్లు సదస్సుల్లో చెప్పిన్రు కదా!" అన్నాడు విజయ్.

"ఆంధ్ర బీసీ, ఎస్సీ, ఎస్టీలు తెలంగాణ బీసీ, ఎస్సీ, ఎస్టీలకు మద్దతు ఇస్తరా... తెలంగాణ ఉద్యమానికి మద్దతు ఇస్తె వాళ్ళు నిజంగా ఫెమినిస్టు, దళిత బహుజన అస్తిత్వవాదంలో కూడా వెనుకబడిన ప్రాంతాల ప్రజలను పట్టించుకున్నట్టు లెక్క" అన్నాడు అరుణ్.

"నిజమే అన్నయ్యా! ఆంధ్ర బీసీలు ఎక్కడ తమను వదిలేస్తారేమోనని, ఆర్. క్రిష్ణయ్య తెలంగాణ రాష్ట్రం గురించి నోరెత్తుతలేడు. నారగోని అయితే తెలంగాణ ఉద్యమాన్ని వ్యతిరేకిస్తున్నడు. వీళ్ళ నాయకత్వాన్ని ఆంధ్ర బీసీలు, ఎస్సీలు, తెలంగాణ అనంగనే వదిలేసేదయితే వాళ్ళంతా వాళ్ళ స్వప్రయోజనాలకు, స్వార్థాల కోసమే వీళ్ళను నాయకులుగా అంగీకరిస్తున్నరని అర్థం. ఈ మాట మన సామాజిక శాస్త్రవేత్తలు, తత్వవేత్తలు టాగూర్ ఆడిటోరియం మీటింగ్‌లో వాదించలేదా?" అంది సృజన.

"ఏమో... అంతా కన్‌ఫ్యూజింగ్‌గా ఉంది" అన్నాడు అరుణ్.

"కన్‌ఫ్యూజన్ ఎందుకు అన్నయ్యా! మల్లేపల్లి లక్ష్మయ్య, బెల్లయ్య నాయక్, బి.ఎస్. రాములు, కంచె అయిలయ్య వంటివాళ్ళు కూడా తెలంగాణ రాష్ట్రం వస్తేనే అందరి అభివృద్ధి సాధ్యం అని... చెప్తున్నరు కదా!. మన నిధులు, మన నీళ్ళు, మన బొగ్గు, మన కరెంటు వాళ్ళు తీసుకపోవడం వల్లనే మన ప్రాంత బహుజనులు పేదరికంలో కూరుకుపోయి ఉపాధిలేక బొంబాయి, దుబాయ్ పోతున్నరని చెప్తున్నరు కదా...!" అంది దీప్తి.

అంతలో 136 నెంబర్ బస్సు వచ్చింది. ఖాళీగా ఉండటంతో చర్చ మధ్యలోనే వదిలేసి గబగబా బస్సెక్కారు.

×××

సంక్రాంతికి తల్లి మాధవి మానసను, అల్లుడు సుధాకర్‌ను, మనోజ్‌ను, మనోహర్‌ను, రమ్మని మరీ మరీ కోరింది. దీపావళికి రాలేకపోయినా... ఈసారి తప్పకుండా రమ్మని చెప్పింది మాధవి.

నూతన సంవత్సరాదినుండే సంక్రాంతి ముగ్గులు ఊరంతా వేయడం మొదలైంది. సకినాలు, గారెలు, గరిజెలు, అరిసెలు, కారప్పూస మొదలైన రకరకాల పిండివంటలు చాలా కాలం ఆగేవి తయారు చేయడం మొదలైంది. వీధివెంట నడుస్తుంటే ఎక్కడచూసినా అప్పాలు వేయించుతున్న కమ్మని వాసనే. సంక్రాంతికి సెలవులివ్వడంతో స్కూలు, కాలేజి పిల్లలు ఇల్లల్లో హడావిడి.

ఒకరోజు ముందు 20 కిలోల పాతబియ్యం నీళ్లల్లో నానేసింది మాధవి. తెల్లవారి నీళ్లను వొంపి పచ్చి బియ్యాన్ని పనిమనిషిని తీసుకొని పిండిగిర్నికి చేరింది. అక్కడ అప్పటికే పెద్ద లైను. నువ్వు పట్టించుకొని తీసుకరా అని పని మనిషికి చెప్పి ఇంటికి వచ్చింది మాధవి.

ఐదు రోజుల ముందు మనోజ్, మానస వచ్చారు. వియ్యంకులు రాజయ్య, బుచ్చుమ్మలు రాకపోవడంతో మళ్లీ మళ్లీ ఫోన్ చేసింది మాధవి. మరుసటి రోజు వాళ్లు కూడా వచ్చేశారు. సంక్రాంతినాడే మానసకు సీమంతం. ఎన్నిపనులున్నా సుధాకర్ వీలుచేసుకొని రాక తప్పలేదు. రమ్య యుఎస్ఏ నుండి ఫోన్ చేసి అభినందించింది. అప్పటికే రమ్య ఆన్‌లైన్‌లో పంపించిన గిఫ్టులు, బొకేలు కొరియర్‌లో ఇంటికి చేరాయి.

జయ ఫోన్ చేసి అభినందనలు తెలిపింది. అరుణ్, విజయ్, సృజన, దీప్తిలను తమ ఇంటికి రమ్మని మనోజ్ ఎంత కోరినా ఏదో చెప్పి తప్పించు కున్నారు. సృజన, దీప్తి సొంతింటికి వెళ్లిపోయారు. అరుణ్, విజయ్‌లు ఓయూ క్యాంపస్‌లోనే ఉండిపోయారు.

జి జి జి

అస్తిత్వ వాదాల గురించి, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం గురించి, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల వాదాల గురించి, కుల సమస్య గురించి, నాయకత్వ సమస్య గురించి, అనేకవిధాలుగా చర్చలు సాగుతున్నాయి.

అరుణ్, విజయ్, సృజన, దీప్తి వాటిని వింటూ మెల్లిమెల్లిగా అనేక విషయాలు కొత్తగా తెలుసుకుంటున్నారు. ప్రొఫెసర్ లక్ష్మీపతితో అనేక విషయాలను చర్చించి క్లారిఫై చేసుకుంటున్నారు.

"సార్! ఏమైనా అన్నివాదాలు తెలంగాణ రాష్ట్ర ఉద్యమం నుండి మనను పక్కదారి పట్టించటానికే అనిపిస్తున్నది" అన్నాడు అరుణ్.

"అయితే ఏం చేద్దామంటవు" నవ్వుతూ అడిగాడు లక్ష్మీపతి. మళ్లీ తనే అన్నాడు.

"ఎవరి సమస్య వాళ్ళది. ప్రతి ఒక్కరూ తమ సమస్య ముందు పరిష్కారం కావాలని కోరుకోవడం సహజం. అందువల్ల అస్తిత్వవాదాలను, ఫెమినిజాన్ని బీసీ, ఎస్సీ, ఎస్టీల సాధికారికత సమస్యను పట్టించుకోకపోతే వాళ్ళంతా తెలంగాణ ఉద్యమంలో కలిసిరావడం కష్టం. జాతీయ ఉద్యమ కాలంలో అంబేద్కర్ కూడా దళితుల సమస్యను ముందుకు తీసుకువచ్చి చర్చించిండు కదా! జాతీయ ఉద్యమంలోనే చర్చకు తెచ్చి కొన్ని డిమాండ్లు సాధించిండు. కాంగ్రెసువాళ్ళు సైమన్ కమీషన్‌ను వ్యతిరేకిస్తే దాన్ని ఆహ్వానించి దానికి రిపోర్టు ఇచ్చి కమ్యూనల్ అవార్డు సాధించి రిజర్వేషన్లను అమలులోకి తెచ్చిండు. బీసీలకు అలా ఉద్యమం వద్దులే అని గాంధీ సముదాయించి, తన వెంట తీసుకుని వస్తే ఆ తర్వాత స్వతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా వారికి రిజర్వేషన్లు అమలులోకి రాలేదు. అందువల్ల సమస్య మనం అనుకున్నంత తేలికైందేమి కాదు. అన్నిటినీ జాగ్రత్తగా కలుపుకొని పోవలసిందే" అన్నాడు ప్రొఫెసర్ లక్ష్మీపతి.

"ఏమైనా సార్! మన ప్రాంతం అభివృద్ధి చెందడానికి స్వయం పోషకంగా ఎదగడానికి ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు అవసరం. మన ప్రాంతంపై ఇతరుల పెత్తనం ఉన్నంత కాలం మనం ఎదగడం అంత సులభం కాదు. సెమినార్లలో కూడ ఇదే విషయం అనేక కోణాల్లో చెప్పిన్రు కదా సార్!" అన్నాడు అరుణ్.

"ఏదైనా పూనుకొని చేయకపోతే ఏదీ కాదు. ఎప్పుడో మోసం జరిగిం దని, ఎప్పటికీ అట్లనే జరుగుతుందని అనుకోవడం నిరాశ".

"దీనికి పరిష్కారం ఒక్కటే! మన రాష్ట్రం మనకు ఉండాలె. ఉస్మానియా యూనివర్సిటీలో, ఢిల్లీలో జరిగిన సెమినార్లలో అందరూ ప్రాంతీయ అసమాన తల గురించి, చిన్న రాష్ట్రాల ఆవశ్యకత గురించి ఇదే మాట చెప్పిన్రు. ప్రధానమంత్రి దేవెగౌడ చిన్న రాష్ట్రాలకు అనుకూలమని చెప్పిండు. తప్పకుండా ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కావాల్సిందే..." అన్నాడు అరుణ్.

అలా అనేక కోణాల్లో చర్చలు. అనేకచోట్ల చర్చలు. అనేకబృందాల చర్చలు. భావాలు భిన్నమైనవి. ఆశలు భిన్నమైనవి. కార్యక్రమాలు భిన్నమైనవి. కానీ అందరి లక్ష్యం ఒక్కటే తెలంగాణ రాష్ట్ర సాధన.

అలా... అప్పటికే ప్రొ॥ జయశంకర్, ప్రజాకవి కాళోజి, డా॥ దాశరథి రంగాచార్య, ప్రొ॥ బియ్యాల జనార్ధన్‌రావు, కెప్టెన్ పాండురంగారెడ్డి, వెంకట నారాయణ, ప్రొ॥ కేశవరావు జాదవ్, ప్రొ॥ పి.ఎల్.విశ్వేశ్వరరావు, నాట్యకళ ప్రభాకర్, ప్రొ॥ సింహాద్రి, అంబటి సురేంద్రరాజు, మల్లెపల్లి లక్ష్మయ్య, కొండాలక్ష్మణ్ బాపూజీ, టి.ఎన్.సదాలక్ష్మి మొదలైన వాళ్ళు ఎందరో మన ప్రాంతంపై మనకే అధికారం ఉండాలి. మనమే అభివృద్ధి పర్చుకోవాలి, మన భాషను, మన సంస్కృతిని రక్షించుకోవాలి. మన ప్రాంత ఉద్యోగాలు మన వాళ్లకే చెందాలి. మన వనరులపై మనకే అధికారం ఉండాలి. మన భాషను భాషే కాదని ఎగతాళి చేస్తున్నారు. భాష పేరిట మనమంతా ఒక్కటే అని చెప్పి ఉప్పేసి పొత్తుకలిసి ఇపుడు మన భాషే అర్థం కాదు. మీదే భాషే కాదు అంటున్నారు. సినిమాల్లో జోకర్లకు, విలన్లకు, బ్రోకర్లకు మన భాషను పెట్టి అవమానిస్తున్నారు. ఓ సినిమాలో మాకు సముద్రం కావాలె అని హైదరాబాద్ వాళ్ళు అడిగినట్టు హేళన చేస్తే పోస్టర్లను రాళ్ళతో కొట్టినా బుద్ధిరాలేదు. ఇలా అనేక విషయాలు ఉత్సాహంగా, ఆవేశంగా తెలుసుకుంటున్నారు. చర్చించుకుంటున్నారు. అలా చర్చల్లో వాదోపవాదాలు... సంఘర్షణ... ప్రొఫెసర్ లక్ష్మీపతి అవన్నీ వింటూ వాటి మూలకారణాలను విప్పి చెప్పాడు.

×××

"పాశం యాదగిరి, నందిని సిధారెడ్డి, రాపోలు ఆనంద భాస్కర్, గద్దర్, బి.ఎస్.రాములు, గాదె ఇన్నయ్య. వి.ప్రకాష్, నందినిర్మల, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, బీజేపీ నాయకులు, మారోజు వీరన్న మొదలైన వాళ్లు వందలాది మంది టీచర్లు, లెక్చరర్లు, సామాజిక ఉద్యమకారులు ప్రత్యేక తెలంగాణ గురించి ఎక్కడికక్కడ జిల్లాల్లో, తాలూకాల్లో సెమినార్లు పెడుతున్నరు. తెలంగాణ వస్తదా సార్!" అనుమానంగా అడిగాడు అరుణ్.

"వస్తది. కానీ ఎంతో పెద్ద ఉద్యమం జరగాలె. ఈ సదస్సులు, సభలు, సెమినార్లు ఒక దశ. అది చాలది. 1969లో ఎంత పెద్ద ఉద్యమం జరిగిందో మీకు తెలియదు. అంతకుమించి ఉద్యమం జరగాలి. రాజకీయ పార్టీలు పూనుకుంటేనే ఇది సాధ్యపడుతుంది. ఎవరూ ముందుకు రావట్లేదు. వచ్చే వాళ్లు నిలవట్లేదు. ప్రతి ఒక్కరూ తెలంగాణ డిమాండ్‌ను తమ స్వార్థాలకు వాడుకుంటున్నారు. ఒక కొత్త ఉద్యమం కొత్త రూపంలో వస్తే తప్ప తెలంగాణ రాష్ట్రం సాధ్యం కాదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితేనే మన వనరులు, మన ఉద్యోగాలు మనవి అవుతాయి. మన తెలంగాణ భాష, సంస్కృతికి గౌరవం పెరుగుతుంది. స్వయం నిర్ణయ స్వేచ్ఛ పెరుగుతుంది. గతంలో మనం చర్చించిన విధంగా మన ప్రాంతాన్ని మనం అద్భుతంగా అభివృద్ధి పరచుకో వచ్చు." అన్నాడు ప్రొఫెసర్ లక్ష్మీపతి.

"ఉద్యమం ఊరికే వస్తుందా? ఎవరు మొదలు పెట్టినా ప్రజలు నమ్మడం లేదు. మునుపటి తీరుగా ఉద్యమాన్ని ముంచి నాయకులు పైకి వస్తరు అని సంకోచిస్తున్నరు. కొత్త నాయకత్వం, కొత్త తరం ఎదిగితేనే ఉద్యమం ముందుకు సాగుతుంది. రాజకీయ నాయకులు ఎప్పుడైనా ముంచేటోల్లే. సామాజిక ఉద్యమంగా ఉద్యమించాలె. రాజకీయ నాయకులకు నాయకత్వం అప్పగించకూడదు" కాస్త ఆవేశంగా గతాన్ని గుర్తు చేస్తూ అన్నాడు ప్రొఫెసర్ సత్యనారాయణ.

అలా 1969–72 మధ్య జరిగిన జై తెలంగాణ, జై ఆంధ్ర ఉద్యమాల గురించి, వాటి పరిణామాల గురించి అనేక విషయాలు చర్చించుకున్నారు. వాటి వైఫల్యం గురించి అనేక విధాలుగా వ్యాఖ్యానించారు. ఆ తర్వాత ఎందుకు ఉద్యమం ముందుకు రాలేదో ఆశ్చర్యపోయారు.

"కేంద్రంలో ఇందిరాగాంధీ ప్రభుత్వంపై జయప్రకాష్ నారాయణ్ ప్రారంభించిన ఉద్యమం ఉవ్వెత్తున లేవడం, ఇందిరాగాంధీ ఎన్నిక చెల్లదని రాజ్‌నారాయణ్ వేసిన కేసుపై 1975లో కోర్టు తీర్పుతో ఇందిరాగాంధీ ఎన్నికను రద్దు చేయడం, దాంతో ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించడంతో పరిస్థితులన్నీ మారిపోయాయి." అంటూ ప్రొఫెసర్ లక్ష్మీపతి గుర్తు చేశాడు.

"ఎమర్జెన్సీ తర్వాత ప్రభుత్వాలు మారినా తెలంగాణ రాష్ట్రం గురించి చర్చ రాలేదు. కాంగ్రెస్ అధిష్టానం రాష్ట్రంలో ఐదేళ్లలో మర్రి చెన్నారెడ్డి, టంగుటూరి అంజయ్య వంటి ముఖ్యమంత్రులను అవమానించడం, మార్చడంతో 1982లో ఎన్.టి.రామారావు, నాదెండ్ల భాస్కరరావు తెలుగు వారి ఆత్మగౌరవం నినాదంతో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి అన్నింటినీ మరిపించిన్రు, మాయ చేసిన్రు"

అలా ఎక్కడో ప్రారంభమైన చర్చ ఎక్కడికో దారితీసింది. స్థానిక అభివృద్ధికి ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు, నిరుద్యోగ సమస్య పరిష్కారానికి, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి, విద్యాభివృద్ధికి, తెలంగాణ భాష, సంస్కృతి అభివృద్ధికి, అన్ని సమస్యల పరిష్కారానికి తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు ఒక్కటే పరిష్కారం. అందుకు ఉద్యమించడం నేటి అవసరం అని ఏకాభిప్రాయానికి వచ్చారు.

"మన ప్రాంతం వెనుకబడి పోవడానికి కారణం వనరుల లోపం కాదు. మన ప్రాంతంలో ఉన్నన్ని సహజ వనరులు మరో ప్రాంతంలో లేవు. మనకు నాయకత్వ లోపమే ప్రధాన సమస్య. ఉన్నత లక్ష్యాలుగానీ, ఒక సమగ్రమైన విజన్‌గానీ మన వాళ్లలో లేకపోవడం అసలు సమస్య.

వ్యక్తిగత ప్రయోజనాలకు పరిమితమై మంత్రి పదవి ఇవ్వగానే అదే గొప్ప అన్నట్టు మన ప్రాంత అభివృద్ధిని మర్చి వాళ్లు చెప్పినదానికల్లా తల ఊపుతూ శాంక్షన్‌లు చేస్తున్నరు. అలా చేయకపోతే మంత్రి పదవి ఊడు తుందని, వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ కూడా రాదని భయం. ఈ భయంతో కూడుకున్న సైకాలజీ మారాలె. మన నాయకుల మైండ్‌సెట్ మారితేనే మన ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. తీసుకునే స్వభావమే తప్ప మన నాయకులు ఇతరులకు ఇచ్చే స్వభావం రాలేదు. ఇతరులను ఆశ్రయించి బతకడం వల్ల ఈ దుస్థితి ఏర్పడుతున్నది. మనకు జ్ఞానాన్ని ఇచ్చే స్వభావం అబ్బింది. కానీ దానాన్ని ఇచ్చే స్వభావం అబ్బలేదు. దండగలు మాత్రం పెడతారు. లంచాలు మాత్రం ఇస్తారు.

అసలు మీకో రహస్యం తెలుసా! సబ్సిడీలన్నీ ప్రజలను తీసుకొనే స్వభావంలోకి మార్చుతున్నయి. ప్రభుత్వంపై ఆధారపడే డిపెండెంట్ సైకాలజీకి దిగజారుస్తున్నయి."

"నిజమే సార్! ప్రభుత్వం మీద ఆధారపడేటట్టు చేసి అందరినీ బిచ్చగాళ్ళుగా ఎదిరిచూసేటట్టు చేస్తున్నరు. నేను ఇంత చదువుకొని కూడా ఉద్యోగం కోసం ఎదురు చూడాల్సి వస్తున్నది కదా!" అన్నాడు అరుణ్.

"నీ సమస్యకు కారణం అది కాదు. ఆంధ్రావాళ్ళు మన తెలంగాణలో మన ఉద్యోగాలన్నీ ఇప్పటికే ఆక్రమించి నిండిపోయిన్రు. వాళ్ళు రిటైరైనాక కూడా మీకు వచ్చేటట్టు లేవు. వాళ్ళ పిల్లలే లోకల్ అయిపోతరు. యిచ్చేది వాళ్ళే... మళ్లా వాళ్ళ పిల్లలకే ఉద్యోగాలు యిచ్చుకుంటరు. తెలుగుదేశం పార్టీ వచ్చిన తర్వాత తెలంగాణ ఇంకా సర్వనాశనం అయిపోయింది" అంటూ కొత్తకోణం ఏదో చెప్తున్నట్టుగా వివరించాడు ప్రొఫెసర్ లక్ష్మీపతి.

×××

ఉస్మానియా క్యాంపస్ మెయిన్ బిల్డింగ్ రూం నెం. 57 హాల్లో ఏదో సదస్సు జరుగుతోంది. సృజన, దీప్తి, అరుణ్‌లు పరస్పరం పలకరించు కున్నారు. హాయ్ అన్నయ్యా! అనే పలకరింపు విన్నవాళ్ళు కొందరు లోలోపల నవ్వుకున్నారు. సదస్సు అయిపోయాక బయటకు వస్తూ అవే విషయాలపై చర్చించుకుం టున్నారు గుంపుగుంపులుగా.

"నాకు ఓల్గా రాసిన 'స్వేచ్ఛ' చాలా నచ్చింది. స్త్రీల సమస్యలను చక్కగా చిత్రించింది. మాకేం కావాలో, మేం ఏం కోల్పోతున్నామో ఆ నవల చదివిన తర్వాత బాగా అర్థమైంది" అంది సృజన.

"నాకైతే వరంగల్ నవీన్ రాసిన 'అంపశయ్య' నవల బాగా నచ్చింది. అది చదివిన తర్వాత ఎట్లైనా చేసి ఉస్మానియా క్యాంపస్‌లో పీజీ చేయాలని పించిందే" అంది దీప్తి.

"అది మగవాళ్ళ దృక్పథం. నాకైతే పెద్దగా నచ్చలేదు. నాకు 'స్వేచ్ఛ' నవలనే చాలా బాగా అనిపించింది. ఆ రోజు ప్రెస్ క్లబ్‌లో మీటింగ్ తర్వాత మనం ఎంత చర్చించినా నాకు అదే నచ్చింది" అంది సృజన.

"నాకు 'బతుకుపోరు' నవల బాగా నచ్చింది. మా అమ్మ గురించే రాసినట్టు అనిపించింది" అన్నాడు విజయ్.

"మనకు ఒక్కోసారి ఒకటి నచ్చుతుంది. ఆ తర్వాత మన స్థితి మారిన తర్వాత నచ్చ

గజళ్ళ గానం మధ్యలో 'వరాళి' ఆవిష్కరణ

ఆదివారం 19న సాయంత్రం తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో రాజావాసిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుమధుర, ప్రశాంత వాతావరణంలో... రాజా వాసిరెడ్డి మల్లీశ్వరి గజల్ పుస్తకావిష్కరణ...మల్లీశ్వరి రచించిన గజళ్ళను శ్రీమతి లక్ష్మీ భవాని, శ్రీమతి రుక్మిణి, తలారి ఆనంద్, మధురమైన స్వరాలతో ఆలాపన చేసి సభాసదులని మైమరపింపచేశారు.

ఈ కార్యక్రమానికి అధ్యక్షులుగా కవి, సినీ గేయ రచయిత, సీనియర్ జర్నలిస్ట్ ఎన్జీవోస్ నెట్ వర్క్ అధ్యక్షులు, నవ్యాంధ్ర రచయితల సంఘం అధ్యక్షులు బిక్కి కృష్ణ అధ్యక్షత వహించారు. ఎస్.వి.యు. పూర్వ ఉపకులపతి, మూర్తిదేవి, కేంద్రసాహిత్య అకాడమీ అవార్డుల గ్రహీత, సుప్రసిద్ధ సాహితీవేత్త కొలకలూరి ఇనాక్ ముఖ్య అతిథిగా పాల్గొని రాజావాసిరెడ్డి మల్లీశ్వరి నాల్గవ గజల్స్ పుస్తకం 'వరాళి'ని ఆవిష్కరించారు.

రాజా వాసిరెడ్డి మల్లీశ్వరి రచించిన 'వరాళి' గ్రంథావిష్కరణలో కళాతాటికొండ, బైస దేవదాసు, బిక్కికృష్ణ, రాజావాసిరెడ్డి మల్లీశ్వరి, ఆవిష్కర్త కొలకలూరి ఇనాక్, సూరారం శంకర్.

కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ రాజావాసిరెడ్డి మల్లీశ్వరి భాష మీద పట్టున్నమనిషి, పరిశోధన చేసిన మనిషి. మాటలు చాలా ఆత్మీయంగా వాడుకుంటారు. ఆవిడ ముందుగా వ్యాసాలు రాయడం, కవితలు రాయడం చూశాం. గజల్స్ కూడా రాస్తున్నారు. ఇక్కడ చాలా సున్నితమైన పదాలు వాడుతున్నారు. చాలా సుకుమారంగా రచన చేయడం ఆవిడకి బాగా వచ్చింది. మల్లీశ్వరి గజళ్ళలో ఆమె సున్నిత మైన మనస్సు కనిపిస్తోంది. చిన్న ఆడపిల్లల మనస్థితిని నింపుకుని రాస్తోంది. అది చాలా గొప్ప విషయమని మల్లీశ్వరిని అభినందించారు.

సభాధ్యక్షులు బిక్కి కృష్ణ మాట్లాడుతూ.. మల్లీశ్వరిగారి గజల్స్ లో నాకే అర్థం కాని చాలా పదాలున్నాయి. ఆమె కొత్తపదాలు చదువరికి పరిచయం చేస్తారు. ఆమె గజళ్ళలో భావనాబలం కవితాత్మ ఎక్కువగా వుంది. అంతేకాకుండా స్వయంగా గజల్స్ పాడగలరు. సినారెగారు తన గజళ్ళని గానం చేసి క్యాసెట్లుగా విడుదల చేశారు. అలాగే మల్లీశ్వరి తన గజళ్ళని తానే పాడి జి.కె.తెలుగు టాకీస్ ద్వారా అందరికీ అందుబాటులోకి తెచ్చారు అని అన్నారు. గజల్ చరిత్ర గురించి , వరాళి రాగం గురించి వివరించారు. గజల్లో వాడే భాష సున్నితమైన భాష, చమత్కారం, ధ్వని వుండాలి అన్నారు. ఒక అద్భుతమైన అభివ్యక్తితో గొప్ప గజల్స్ రాస్తున్న వారిలో ఒకరు రాజా వాసిరెడ్డి మల్లీశ్వరిగారనే నిస్సంకోచంగా చెప్తున్నాను. ఆమె ఒక ఉపాధ్యాయురాలిగా గజల్స్‌లో ఆవిడ క్రమ శిక్షణ కనిపిస్తుంది. అనవసరమైన పదాలు, లేకుండా భావాలను తనదైన వాణిలో బాణిలో వెల్లడించడం తన ప్రత్యేకత అని కొనియాడారు.

చాలా చక్కగా, నూటిగా భావయుక్తంగా వరాళి పుస్తకాన్ని డా॥రాధా కుసుమ సమీక్షించారు – నాల్గవ గజళ్ళ సంపుటి తెచ్చిన గజల్ కవయిత్రి మల్లీశ్వరి ఎవరూ పెట్టని వరాళి అనే పేరు పెట్టారని. అది సంగీత రాగాలలో ఒక రాగం పేరని. ఈ వరాళికి మాధవ్ గారు గీసిన చిత్రాలు చూస్తే ఎప్పుడు చదువుదామా అని అనిపిస్తుందని, అనుకరణకు, అనుసరణకి అలవికాని గజళ్ళ రాజా వాసిరెడ్డి మల్లీశ్వరిగారివని, అన్నారు ."వేకువ లాగా... వస్తావా.... వెన్నెలలాగా వస్తా వా..." ఎంత హృదయరంజకమో కదా... అలతి అలతి పదాలతో ఎంత అద్భుతమైనదో ..భావ విన్యాసం, పదలా లిత్యంతో వరాళి అనే రనరమ్య గానం ఆనందపారవశ్యంలో మనలను ముంచెత్తు తుందని, ఈ వరాళి వాస్తవికతకు దర్పణం పట్టి మమకార మధురిమలని అందిస్తూ.... అందచందాలతో అక్షర నాట్యం చేస్తుందని. ప్రేమలోని భిన్న భావనలను ఎత్తి చూపారని అన్నారు. "పారేటి ఏరు కదలి వైపు సాగినట్లే.... నీ ప్రేమ ప్రవాహిని నీవైపుకే సాగుతున్నట్లుంది" అంటూ సాగే వరాళి మనసును మురిపించే ముంచే వలపు తలపుల వాకే, గజల్ గానం చేస్తూ.... 'వరాళి' నుంచే నేను ఒక గజల్ ను పాడుతున్నాను అని – "రెప్పచాటు కలనైనే కరిగానిలా.... నీకోసం చూపు చాటు చెకిలి నౌతు వెలిశా.... నిలా.... నీకోసం" అనే గజల్ ను పాడారు. వీరి ఆలాపన సభికులని మైమరపింప చేసింది. ప్రముఖ గజల్ కవి సూరారం శంకర్ మాట్లాడుతూ – మల్లీశ్వరి సుప్రసిద్ధ గజల్ కవయిత్రి అని సభాధ్యక్షులు బిక్కి కృష్ణ ఏ కార్యక్రమం చేసినా గుండెల్లో గుర్తుండిపోయేలా నిర్వహిస్తారని అన్నారు. వరాళి ఒక రాగం పేరు. 39వ రాగం అని అంటారు. ఆనందమూ విషాదమూ రెండూ సమ్మిళతం చేయగలిగిన రాగం. విఫల ప్రేమ, సఫల ప్రేమ ... వరాళి గజళ్ళలో ఆ రెండింటి సమ్మేళనం గమనించగలం. తనే రాగమయి.

రాజావాసిరెడ్డి మల్లీశ్వరిని సత్కరిస్తున్న అతిథులు

మల్లెల మైకమే.... వెలుగు వెన్నెల వంటి మధువంపటం మల్లీశ్వరిగారికే చెల్లింది అన్నారు. సుందర పద ప్రయోగాల, పద.. భావ చిత్రాలతో ఉన్న గజళ్ళను చదవటం చాలా అద్భుతం అన్నారు. గగనమంత భావాన్ని రాజావాసిరెడ్డి మల్లీ శ్వరిగారు తన గజళ్ళలో పొందుపరిచారని తెలిపారు.

నెల్లూరు నుంచి వచ్చిన లక్ష్మీ భవాని జి.కె.తెలుగు టాకీస్ ద్వారా 30 గజళ్ళను తనే పాడి యూట్యూబ్ లో అప్ లోడ్ చేశారు. ఇది సామాన్యమైన విషయం కాదు. తన రచనలు పాడుకునే వాళ్ళని ఏమంటారు...?. అంటూ సభికులలో ప్రశ్నను లేవనెత్తారు. మల్లీశ్వరిగారిని వాగ్గేయకారిణి అనాలి. మల్లీశ్వరి కంఠ స్వరం భానుమతి కంఠంలాగా వుంటుంది.

సభలో ప్రసంగిస్తున్న కొలకలూరి ఇనాక్. వేదికపై కళాతాటికొండ, బైస దేవదాసు, రాజావారెడ్డి మల్లీశ్వరి, బిక్కి కృష్ణ.

మత్తు గొలుపుతావుగా...." అంటూ రుక్మిణి పాడిన గజల్ నిజంగా చాలా అద్భుతంగా వుంది. అందరిని ఆనంద పరిచింది..

నేటి నిజం దినపత్రిక సంపాదకులు బైసా దేవదాస్ మాట్లాడుతూ..... ఇప్పుడు రెండు రాగాలు విన్నాం. ప్రసంగాల కంటే రాగాలే గొప్పగవున్నాయి. అక్షరం మన గుండెని తాకాలి. ఇనాక్ గారు చాలా గొప్పగా రచనలు చేశారు. వారి రచనలో సామాజిన్స్పృహ చాలా గొప్పగా వుంటుంది. కథ మొదలు పెడితే కథ ఆసాంతం చదవాల్సిందే. మల్లీశ్వరి గజల్స్ కూడా ఆ స్థాయిలో వున్నాయని ప్రశంసించారు. వరాళి నిండా ప్రేమ వుంది. రుక్మిణి, లక్ష్మీ భవానిలు తమ గానంతో గజళ్ళు పాడి అందర్ని ఆనందింపజేశారు. మల్లీశ్వరిలో ఆ అద్భుతమైన మనోభావాలు లేకపోతే రాయలేరు. "విలువలు వలుచుకున్న మనిషికి వందనాలు ఏలో?."అనే టు వంటి గజళ్ళను ఉదహరిస్తూసాహిత్యంలో తను ఎదుగుతున్న తీరు తను చేస్తున్న కృషి చాలా ప్రశంశనీయం అని వారి రచనలో అర్థం కాని పదాలు కూడా కనిపిస్తాయని వరాళి గురించి రాసిన పదాలు "రసానందం మొలుకు సుశబ్ద రవాళి....". – అంటూ మల్లీశ్వరిని అభినందించారు.

అద్భుతమైన గజల్ గాయకుడు, గజల్ గాన కళాసేవకుడు తలారి ఆనంద్ మురళీ వాయిస్తూ... బ్యాగ్రౌండ్ మ్యూజిక్ తో....."నను నీవు పిలుపు పిలవకపోనాకు మాత్రం పిలుపున్నట్టే వుంటుంది.నను నీవు వలచావొ లేదో...నాకు మాత్రం వలపునట్టే వుంటుంది. .....నాకు నీ చిరునవ్వులలో అర్థాలెన్నో తోస్తున్నట్టే వుంటుంది ? అంటూ మల్లీశ్వరిగారి గజల్ ని చాలా అద్భుతంగా గానం చేశారు.

గజల్ కవయిత్రి శశిబాల మాట్లాడుతూ – మల్లీశ్వరి మంచి భావుకురాలు, గొప్ప పదప్రయోగాలతో గజల్స్ ని అత్యద్భుతంగా రాస్తున్నారని అన్నారు.

చివరగా వరాళి గజల్ పుస్తక రచయిత్రి, ప్రముఖ కవయిత్రి, భాషావేత్త, సాహితీ వేత్త రాజా వాసిరెడ్డి మల్లీశ్వరి మాట్లాడుతూ –. "మీరు గేయాలు రాస్తారు కదా గజల్స్ ఎందుకు రాయకూడదు" అని బిక్కికృష్ణగారు తనను గజల్ రచనకు ప్రోత్సహించారన్నారు. గజళ్ళు రాయడం మొదలు పెట్టాను. తన రచనలో వచ్చే కఠిన పదాలు ప్రసక్తి కి ..నేను రాసేసటప్పుడు భావాలకి తగినట్లు వచ్చేపదాలు అలాగే వుంటాయి. నా రచనా శైలి అంతే నేను నా శైలిని పోలి ప్రయోగాలను మార్చుకో లేను" అని వివరించారు.వేదికనలంకరించిన వారికి, సభకు వచ్చిన గజల్ ప్రేమికులందరికీ మల్లీశ్వరి ధన్యవాదాలు తెలియజేశారు.

–స్వేచ్ఛ

'వరాళి'లోని గజళ్ళను గానం చేస్తున్న శ్రీమతి రుక్మిణి, శ్రీమతి లక్ష్మీ భవాని, తలారి ఆనంద్. పుస్తక సమీక్ష చేస్తున్న డా॥ రాధా కుసుమ. అధ్యక్షోపన్యాసం చేస్తున్న బిక్కి కృష్ణ

బలం వున్నవాణ్ణి కోసం..!

కత్తుల అంచుల్ని పదను పెడుతున్న
కొత్త వాక్యం ఎందుకు పురుడు పోసుకుంటుంది!
రక్తనదులలో చేతులు పులుముకోని
సూర్యుణ్ణి ముక్కలు ముక్కలుగా భూమి మీద
విత్తనాల పలె,
ఎందుకు విసురుతున్నట్లు!
దేశం వంటి మీద రెపరెపలాడుతున్న జాతిజెండా
గర్భ శిశువు శవయాత్ర దుఃఖ అల' అలా ఎందుకు
పెద్ద గీత అవుతుంది!
ఇన్నెళ్లు నడిచి వచ్చి తరువాత
సమాధులను తవ్వుకుంటూ
కొత్త స్మశానంకు అక్షర బీజం వేసుకుంటున్నామా!
మొన్నటికి మొన్న 'మత కుల బలి' మీద
అశ్రిన ఉమ్మేసిన తడి తుంపరల ఛాయచిత్రం
ఎక్కడో తెగిపోయిన సమూహ నిర్జీవ ముఖానికి
వ్రేలాడుతూనే వుంది కదా!
విశ్వం మీద పిడికిలి శిఖరం చేసిన
నిఖిత్‌జరిన్ వంటికి చుట్టుకున్నది, విజయమా
ప్రాంతీయమా! మతమా! ప్రశ్న ప్రశ్నార్థకంగా
చరితకు ఏమి ఇద్దాం!
భయాలు బంతులుగా ఎగరవేసే రాజాకేళీ చదరంగం
వ్యూహానికి మనిషి ఎర కావలిసిందేనా!
తరాల తలరాతలను వెంటాడుతూ..
వేటాడుతున్న
మర్మ కీలుగుర్రాల అధిపత్య గాలుల తుపాన్ వీచికలు
ప్రజ్వలింపవలసిందేనా!
మళ్ళీ తవ్వకాలు.. జ్ఞాన వాసిలోంచి,కొత్తగా
తాజ్‌మహల్ తవ్వుకుందామా!
మూడు వేల ఆరువందల తవ్వకాల శ్రీకారం మాట
రాజ్యంగం సాక్షిగా అక్షర పూజ చేసుకున్నం కదా!
అవును.. ప్రేమ, జ్ఞాపకాలు, తుడిచివేసుకుంటేనే
రేపు కత్తికొనమీద
రాజ్యం వికటహాసం దృశ్యాంత్రం అవుతుంది–
మాసిపోయిన ప్రజాస్వామ్యం, లౌకిక చీరలు
కొత్తగా మార్చుకోవలసిందేమో!
×××
ఏమోరా బాయి, హెూటల్లో చాయ్ త్రాగుదాం
అనుకున్న.. దోస్తును కలవాలి అనుకున్న.. మనస్సు
విప్పి మాట్లాడాలి అనుకున్న.. పొయెం రాయాలి
అనుకున్న.. భయం నీడవుతుంది
ప్రశ్నల మర్రి ఊడలు,
ఎదో కొత్తరోగంలా కలవరపెడుతున్నయ్
రెప్పల మీద ఆధునిక నిప్పులవాన
కునుకు లేదు
చలనం.. హృదయం.. గమనం..
ఏదీలేని గానుగ
బతుకుల సమూహంలో
ఒకనిగా కుందేలు బొమ్మకు
కొమ్ములు గీసుకుంటూ
తరుముతున్న కాలం అగ్ని పరీక్షల తవ్వుకాల
తొవ్వలో, శవమో.. రాయో
రక్త వర్షంలో రేపు..
బలంవున్న వాణ్ని కోసం.. ఒక టార్చి లైట్
సహయంతో...

– జనజ్వాల
సెల్: 9949163770

సందేశాత్మకమైన "జయభేరి"

పుస్తక సమీక్ష

అడిగోపుల వెంకటరత్నమ్ అంటేనే అక్షరాల పొందిక. నిర్దిష్టమైన క్రమంలో, నిర్ణీతమైన వాక్యాలను పొందుపరుస్తూ రచించే వీరి ప్రతి కవిత ఒక వర్ణచిత్రంలా కనిపిస్తుంది. చాలా చోట్ల పత్రికలలో వీరి కవితను యథాతథంగా ప్రచురించడం మనలో చాలామంది గమనించే ఉంటాం. అక్షరాలతోనే తన ఉనికిని తెలిపే ఏకైక కవి వెంకటరత్నమ్ గారు. వీరిప్పుడు రచించిన సంపుటి పేరు "జయభేరి". ఇందులో 57 కవితలున్నాయి. కుప్పం, ద్రావిడ యూనివర్సిటీ కి సంబంధించిన ఆచార్య బి. తిరుపతిరావు గారి కూలంకుషమైన ముందుమాటతో మొదలైన ఈ సంపుటిలోని కవిత్వాన్ని తరచి చూద్దాం...



దాదాపు నాలుగు దశాబ్దాలుగా సమయాన్ని అనుసరిస్తూ, ఏ సందర్భాన్ని వదిలిపెట్టకుండా నిరంతరంగా రచించే కవి వీరు. సమాజంలో జరుగుతున్న ప్రతి అంశం నుండి, సాటి వ్యక్తి బాధపడిన విషయం వరకు ఏదీ వదలలేదనేది వాస్తవం. ఏదో రాయాలి అని రాయకుండా, ఏదయినా రాయాల్సిందే అనుకునే కవులు వెంకటరత్నమ్ గారు. వర్షపడినా, ఎండ కాసినా, చలి వేసినా , గాలి వీచినా ఏమాత్రం తొణకని మనసుతో మనం ఉండిపోతాం. ఎందుకంటే వాటికి ప్రత్యామ్నాయ విధానాలు మన ఇంట్లో ఉన్నాయి కనుక. తలుపులు వేయడం, తలుపలు తీయడమే అందుకు సమాధానం. కానీ నిత్యం వాతావరణాన్ని గమనిస్తూ, దాని హావభావాలపై తన జీవితాలను ఆరవేసే జీవి ఒక్క రైతు మాత్రమే. ఆ విషయాన్ని తెలుపుతూ రచించిన కవిత "చేతులు మొక్కుతాయి" ఈ కవితలో రైతు జీవన చిత్రాన్ని మనముందుంచుతారు ఈ కవి. "కరిమబ్బులు పరుగులు తీస్తూ కమ్ముకుంటే/ జనారణ్యంలో పులులు ఎదురైనంత భయం/ వర్షం నెయ్యమై పదును పదునుగా కురిస్తే / చేతులు మొక్కుతాయి/ వర్షం తుఫానైతే అగ్నిపర్వతం బద్దలై / లావా పారిన భీతి" అంటూ మొదలెట్టి "ఆరబెట్టిన పొగాకును చుట్టలు చుట్టి వర్షం తాగుతుంది/ వొళ్ళార బెట్టుకుంటున్న / పండుమిరప పాయలు/ నిత్యావసరాల సరుకులా/ నీరు మోసుకుపోతుంది" అంటూ వర్షబీభత్సానికి రైతు పడుతున్న వేదనను కళ్ళకు కట్టినట్లు రచించిన తీరు ఎంతో చక్కగా సాగింది.

ఒక్కోసారి అమితానందం కూడా కవిత్వాక్షరాలై అలరిస్తాయి అంటూ రచించిన కవిత "పదవే వయ్యారి గాలిపటమా" రచించారు. ఉదయం నుండి సాయంత్రం పొద్దుపోయేదాకా ఆడి ఆడి చివరకు గాలిపటం కనుమరుగయ్యాక ఒక బాలుడు, ఆ బాలుడి తల్లి హావభావాల్ని ఎంత చక్కగా వొలికించారో ఈ కవి గమనించండి "అంతవరకు ఆనంద దోలికల్లో మునిగిన బాలుడు/ కనురెప్పల్ని తడిపిన కన్నీటిని తుడుచుకుంటూ/ వొణికే పెదవుల్ని బిగబెట్టి ఇంటిముఖం పడతాడు/ బిడ్డ దిగులు ముఖం చూసిన తల్లి / గుండెలకు హత్తుకుకుని ఉపశమనం పలుకుతుంది" అనడం ఒక్కసారిగా మనల్ని మనం చూసుకున్నట్లుగా అనిపించింది. బహుశా దృశ్యమానం అంటే ఇదేనేమో అనిపించేలా ఉంది.

మరోచోట సృష్టికి కథానాయకుల్ని వెదికి పట్టుకుని మనకు అందిస్తారు గమనించండి " నక్షత్రాల గురించి/ఉరుములు మెరుపులు గురించి/ మేఘాల్ని గురించి/ రాసిన వాళ్ళున్నారు. మొత్తం ఆకాశాన్ని /కవిత్వీకరించిన వాళ్ళు లేరు/ఎందుకు? చంద్రుడున్నాడుగా/ / నదులు, సూర్యుడు, నిశ్శబ్దం, భూమి వంటి వాటిని కూడా నాయకులుగా గుర్తించి రాయడం ఎంతో ఆశక్తికరంగా ఉంది.

తర్వాత శీర్షిక "జయబేరి" అనే కవితను గమనిస్తే ప్రజలను, రాజకీయ నాయకులను పోల్చుతూ రచించిన తీరును గమనిస్తే "యుగయుగాలుగా ప్రజల/ కన్నీరు ఇంకిన మట్టి/ తరతరాలుగా/ రక్తంలో తడిసి/ తరతరాలుగా/ రక్తంలో తడిసి/ శాంతిని శ్వాసించి, హింసను రుచి చూసిన మట్టే/ మృదువైనది/ మనసైనది" అంటారు.

"ఎవరూ ఎగరేయని పావురం/ ఎవరూ ఆశించనిపావురం/ ఎవరూ ఊహించని పావురం/ సభాప్రాంగణంలో వాలి/ ఆహారం ఏరుకుంటూంది" ఎంత అద్భుతం? కదా అనిపించక మానదు. పోలిక అనేది కవిత్వంలో ఎంతో అవసరం.. అదీ కవిత్వీకరణించినట్లుంటే మరింత మాధుర్యాన్ని అందిస్తుంది. అదే వీరు రచించిన "నువ్వు ఉదయించాలి" అనే కవితలో రచించారు.

అలాగే ఉద్యమం మరణించదు, దుఃఖపట్టిక, నడుస్తున్న చరిత్ర, ఏ శిల్పానికి ఏ రాయి అర్హమో, క్షేత్రజీవి, సరికొత్త గణితం, నిశ్శబ్దమూ నేరమే, కథ కంచికి చేరదు వంటి కవిత్వాలలో కవిత్వమే కాదు. సమాజం పట్ల బాధ్యతను కూడా ఎలుగెత్తి చాటడం విశేషం. వీరి ప్రతి కవిత సందేశాత్మకమే. ప్రతి భావం సందర్భనాత్మకమే.. ఇంత చక్కని కవితా సంపుటిని వెలువరించడం , తెలుగు సాహితీవేత్తలకు ఒక విధంగా పండగే.. మరిన్ని కవితలు మనముందుకు రావాలని కోరుకుంటూ అభినందనలు..

ప్రతులకు:
అడిగోపుల వెంకటరత్నమ్
కావేరి రెసిడెన్సీ, ఔరబిందో మార్గ్
ఎన్‌జిఓ కాలనీ, తిరుపతి–517 508
ఫోన్: 98482 52946

–శైలజామిత్ర
9290900879

సినారే సాహితీ విజ్ఞాన సర్వస్వం

–వేములవాడ ఎమ్మెల్యే డా. చెన్నమనేని రమేష్ బాబు

జ్ఞానపీఠ అవార్డు గ్రహీత. ప్రముఖ కవి డాక్టర్ సి.నారాయణరెడ్డి సాహితీ విజ్ఞాన సర్వస్వమని, హైదరాబాద్ తెలంగాణా సారస్వత పరిషత్తుకు 25 ఏండ్ల పాటు అధ్యక్షుడిగా పనిచేసి, పరిషత్ అభివృద్ధికి, తెలుగు సాహిత్య అభ్యుదయానికి ఎనలేని కృషి చేశారని, పలు గ్రంథ రచనలు చేశారని, సినారె ఆశయసాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని వేములవాడ ఎమ్మెల్యే డా. చెన్నమనేని రమేష్ బాబు పిలుపు నిచ్చారు. 1969లో వేములవాడ రాజన్న గుడి త్యాగరాజ సంగీత ఆరాధనోత్సవాలకు ప్రముఖ సినీ నేపథ్య గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు గారు సినారే కోరికపై ఆహ్వానింపబడ్డారని, ఆ సభలో డా.సినారే వేములవాడను వెన్నెల వాడని, లలిత కళలకు నిలయమని ప్రశంసించారని , ఆ సభలో పాల్గొన్న నేను ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని సినారే స్ఫూర్తితో వేములవాడ దేవాలయ పట్టణ అభివృద్ధి ప్రణాళికలో సంగీత, నృత్య, వేద పాఠశాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించామని అన్నారు. డా. సినారె స్వగ్రామం వేములవాడ గ్రామీణ మండలం హనుమాజీపేట గ్రామం కావడం, తమ ప్రాంతానికి గర్వకారణంగా ఉందని అన్నారు. తెలంగాణా సారస్వత పరిషత్ వారు తమ నూతన రాజన్న సిరిసిల్లా జిల్లా సాహిత్యం, ఇతర రంగాలపై వివిధ రచయితలచే క్రోడీకరించి చరిత్రగా ఒక పుస్తకాన్ని ముద్రించడాన్ని పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులను అభినందించారు.



డా. సినారె వర్ధంతి 6వ కార్యక్రమాన్ని ఆదివారం రాజన్న సిరిసిల్లా జిల్లాలోని సినారే స్వస్థలమైన హన్మాజీపేటలో సినారే కూతుళ్ళ సహకారంతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సినారె నూతనంగా నిర్మించిన కవితా కర్పూర క్షేత్రంలో (సొంత ఇంటి ప్రాంగణంలో) తెలంగాణ సారస్వత పరిషత్తు వారు 37 మంది రాజన్న– సిరిసిల్లా జిల్లా రచయితలతో రూపొందించిన 4వందల పేజీల జిల్లా సమగ్ర స్వరూపం అనే గ్రంథాన్ని స్థానిక ఎమ్మెల్యే డా.రమేష్ బాబు, పరిషత్తు అధ్యక్ష, కార్యదర్శులు డా.ఎల్లూరి శివారెడ్డి, డా.జుర్రు చెన్నయ్య, కరీంనగర్ శాతవాహన విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య సంకశాల మల్లేశంలతో కలిపి లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డా. సినారె కవితా కర్పూర క్షేత్రం స్మారక స్తూపాల వద్ద పుష్పగుచ్చాలు ఉంచి నివాళులర్పించారు.

ఎమ్మెల్యే డా. రమేష్ బాబు మాట్లాడుతూ సినారే అంటే తెలుగు ప్రజలకు ఎనలేని గౌరవం అన్నారు. వేములవాడ పట్టణంలో పురాతన సినారె మందిరాన్ని తీసివేసి 10 కోట్లతో అన్ని హంగులతో నూతన ఏసీ ఆడిటోరియంగా ఆధునికరిస్తామని హామీ ఇచ్చారు. సినారే తో మా తండ్రి స్వర్గీయ మాజీ ఎమ్మెల్యే సి.హెచ్. రాజేశ్వరరావుకు విడదీయలేని అనుబంధం ఉందని గుర్తు చేశారు. వేములవాడ పట్టణంలోని అభివృద్ధిలో భాగంగా, బద్ది పోచమ్మ ఆలయం విస్తరణ కోసం ఒక ఎకరం భూమిని 20 కోట్ల రూపాయల నష్ట పరిహారం ఇచ్చి 46 మంది దాతలను లోటు పాట్లు లేకుండా ఒప్పించి వారి నుండి స్థల సేకరణ చేయడం ఒక చాలెంజీగా జరిగిందన్నారు. వేములవాడ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందించి పనులు మొదలు పెట్టినట్లు వివరించారు. సంపాదన కోస, పదవుల కోసం తాను రాజకీయాలలోకి రాలేదని, ప్రజాసేవనే తనకు ముఖ్యమని అన్నారు. నిధుల కొరత ఉన్నప్పటికినీ, సినారే జన్మస్థలి హన్మాజీపేట గ్రామంలో నక్క వాగుపై హై లెవెల్ బ్రిడ్జి, సమీప మామిడిపల్లి వాగుపై రెండు బ్రిడ్జిల నిర్మాణానికి, కృషి చేస్తామన్నారు. సినారే కర్పూర కవితా క్షేత్రాన్ని ఒక దర్శనీయ స్థలంగా సినారే కూతుర్లు తీర్చిదిద్దడం అద్భుతమని అన్నారు.

సినారే విగ్రహాన్ని హనుమాజీపేట బస్టాండ్ ప్రాంతంలో ఏర్పాటు చేయాలని గ్రామస్తుల తరపున సినారే బంధువు,జానపద గాయకుడు క్యాతం ఆదిరెడ్డి ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. తాను జర్మనీలో కొన్నాళ్ళు ఉన్నప్పటికీ ఈ ప్రాంత అభివృద్ధి కోసం కృషి కోసం పలు ప్రణాళికల రచన చేయడం జరిగిందన్నారు. కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీ ఉప కులపతి ఆచార్య సంకశాల మల్లేశం మాట్లాడుతూ తాను సినారె స్ఫూర్తితో ముందుకు సాగి ఈ స్థాయికి ఎదిగానని గుర్తు చేశారు. మా హన్మాజీపేట ముద్దు బిడ్డయిన డా. సినారే ను మేము ముద్దుగా బాపు అని పిల్చుకొంటామని, వేములవాడ రాజన్న గుడి ఆద్వర్యంలో కొనసాగుతున్న సంస్కృత కళాశాలలో సంస్కృత పిజి,బిఇడి కోర్సుల ప్రారంభానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సినారే బాపు, తాను పుట్టిన హనుమాజీపేట అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా గ్రంథ రచనలో పాలు పంచుకొన్న రచయితలు డా.జనపాల శంకరయ్య, డా.పత్తిపాక మోహన్, నంకేపల్లి నాగేంద్రశర్మ, పెద్దింటి అశోక్ కుమార్, కోడం పవన్ కుమార్, గెంట్యాల భూమేష్, డా.నమిలకొండ సునీత, జిందం అశోక్, డా.వాసరవేణి పరశురాం, డా.గోనె బాల్ రెడ్డి, చెన్నమనేని రాంచందర్ రావు, ఎలగొండ రవి, గ్రంథ కోర్ కమేటీ సమన్వయ కర్త గరిపల్లి అశోక్ తదితరులను ఎమ్మెల్యే పరిషత్తు తరపున శాలువాలు కప్పి, జ్ఞాపికలు ప్రదానం చేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జింకె విజయ శ్రీవివాసరెడ్డి మాట్లాడుతూ డా.సినారే గతంలో నిర్మించిన మూలవాగు కాజ్ వే పాతబడి పోయిందని, దీని స్థానంలో హైలెవల్ వంతెనను నిర్మించాలని ఎమ్మెల్యే గారిని కోరారు. తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి మాట్లాడుతూ హన్మాజీపేటలో మా సంస్థ అధ్యక్షుడిగా పనిచేసిన సినారే వర్ధంతిని జరుపుకోవడం, జిల్లా సాహిత్య, సాంస్కృతిక చరిత్ర అంశాలతో రూపొందించిన సమగ్ర గ్రంథాన్నిఆవిష్కరించుకోవడం వంటి రెండు కార్యక్రమాల కోసం ఈ బృహత్ కార్యక్రమాన్ని రాజకీయాలకతీతంగా ఏర్పాటు చేసినట్లు, విసి స్థాయి విద్యావేత్త అయిన డా.రమేష్ ఈ ప్రాంత ఎమ్మెల్యేగా ప్రజాభిమానంతో కొనసాగుతూ ఉండడం ఆనందంగా ఉందని అన్నారు. భారత దేశానికి గంగా నదితో సమానమైన ఉజ్జయిని ఆస్థాన వాసియైన కాళిదాస్ ఎంత గొప్ప కవో, తెలుగు రాష్ట్రాలను గోదావరి నది అంత పవిత్ర సాహిత్యాన్ని పండించి అంతటి ప్రాముఖ్యాన్ని సినారే నిలుపుకున్నారని ప్రశంసించారు.

సినారేది నల్గురు కూతుర్లున్న పెద్ద సామరస్య కుటుంబమని, వీరంతా కలిసి మెలిసి ఉండటం అపూర్వమని, ఈ విషయాన్ని ప్రముఖ రచయిత ఎంఎస్.రెడ్డి గారు ఎప్పుడూ ప్రస్తావిస్తూ ఉండేవారని అన్నారు. పరిషత్ కు 78 సంవత్సరాలు నిండాయని, త్వరరో 80 వ వార్షికోత్సవాలను నిర్వహించడానికి పరిషత్ కార్యదర్శి డా.జుర్రు చెన్నయ్య గారు అప్పుడే ప్రయత్నాలు ప్రారంభించారని అంటూ కార్యదర్శి గారి నిర్వహణా బాధ్యతను ప్రశంసించారు. డా.సినారే పరిషత్తు భవన నిర్మాణ స్థలం ప్రభుత్వం నుండి సేకరించడానికి ఎంత గానో కృషి చేశారని, 14 లక్షల రూపాయల మొత్తాన్ని డ్రగ్స్ సంస్థల అధిపతులు, వదాన్యులైన అంజిరెడ్డి, వరప్రసాదరెడ్డి ల నుండి విరాళంగా పొంది పరిషత్ మహోన్నత స్థాయిలో నిలబెట్టారని ప్రశంసించారు. సారస్వత పరిషత్ కార్యదర్శి డా.జుర్రు చెన్నయ్య గారు స్వాగతో పన్యాసం ఇస్తూ ఉభయ తెలుగు రాష్ట్రాలలో పరిషత్తు చేసిన సాహితీ సేవలు విలువైనవని, స్వర్గీయ గతంలో డా. సినారేతో సహా, ఆచార్య ఎల్లూరి శివారెడ్డిలు విసీలుగా పనిచేశారని, ప్రస్తుతా డా. సంకశాల మల్లేశంలు విసీగా ఉన్నారని, ఈ వేదికపై ముగ్గురు వీసీల కలయిక జరిగినట్లుగా భావించాలని చమత్కరించారు. తెలంగాణాలోని 33 జిల్లాలతో సమగ్ర స్వరూప గ్రంథాల ప్రాజెక్ట్ లో భాగంగా, ప్రస్తుతం మూడు జిల్లాల సమగ్ర గ్రంథాలు తెచ్చామని, మిగతా 30 గ్రంథాలు తయారీలో ఉన్నాయని చెప్పారు. తెలంగాణాలో ఒక ఆదర్శ దర్శనీయ పర్యాటక స్థలంగా సినారే హన్మాజీపేట జన్మభూమిని కవితా కర్పూర క్షేత్రంగా అభివృద్ధి చేయడానికి సినారే కూతుర్లు నిర్వహించిన పాత్ర గొప్పదని అన్నారు. సినారే జన్మస్థలిలో ఒక ఒపెన్ ఎ

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 557వ రోజు 'సంభాషణ' అనే అంశంపై పలువురుకవులు తమ కవితలను పంచుకున్నారు. 'సంభాషణ' అనే అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా...

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం ఏకాంశ కవిత్వం నిర్వహణ:
-డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్ రావు, 9441046839

కొత్త ముచ్చట్లు

మనలో మనం
లోకం కోసం మనం
జనం కోసం జగతి కోసం
ముచ్చటగా ముచ్చటించాలి
ఖచ్చితంగా చెప్పుకోవాలి.
కస్తూరి వాసనల నిజాయితీలకు
గండపెండేరం తొడగాలి
అశోక చక్రం రేఖలకు
భాష్యాలు చెప్పాలి
ఓ అక్షరమై నడవాలి
ఓ గొడుగై నడిపించాలి.
ఆప్యాయతలకు
ఆత్మీయతా ఆలింగనాలూ ఇవ్వాలి
మమతల పందిళ్ళలో దూపం వేయాలి
రంకు బొంకుల పెడపోకడలను
కట్టడి చేసి
ఖరాఖండిగా దండించాలి.
మంచికి పట్టం కట్టి
చెడుకు ఖైదు చేసి
సామాజిక శాంతి కి
బాటలు వేయాలి.
ఇప్పుడు కొత్తగా
కొన్ని ముచ్చట్లు మాట్లాడుకోవాలి
నేతల మధ్య యుద్ధాల పెడపోకడలు
జనం తలరాతలపై బాంబింగ్ చేస్తుంటే
తమ నేలపై తామే పరాయివారుగా
వలసెల్లిపోతుంటే
తలదాచుకున్న వారిపై
నిప్పుల వాన కురిపిస్తుంటే
బతికే పౌరనీతిపై
ఉన్మాద వికృత చేష్టలపై
ఖచ్చితంగా మాట్లాడుకోవాలి
శాంతి కోసం
సమర నినాదమై నిలబడాలి.
బతుకులన్నీ
రాకెట్లా దూసుకుపోతున్న ధరలతో
పెనం మీద నుండి పొయిలో పడుతుంటే
సామాన్యుడి గొంతుకై మాట్లాడుకుందాం.
పచ్చని ఆలోచనలతో
అయినవారి కష్టాల కన్నీళ్ళను
ధైర్యాన్ని నింపే ముచ్చట్లతో
దూరం చేస్తూ స్ఫూర్తి నింపాక
ఆ కళ్ళల్లో కాంతులు చూడాలి.
కొంటెనగాయి ముచ్చట్లు
గాలికంప కబుర్లు
ఎక్కిరేవుల
కొక్కిరింతల వలలకు చిక్కుకుంటే
కుడి ఎడమల చిక్కులే.
మనసు విరితోటలో
పరిమళాల ముచ్చట్లు పంచితేనే
పరవశం
సంతోషం
బతుకు పయనం.

-ఏడెల్లి రాములు

కలుపుగోలు

ముచ్చట్లు సాగాలి
మురిపాలు తేవాలి
కలుపుగోలుతనం కావాలి
సంఘీ భావం కుదరాలి
మనిషి మర్మం తెలువాలంటే
మమతలు విరబూయాలి
సమస్య పురాణం ఛేదించాలంటే
ప్రశ్నలు పదునెక్కాలి
మార్పు తేవాలంటే
కొత్త ఆవిష్కరణలు జరగాలి
కాలక్షేపం కాకూడదు ముచ్చట్లు
కాలానుగుణంగా సాగాలి

ముచ్చట్లు

ముగియని ముచ్చట్లు
స్నేహమున్నంతసేపు
తడబడే అడుగులప్పుడు
వచ్చిరాని భాష
స్వచ్ఛమైన భాషలో
అచ్చమైన హృదిభావనలు
వయసు లోగిలిలో ప్రేమికుల
వసివాడని పసిడి ముచ్చట్లు
గంటలు రోజులు వారాలు
పక్షాలు వారి పక్షంలోనే
యే మాట జారినా
మాట మారినా
అంతా గందరగోళం
మాటలన్నీ కలిసొస్తే
కళ్యాణందాకా కమనీయం
భాష ఒక్కటే
భావమెక్కటే
నూతనజంటలకు
భావం మారితే
బాధ్యతలు పెరుగునో తరుగునో
మహిళామణులు కూడితే
ఎడతెగని ముచ్చట్లు
యువకులు ఒకచోట కూడితే
బతుకుతెరువు ముచ్చట్లు
రాజకీయ నాయకులొకచోటుంటే
రాజకీయ ముచ్చట్లు
భక్తిభావంతో కలిసే భక్తులవి
ఆధ్యాత్మిక ముచ్చట్లు
రంగాలవారీగా
ముచ్చట్లే ముచ్చట్లు
శిశువునుండి ముదిమిదాకా
ఎడతెగని ముచ్చట్లు
భావమార్పిడి ఎంతో
భాష మార్పిడి ఎంతో
ప్రేరణలు ఎన్నో
ప్రేరకాలు ఎన్నెన్నో
నడకనూ నడతనూ
మార్చే ముచ్చట్లెన్నో!.

- లక్ష్మా రెడ్డి పసుల

తేడా!

అచ్చట్లు ముచ్చట్లు
చేతులు కలిసిన చప్పట్లు!
సంభాషణలో తేడాలు!
మనిషి మనిషికి భిన్న భావాలు!.
మూడు కొప్పులు
ఆరుజెళ్ల ముచ్చట్లు!
ఆవకాయ మొదలు అంతరిక్ష విహారం!
జీడిబంకలా సాగు!
ఎంత చెవికొరికినా
సశేషాల విశేషాలు!
ఎంతో కొంత మిగులు?
మస్త్ జబర్దస్త్ ఆద్యంతంలేని
ఆడవారి ముచ్చట్ల అర్థాలే వేరు!
అనర్థాల జోరు!
చాడీల కామెడీలు!
సన్నాయి నొక్కులు!
చెవిలో పూలు!
సిగపట్ల గోత్రాలు
మూడు-ముప్పై క్రాఫులముచ్చట్లు
సిగరెట్ రాజకీయాలతో మొదలు
పెరుగుతున్న ధరలు
పారే మద్యపుసీసాలు!
రచ్చబండ చర్చలు
గొర్రెకు బెత్తెడే తోకజీతాలు!
సంసారపు సాగర ఘోషలు.
చదువు జాబ్స్ మొదలు
సినీవిశేషాలు!
కామెంట్స్ తో నవ్వులు
ఉద్రేకంతో లడాయిలు
ఆవేశ కావేశాలు
నిరాశ నిస్పృహ లో
యువకుల గోస!.
బడిలోచిట్టి బుడతల కామెడీ
అభినయం!
ఫోన్ తో సంభాషణం!
వద్దంటే ఆరున్నొక్క రాగాలు!
"మామమ్మీతో చెప్తా"బెదిరింపు!
వయసు మళ్ళిన పండుటాకుల
నిరాశ నిస్పృహలు!
గతవైభవ ప్రాభవాలతో
నేటి ఈతిబాధలతో మింగలేక
కక్కలేక కుడితిలో ఎలుకలు
రోలు వెళ్లి మద్దెలతో మొరలు!
ముచ్చట్లు ముచ్చటగా తేలాలి
మూడు ముక్కల్లో!
సమయం ఆదాచేయాలి!
"నేనెవరిని?"రమణ మహర్షి
మాటలు మననం చేయాలి!
ప్రవచనాలతో కాలక్షేపం!
శాంతికి వానప్రస్థానానికి
దైవస్మరణకి కేటాయింపు
ముచ్చట్ల కి ముగింపు!.

-ఎ.రాజ్యశ్రీ

ఆనందం

మనిషి జీవితం ముచ్చట్లలో
ఆనంద సమ్మిళితం
మాటలు చెపుతూ
చక్కని హాస్య భరిత పదాలు చెపుతుంటే
మంచి మార్పు
ఉత్సాహం
ఆనందం
అపురూపంగా వెల్లి విరిసి
అద్భుత శోభ చేకూర్చే విధంగా
మనుషుల మధ్య ముచ్చట్లు.
ఎక్కువ పెళ్ళిళ్ళలో
వదిన ఆడబడుచుల మధ్య
ఈ ముచ్చట్ల ప్రహసనం
వేడుకతో కూడి
పదిమందిలో ఆసక్తి
మాటల నేర్పు ఓర్పు ముఖ్యం
పదాల్లో లౌక్యం
గడసరి తనం
వ్యంగ్యం
సొగసరి సంభాషణకు ప్రాణం
నలుగురు ఆడవాళ్ళు
కలిస్తే ఎన్నో ముచ్చట్లు

-నారుమంచి వాణీప్రభాకరి

ముచ్చట

తనువుకు ముచ్చటేయును పదార్థమునందు 'తను'న్నదేననన్?
మనసుకు నిశ్చయంబగును మాయను గెల్చిన ముచ్చటే తనౌ?
తనకు తనే ముచ్చట 'తను' తానుగ నేర్పుట నిత్య మైనచో?
కనగ కలేననిత్యమని కారణమే తన ముచ్చటౌ గదే?.

-రుద్రాక్షల మఠం ప్రభులింగశాస్త్రి

సృజనాత్మకం

సంభాషణ సృజనాత్మకం
అందమైనకళ
ఆహ్లాదం
హర్షణీయం
సరదా కబుర్ల మిళితం
వినేవారికి హాయి
వినసొంపు
ఎంతసేపు మాట్లాడామో కాదు
ఎదో ఒకటి మాట్లాడటమూ కాదు
ఏం మాట్లాడాం?
ఎందుకు మాట్లాడాం?
అవగాహనతో ఉండాలి సంభాషణ..
మాట్లాడే శక్తి
మనిషికి వరం
ఇద్దరి మధ్యో
ముగ్గురి మధ్యో
జరిగేది సంభాషణ
బంధాలు పెనవేసినా
బంధాల్ని తుంచి వేసినా
సంభాషణే కారణం
మంచి సంభాషణ
మనసుకి ఉద్దీపన
మనసుని పొంగించినా
మనసుని కుంగదీసినా
సంభాషణే కారణం
ఏది చెప్పినా
ఏదివిన్నా
శ్రద్ధగా చెయ్యాలి
అప్పుడే అది
మధుర సంభాషణ.

-మోటూరిశాంతకుమారి

ఎన్నోరూపములు

ఉ. ముచ్చటలెన్నోరూపములు మోదము ఖేదము
వాదభేదముల్
విచ్చిన మల్లెపూలగతి వెచ్చని కౌగిలులందు ప్రేమలున్
పచ్చని పాడిపంటలయి పల్లెల మానవ జాతి బంధముల్
నచ్చిన చోటు చూడగనె నాలుక నాట్య వయారి
భంగిమల్!!
సీ. గుసగుసల్ దింపెడు గుండెలోగునపాలు
గుడిసెలో కష్టాల గుప్తధనము
ఆడిపోసుకొనుచునమ్మలక్కలుజెప్పు
వేడివేడి విషపు చాడిలందు
నాత్మస్తుతుల్ పెక్కునాడు సంభాషణ
లత్తకోడండ్లలోనాడపడుచు
నాటకాల కథలు నమ్మించు మోసాల
పచ్చియబద్దాలు పాములెన్నో.
తే.గీ. ధరణి ముచ్చట్ల తోడనే తనివి పొందు
సరళి మారునుకాలమ్ము వరుస నెరిగి
స్థిరము కాదేది ప్రజలకు వరము కాదు
పరులకుపకారమైనచో ప్రగతి మిగులు!!.
సీ. పసిపాప సంజ్ఞతో మిసిమి ముచ్చటగొల్పు
ఉక్కునుంగను భాషలువిధజెప్పు
నాట పాటలలోన తోటి మిత్రుల పోటి
మాటలో పసపెంచు మర్మమగుచు
స్పర్ధతో విద్యలో శాస్త్రాల లోతుల
గోష్ఠిలో ముచ్చట తుష్టినిచ్చు
విషయ విశ్లేషణ వివిధాంశముల రీతి
మంచెచెడ్డవిమర్శ మనిషి చింత
సిద్ధాంతముల చర్చరాద్ధాంతమునుజేత
కొత్తయూహలయందు కొలువులందు
తే.గీ. జరుపు రసముల ధారలో సగుణచర్చ
ముచ్చట విచారమును జేయ మెచ్చపలుకు
కోవిదుల సదస్సులు పుట్టు గుర్తులందు
వేద వేదాంతధోరణుల్ విద్వదవని!!.

-మాడుగుల నారాయణ మూర్తి

కాలక్షేపం

ముచ్చటగా చేస్తారు మూడు
తినడం తిరగడం పడుకోవడం
కాలక్షేపానికి ముచ్చట్లు
గుసగుస ముచ్చట్లు
గుట్టు చప్పుడు
కాకుండా చేస్తారు
చాటు మాటు ముచ్చట్లు
ఉప్పసకు ముచ్చట్లు
ఊరడింపులకు ముచ్చట్లు
తీరొక్క ముచ్చటలు
తీర్చును కొందరి బాధలను
చిచ్చుపెట్టును కుటుంబాలలో
ముచ్చటతో ముప్పు రావద్దు
ముంగిట ముచ్చట్లు
మురిపాలను నింపాలి
యువతకు ఉద్దీపన కావాలి
ప్రగతికి ప్రతీకగా మారాలి
లోక కళ్యాణం జరగాలి.

- గుండం మోహన్ రెడ్డి

ఓలంపిక్ పతకాల పట్టికలో భారత్ వెనుకంజ..!

(23 జూన్ 'అంతర్జాతీయ ఓలంపిక్ దినం' సందర్భంగా)

23 జూన్ 1894న కెనడా, ఆస్ట్రియ, యుకె, బెల్జియమ్, గ్రీస్, పోర్చుగల్, స్విట్జర్లాండ్, ఉరూగ్వే, వెనెజులా అనబడే తొమ్మిది దేశాల నేషనల్ ఓలంపిక్ కమిటీ సారథ్యంలో అంతర్జాతీయ ఓలంపిక్ దినం నిర్వహించడం ప్రారంభించారు. వయసు, కులమతాలు, ప్రాంతాలు, లింగ భేదాలు లేకుండా క్రీడల పట్ల ఆసక్తిని, అభిరుచిని పెంపొందించే సదుద్దేశంతో ప్రతి ఏట 23 జూన్ రోజున ప్రపంచ దేశాలన్నీ ఓలంపిక్ దినం పాటించుట జరుగుతున్నది. ప్రతి ఒక్కరు క్రీడల ప్రాముఖ్యతను గ్రహించి శారీరక, మానసిక వికాసం కోసం దైనందిన జీవితంలో అవుట్ డోర్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ పట్ల ఆసక్తిని చూపాలి.

శారీరక చురుకుదనం, మానసిక ధృఢత్వం వేటలో క్రీడలకు కొంత చోటు ఇవ్వడం ద్వారా వ్యాధినిరోధకశక్తిని పోగుచేసుకోవాలి. అంతర్జాతీయ ఓలంపిక్ కమిటీ, ప్రపంచ ఆరోగ్య సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తూన్న అంతర్జాతీయ ఓలంపిక్ దినం-202 నినాదంగా 'ఓలంపిక్ క్రీడలతో ఆరోగ్యంగా, బలంగా, చురుకుగా ఉందాం' అంశాన్ని తీసుకొని 24-గంటల ఆన్‌లైన్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నది. క్రీడల ద్వారా అంతరిజాతీయ సమైక్యత, మానవాళి ఏకీకరణ, శారీరక క్రియాశీలత, మానసిక పటుత్వం సాధించే వేదికల్లో క్రీడలు అతి ముఖ్యమైనవని గమనించాలి. అంతర్జాతీయ ఆధునిక ఓలంపిక్ కమిటీ తొలి అధ్యక్షుడు 'చార్లెస్ పెరీ డి ఫ్రెడీ'ని నియమించబడడంతో ఆయనను 'ఆధునిక ఓలంపిక్ క్రీడల పితామహుడి'గా పిలుస్తున్నాం.

అంతర్జాతీయ క్రీడా సంబరంగా స్ఫూర్తిని కలిగించే ప్రయత్నంలో భాగంగా 23 జూన్ 1987 నుంచి 150 దేశాల జాతీయ ఓలంపిక్ కమిటీలకు చెందిన పురుష, మహిళ మరియు పిల్లల్ని ఒక చేటికి చేర్చే వేదికగా ప్రతి అట అంతర్జాతీయ ఓలంపిక్ దినం సందర్భంగా 'ఓలంరిక్ డే రన్' నిర్వహించుట ఆనవాయితీగా వస్తున్నది. అంతర్జాతీయ ఓలంపిక్ దినం వేదికగా క్రీడా, సాంస్కృతిక వేడుకలతో పాటుగా సెమినార్లు నిర్వహించుట జరుగుతుంది. ఓలంపిక్ డే నినాదాలుగా క్రియాశీలత (మువ్), నేర్చుకోవడం (లెర్న్), కనుగొనుట (డిస్కవరీ) అనబడే 3 ముఖ్య అంశాలు చేర్చబడ్డాయి.

'క్రియాశీలత'లో శారీరక పటుత్వం కలుగుతుంది. 'నేర్చుకోవడం' అనే అంశంలో మానవీయత, అంటువ్యాధుల కట్టడి, విద్య, మానవ అక్రమ రవాణ, మహిళా సాధికారత, ఆరోగ్య పరిరక్షణ, పర్యావరణ పరిరక్షణ, శాంతి స్థాపన, సమాజాభివృద్ధి, స్నేహ విస్తరణ, మానవాళిని గౌరవించడం అనే భావనలు అమిడి ఉంటాయి. 'కనుగొనడం' అనే అంశంలో భాగంగా క్రీడావ్యాప్తికి కంకణ బద్ధులు కావడం, లింగ వివక్షకు తావులేకుండా చూసుకోవడం, అన్ని వయస్సులు, వర్గాల వారిని ప్రోత్సహించడం లాంటి జాగ్రత్తలు తీసుకుంటారు. అమెరికాలో 60-65 శాతం (దాదాపు 160 మిలియన్లు) ప్రజలు స్థూలకాయ సమస్యలతో బాధ పడుతున్నారు. సబ్-సహారా ఆఫ్రికన్ ప్రాంతంలో 237 మిలియన్ల ప్రజలు పోషకాహార లోపంతో నరకం అనుభవిస్తున్నారు. ఓలంపిక్ డే వేదికలో క్రీడలు మాత్రమే కాకుండా సామాజికాభివృద్ధి అంశాలు కూడా చర్చించడం జరుగుతుంది. 2వ ప్రపంచ యుద్ధం కారణంగా 1940, 1944లలో ఓలంపిక్ క్రీడలు నిర్వహించలేదు.

1900 పారిస్ ఓలంపిక్స్ నుంచి ఇండియా ఓలంపిక్ క్రీడల్లో పాలుపంచుకుంటూ అథ్లెటిక్స్‌లో ఏకైక క్రీడాకారుడు నార్మన్ ప్రిచ్చర్డ్ ఏసియాలోనే తెలిసారి రెండు వెండి పథకాలు గెలవడం జరిగింది.

ఇప్పటి వరకు భారత క్రీడాకారులు 9 బంగారు, 7 వెండి, 12 రజత పతకాలు గెలవడం జరిగింది. 1920 నుంచి సమ్మర్ ఓలంపిక్స్, 1964 నుంచి వింటర్ ఓలంపిక్ క్రీడల్లో భారత జట్లు పాల్గొంటున్నాయి. సర్ దొరాబ్జీ టాటా చొరవతో 1923-24లో ఏర్పడిన ఇండియన్ ఓలంపిక్ కమిటీ నేతృత్వంలో 138 కోట్ల దేశ జనాభా కలిగి ఉన్నప్పటికీ గత శతాబ్దకాలంలో 28 ఓలంపిక్ పతకాలు మాత్రమే గెలవడం అత్యంత విచారకరం.

అదే క్రమంలో 33.3 కోట్ల జనాభా మాత్రమే కలిగిన అమెరికా 2,522 ఓలంపిక్ పతకాలు గెలుపొందడం గమనించాలి.

2048లో భారతదేశం ఓలంపిక్ మరియు పారా ఓలంపిక్ క్రీడలు నిర్వహించేందుకు సంసిద్ధతను వ్యక్తం చేస్తూ, తన గట్టి ప్రయత్నాలను ప్రారంభించింది.

మన దేశంలో 34 రాష్ట్ర ఓలంపిక్ సంఘాలు, రైల్వే మరియు సర్వీసెస్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డులు ఉన్నాయి. ప్రస్తుతం 38 జాతీయ క్రీడా ఫెడరేషన్లు సభ్యులుగా ఇండియన్ ఓలంపిక్ అసోసియేషన్ పని చేస్తున్నది.

రాష్ట్ర ఓలంపిక్ అసోసియేషన్ పరిధిలో జిల్లా ఓలంపిక్ అసోసియేషన్లు చురుకైన బాధ్యతలు నిర్వహిస్కున్నాయి. రెండవ అత్యధిక జనాభా కలిగిన ఇండియాలో క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వకపోవడం, వసతుల లేమి, మౌళిక వనరుల కొరత, ప్రోత్సాహం కొరవడడం, మితిమీరిన రాజకీయ జోక్యం లాంటి కారణాలతో ఓలంపిక్స్‌లో పూర్తి జట్లు పాల్గొంటున్నప్పటికీ పతకాల పంట పండకపోవడం అత్యంత బాధాకరం. ప్రపంచంలోనే అతి పెద్ద యువశక్తి కలిగిన యంగ్ ఇండియాలో యువత క్రీడల పట్ల ఆసక్తి కనబర్చి అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని కోరుకుందాం. ఈ లక్ష్యంతో ఇండియన్ ఓలంపిక్ అసోసియోషన్ నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ, భారతదేశ కీర్తిని క్రీడా వేదికల మీద ఇనుమడింపజేయాలని కోరుకుందాం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

బండికల్లు వెంకటేశ్వర్లు ఫౌండేషన్ 6వ జాతీయస్థాయి వచన కవితల పోటీ

గుంటూరుకు చెందిన "బండికల్లు వెంకటేశ్వర్లు ఫౌండేషన్" నిర్వహిస్తున్న 6వ జాతీయస్థాయి వచన కవితలపోటీకి కవితల్ని ఆహ్వానిస్తున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు, కవి రచయిత బండికల్లు జమదగ్ని, ప్రధాన కార్యదర్శి బండికల్లు శ్యాంప్రసాద్ సంయుక్తంగా తెలియజేస్తున్నారు. కవిత నిడివి 30 పంక్తులకు మించకూడదు. సామాజిక అంశాలను ప్రతిబింబించే కవితలకు, క్లుప్తత, గాఢత వున్న కవితలకు ప్రాధాన్యత. ఒక్కొక్కరికీ రెండు కవితల వరకు పంపే అవకాశం వుంది. ఒక్కో కవిత రెండు కాపీలు పంపాలి. కవిత రాసిన పేజీపై కవిపేరు గానీ, ఇతర సమాచారంగానీ రాయకూడదు. హామీపత్రంపై మాత్రమే ఆ వివరాలు రాయాలి. ఆసక్తి గల కవులు తమ కవితలను బండికల్లు జమదగ్ని, ఫ్లాట్‌నెం. 402, హిమజ టవర్స్, 3/10 బ్రాడీపేట, గుంటూరు-522 002 చిరునామాకు 2022 జులై 30వ తేదీలోపు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ పంపాలి. ఎంపిక విషయంలో నిర్వాహకులకు పూర్తి స్వేచ్ఛ వుంటుంది. ప్రథమ బహుమతికి ఎంపికైన కవితకు రూ.2,500/- ద్వితీయ బహుమతి కవితకు రూ.2,000/-, తృతీచ బహుమతి కవితకు రూ.1,500/- మరియు రూ.750/-ల చొప్పున నాలుగు ప్రోత్సాహక బహుమతులుంటాయని నిర్వాహకులు తెలియజేస్తున్నారు. మరిన్ని వివరాలకు బండికల్లు జమదగ్ని, సెల్: 98482 64742 నెంబరులో సంప్రదించవచ్చు.

పిల్లల్లో అమాయకత్వ చేష్టలను ఆవిష్కరించిన 'కిష్టడి కతలు'

"తెలుగులో ఒకే అంశంతో కూడిన కథలు రావడం ప్రత్యేకత అని, కాలమిస్టుగా ఒకే అంశంతో పిల్లల సున్నితతత్వ మనస్తత్వాన్ని, అమాయకత్వాన్ని ఆవిష్కరించే 'కిష్టడి కథలు' రాసిన కృష్ణస్వామిరాజు అభినందనీయులని" ప్రముఖ కథారచయిత కాటూరు రవీంద్ర త్రివిక్రమ్ అన్నారు. ఆదివారం ఉదయం స్థానిక గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో 'ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం' ఆధ్వర్యంలో తిరుపతికి చెందిన కథా రచయిత ఆర్.సి.కృష్ణస్వామిరాజు రచన 'కిష్టడి కతలు' ఆవిష్కరణ సభలో రవీంద్రత్రివిక్రమ్ ముఖ్య అతిథిగా పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు.

ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం అధ్యక్షులు సోమేపల్లి వెంకట సుబ్బయ్య అధ్యక్షతన జరిగిన ఈ సభలో ప్రముఖ కథారచయిత శ్రీకంఠస్ఫూర్తి గౌరవ అతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ "కృష్ణస్వామిరాజు రాసిన కథలు అనేక పోటీల్లో బహుమతులు లభించా"యన్నారు. ప్రముఖ రచయిత్రి వైష్ణవిశ్రీ పుస్తక సమీక్ష చేస్తూ ఇందులోని కథలన్నీ పాఠకులు చదివేరీతిలో రెండు మూడు పేజీల్లో క్లుప్తంగా అందించారని, చిన్నపిల్లల మనస్తత్వాన్ని చాల సున్నితంగా, అనేక కోణాల్లో రచయిత ఆవిష్కరించారన్నారు. రాయలసీమ మాండలికంలో, చిత్తూరు, పొత్తూరు యాసలో రాయడం ఆ ప్రాంత మానవ జీవన శైలిని ప్రతిఖింబిస్తున్నాయన్నారు. ఇందులో కిష్టడి పాత్రలో మనం కూడా మన చిన్ననాటి రోజులు గుర్తొచ్చి తడిమి చూసుకుంటామన్నారు. ఇంకా ఈ సభలో రచయిత కృష్ణస్వామిరాజుతోపాటు, ప్రముఖ రచయిత వేంపల్లి షరీఫ్, సాహితీవేత్త గుమ్మా సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని సంస్థ ప్రధాన కార్యదర్శి చలపాక ప్రకాష్ నిర్వహించగా, శర్మ సిహెచ్ వందన సమర్పణతో సభ ముగిసింది.

కోపూరి శ్రీనివాస్ స్మారక సింగిల్‌పేజీ కథల పోటీలు

ఇటీవల పిన్న వయస్సులోనే దివంగతులైన కోపూరి శ్రీనివాస్ పుట్టిన రోజు ఆగస్ట్ 9న సందర్భంగా, ఆయన పేరుతో వారి తలిదండ్రులు కోపూరి పుష్పాదేవి, రామచంద్రరావుగార్లు రమ్యభారతి పత్రిక ఆధ్వర్యంలో సింగిల్ పేజీ కథల పోటీలు నిర్వహిస్తున్నారు. ఉత్తమంగా ఎన్నికైన కథలకు-

మొదటి బహుమతి: రూ.1500/-
ద్వితీయ బహుమతి: రూ.1000/-
తృతీయ బహుమతి: రూ.500/-
ప్రోత్సాహక బహుమతులు: 3 కథలకి ఒకొక్కటి 300/- చొప్పున ఇవ్వబడతాయి.

సామాజిక స్పృహ కలిగిన అంశంతో కథ రాతలో ఎ-4లో పేజీకి మించకుండా రాసి (డిటిపి చేసినవి అయితే అరపేజీ మించకూడదు) పంపాలి. కథపై రచయిత పేరు, వివరాలు ఉండకూడదు. కేవలం ఆ వివరాలు హామీపత్రంలోనే రాసి జులై 15వ తేదిలోగా 'రమ్యభారతి' పోస్ట్‌బాక్స్ నెంబర్.5, విజయవాడ-520001 చిరునామాకు పోస్ట్ ద్వారా మాత్రమే పంపాలి. పోటీలో విజేతలైనవారికి ఆగస్ట్ నెలలో విజయవాడలో జరిగే ప్రత్యేక సభలో బహుమతీ ప్రదానం ఉంటుంది.

-చలపాక ప్రకాష్, ఎడిటర్, రమ్యభారతి

ఆగస్ట్ 15 లోగా 131 బస్తీ దవాఖానలు సిద్ధం కావాలి- మంత్రి హరీశ్‌రావు ఆదేశం

హైదరాబాద్, జూన్ 22:ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచనతో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానలు పట్టణ పేదలకు వైద్య ఖర్చుల భారాన్ని తగ్గించాయని వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు. ప్రజల సుస్తీని పోగొడుతూ.. అత్యంత ప్రజాదరణ పొందాయన్నారు. ప్రస్తుతం జీహెచ్ఎంసీలో 259 బస్తీ దవాఖానలు ప్రజలకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

ఇదే స్ఫూర్తితో జీహెచ్ఎంసీ సహా ఇతర ప్రాంతాల్లో మరో 131 బస్తీ దవాఖానలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వీటిని ఆగస్టు 15వ తేదీ నాటికి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు హరీశ్‌రావు ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే సిద్ధంగా ఉన్న 12 బస్తీ దవాఖానాలను త్వరగా ప్రారంభించాలని చెప్పారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో బస్తీ దవాఖానలపై వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులతో మంత్రి హరీశ్‌రావు బుధవారం సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. బస్తీ దవాఖానల్లో అందిస్తున్న సేవలను ఆన్‌లైన్ చేయాలన్నారు. టీ డయాగ్నోస్టిక్ సేవలు వినియోగించుకోవాలని, బస్తీ దవాఖానల్లో టెలీ కన్సల్టేషన్ సేవలు పెంచాలన్నారు. జనాభా సంఖ్యతో పాటు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని ఆయా ప్రాంతాల్లో దవాఖానాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. టీ డయాగ్నొస్టిక్ సహకారంతో బస్తీ దవాఖానల్లో ఎక్కడిక్కడే శాంపిల్స్ సేకరణ జరగాలన్నారు. రోగ నిర్ధారణ పరీక్షల ఫలితాలు త్వరగా ఇవ్వాలని, మరుసటి రోజు వైద్యుడికి రిపోర్టు చూపించి వైద్యం పొందేలా ఉండాలన్నారు. బస్తీ దవాఖానలు, టీ డయాగ్నోస్టిక్ కేంద్రాల వల్ల ఉచిత వైద్యం, రోగ నిర్ధారణ పరీక్షలకు తోడు మందులను ఉచితంగా ఇస్తుండటంతో పేదలకు ఆర్థిక భారం తప్పడమే కాకుండా, ఎంతో ఉపయోగంగా ఉందని మంత్రి హరీశ్‌రావు తెలిపారు.

సాహితీ కిరణం
ప్రపంచరికార్డులు నెలకొల్పిన శ్రీ త్యాగరాయ గానసభ
ఆహ్వానము
శ్రీ జన్నాభట్ల నరసింహప్రసాద్ రచించిన 'సంగమం' సందేశాత్మక నవల
ఆవిష్కరణ & అంకితోత్సవం
ముఖ్యఅతిథి : డా॥ముక్తేవి భారతి
ప్రముఖరచయిత్రి
సభాధ్యక్షులు : ఆచార్య ముదిగొండ శివప్రసాద్
చారిత్రక నవలాచక్రవర్తి
విశిష్ట అతిథి : శ్రీ కళా వి.ఎస్.జనార్దనమూర్తి
అధ్యక్షులు, త్రిత్యాగరాయ గానసభ
సభాప్రారంభం : శ్రీ పాత్తూరి సుబ్బారావు
సంపాదకులు, సాహితీకిరణం
గౌరవ అతిథి : శ్రీ గుదిబండి వెంకటరెడ్డి
గౌరవ సంపాదకులు, సాహితీకిరణం
ఆత్మీయ అతిథి : శ్రీ రమణవెలమకన్ని
కవి, రచయిత, విమర్శకులు
సభానిర్వహణ : శ్రీ పెద్దూరి వెంకటదాసు
సలహాదారులు, సాహితీకిరణం
కృతి స్వీకర్తలు
హైదరాబాద్ మదర్‌థెరిస్సా కమలాకరభారతి
కమలాకరభారతి ఛారిటబుల్ ట్రస్ట్, వ్యవస్థాపక అధ్యక్షురాలు
శ్రీమతి ముప్పవరం వసుమతి,
సాహిత్యాభిమాని
సాంస్కృతిక కార్యక్రమం: యస్. వల్లి కృష్ణ యశశ్విని, పి.పి.ఎల్.గీతాత్రిలచే నృత్య విభావరి
శ్రీమతి జన్నాభట్ల లక్ష్మీకామేశ్వరి లలితగీతాలు
తేది:24.06.2022, సా॥6.00గం॥లకు,
వేదిక: కళాసుబ్బారావు కళావేదిక (శ్రీ త్యాగరాయ గానసభ), చిక్కడపల్లి హైదరాబాద్
శ్రీత్యాగరాయ గానసభ
శ్రీమతి కళాకారుల దీక్షితులు
ప్రధాన కార్యదర్శి
సాహితీకిరణం
శ్రీమతి పాత్తూరి జయలక్ష్మి
మేనేజర్
లయన్ వి.వి.రామప్రసాదరెడ్డి
సలహాదారులు

కణిక

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న
'బుధవారం బాద్షా'
పోటీ ఫలితాలు

అడ్మిన్: రమాదేవి కులకర్ణి

నిర్వహణ: శ్రీమతి సత్య నీలిమ వలిపే
ఈ సమూహంలో చేరదలచినవారు 8985613123కి మెసేజ్ చేయవచ్చు.

(ప్రథమ